www.prajaswaramdaily.com
# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
మెదక్ | సంపుటి : 17 | సంచిక : 281 | పేజీలు : 10 | వెల : 1
Circulated By : Hyderabad- Medak - Sangareddy - Nalgonda - Warangal - Nizamabad- Vijayawada- Guntur - Vizag - Adilabad- kurnool | శుక్రవారం 21-06-2024

MHR TV
www. mhrtv.com



- మొదట రూ.లక్ష తర్వాత రూ.లక్షన్నర
- రెండు విడతలో... రూ.రెండు లక్షల వరకు !
- జులై మొదటి వారం నుంచి పంద్రాగస్టు లోగా పూర్తి
- కేంద్రం కిసాన్ సమ్మాన్ నిధిపై అధ్యయనం
- పలు క్యాటగిరీలకు చెందిన భూములను తొలగించే చాన్స్
- సాగు చేసే రైతుకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయం
- ఆర్థిక శాఖ, మంత్రులతో ముఖ్యమంత్రి రేవంత్ విస్తృతంగా చర్చలు

# రుణమాఫీ అర్హులు 26 లక్షల మంది..!

## దశలవారీగా అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు

*హైదరాబాద్, జూన్ 20 (ప్రజాస్వరం)*
వచ్చే నెల మొదటి వారం నుంచి రైతు రుణమాఫీని దశలవారీగా అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అమలుకు కసరత్తు చేస్తున్న ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలు, నిధుల సమీకరణ తదితర అంశాలపై ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఆగస్టు 15 కల్లా రుణమాఫీని అమలు చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గత కొన్ని రోజులుగా ఆర్థిక శాఖ అధికారులతోనూ, మంత్రివర్గ సహచరులతోనూ దీనిపై విస్తృతంగా చర్చించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కేంద్రం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి రూపొందించిన మార్గదర్శకాలను కూడా అధ్యయనం చేసిన ప్రభుత్వం, రుణమాఫీ అమలులో కేంద్ర మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీని ప్రకారం. సంస్థలకు ఉన్న భూములకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారికి, ప్రస్తుత, మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, జిల్లా పరిషత్ ఛైర్మన్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్నత కేటగిరీల్లోని ఉద్యోగులు, డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, చార్టర్డ్ ఎకౌంటెంట్లు. ఇలా పలు రంగాలకు చెందిన వారు భూములపై తీసుకొన్న రుణానికి మాఫీ ఉండదు. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకొన్న తర్వాత సుమారు 26 లక్షల రైతు కుటుంబాలకు రుణమాఫీ అమలు చేయాల్సి రావచ్చని అంచనా వేస్తున్నారు. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం జులై మొదటి వారం నుంచి దశలవారీగా అమలు చేసే ఆలోచనతో ఉన్నట్లు సమాచారం. మొదట రూ.లక్ష మిగతా 2 లో..

# జమ్మూకశ్మీర్‌కు ప్రధాని మోదీ




- నేడు, రేపు పర్యటన
- దాల్ సరస్సు ఒడ్డున అంతర్జాతీయ యోగా దినోత్సవం | 2
- రూ.1500 కోట్ల ప్రాజెక్టుల ప్రకటన
- పెద్ద ఎత్తున భద్రత ఏర్పాట్లు

# యుద్ధాన్ని ఆపిన మోదీ.. నీట్ లీక్‌ను ఆపలేకపోయాడు



- విద్యా వ్యవస్థను బీజేపీ ప్రభుత్వం ధ్వంసం చేసింది
- ఆర్ఎస్ఎస్ వ్యక్తులనే వైస్ చాన్సలర్లుగా నియమిస్తున్నారు | 2
- రాహుల్ గాంధీ మండిపాటు

# కేజ్రీవాల్‌కు బెయిల్



- రూ.లక్ష పూచీకత్తుతో మంజూరు చేసిన ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు | 2
- బుధ, గురువారాల్లో సుదీర్ఘ వాదనల అనంతరం నిర్ణయం

# తహసీల్దార్, ఆర్డీవోకూ ధరణి లాగిన్

- కలెక్టర్లకు మాత్రమే లాగిన్ ఆప్షన్ ఉండడంతో పెద్దఎత్తున పేరుకుపోతున్న దరఖాస్తులు
- సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా ప్రభుత్వ నిర్ణయం
- జూన్ నెలాఖరు నాటికి సమస్యలన్నీ పరిష్కరించాలని అధికారుల లక్ష్యం | 6
- రైతులు, భూ యజమానులకు తప్పనున్న తిప్పలు

# ఏ ఫర్ అమరావతి పీ ఫర్ పోలవరం

- ఉపాధి కోసం వలసలు వెళ్లొద్దనే అమరావతిని రాజధాని చేశాం | 2
- పోలవరం పూర్తైతే రాష్ట్రం మొత్తానికి నీళ్లొస్తాయి
- గత ఐదేండ్లు విధ్వంస పాలన చూశాం
- ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడు
- అమరావతిలో పర్యటన... నిర్మాణాల పరిశీలన


అమరావతి రాజధాని నమూనాను పరిశీలిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబునాయుడు



# 14 పంటలకు మద్దతు పెంపు

- కేంద్ర మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం
- వానకాలం సీజన్ నుంచి అమలు | 7



# ఈడీ రైడ్స్..

- పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి నివాసంలో సోదాలు
- విలువైన పత్రాలు స్వాధీనం | 7

# ఆగని మృత్యుఘోష

- కల్తీ మద్యం.. 37కు చేరిన మృతుల సంఖ్య
- మరో 55 మందికి కొనసాగుతున్న చికిత్స
- ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి
- గవర్నర్ ఆర్ఎన్ రవి సంతాపం
- ఎస్పీ సస్పెన్షన్.. కలెక్టర్ బదిలీ | 2


తమిళనాడు రాష్ట్రం కల్లకురిచి దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితులు

# ఢిల్లీలో ఎండలు.. 20 మంది మృతి



న్యూఢిల్లీ, జూన్ 20 : ఢిల్లీ ప్రజలు ఓ వైపు నీటి కష్టాలు.. మరోవైపు ఎండలతో అవస్థలు పడుతున్నారు. ఎండదెబ్బకు జనం పిట్టల్లా రాలిపోతున్నారు. 24 గంటల్లో 20 మంది ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతను అద్దం పడుతోంది. వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. వడదెబ్బతో ఆస్పత్రులకు వచ్చే బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా ఆదేశాలు జారీ చేశారు. యూపీలో వడదెబ్బకు 81 మంది ప్రాణాలు కోల్పోయారు. వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు, వేడిగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. 50 డిగ్రీల టెంపరేచర్ నమోదవుతుండటమే అన్న ఫీలింగ్.. ఢిల్లీవాసుల్లో కలుగుతోంది. సగటున 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నట్లు ఐఎండీ అధికారులు తెలిపారు. వారం రోజులుగా ఢిల్లీలో యావరేజ్ గా టెంపరేచర్ 46 డిగ్రీలపైనే ఉంటుందని స్పష్టం చేసింది. ఎండ ప్రచండ వేడిమికి జనం పిట్టల్లా రాలిపోతున్నారు. ఎండ తీవ్రత తట్టుకోలేక 46 మందికిపైగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మరో 17 మంది వెంటిలేటర్ పై చికిత్స పొందుతున్నారు.ఢిల్లీతో పాటు ఉత్తర భారతమంతా హీట్ వేవ్ జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఢిల్లీ, యూపీ, హర్యానా, ఉత్తరాఖండ్, జార్ఖండ్ తోపాటు పంజాబ్ లో వేడిగాలుల తీవ్రత మరింత పెరిగింది. గత 24 గంటల్లో ఒక్క బీహార్ లోనే 22మంది మృతి చెందారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమైపోతుంది. పెరిగిన ఉష్ణోగ్రతలతో మనుషులే కాదు..పక్షులు కూడా చనిపోతున్నాయి. ఢిల్లీ పరిసరాలతోపాటు హర్యానా, పంజాబ్, యూపీలో అనేక జంతువులు, పక్షులు ఎండ వేడిమి తట్టుకోలేక మృత్యువాత పడుతున్నాయి.ఉదయం 6 గంటల నుంచే ఢిల్లీలో ఎండల తీవ్రత కన్పిస్తోంది. ఇళ్ల నుంచి బయటకు రావడానికి జనం జంకుతున్నారు. ఢిల్లీలో ఇలాంటి ఎండలు ఎప్పుడు చూడలేదని స్థానికులు చెబుతున్నారు. ఎండల తీవ్రతను తట్టుకోవడానికి జనం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.ఢిల్లీతో పాటు యూపీలో రికార్డు స్థాయిలో టెంపరేచర్ నమోదవుతోంది. ప్రయాగ్ రాజ్లో 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎప్పుడూ చల్లగా ఉండే హిమాచల్ ప్రదేశ్ కూడా ఎండ తీవ్రతకు అల్లాడిపోతున్నది. ఇక్కడ 44 డిగ్రీల టెంపరేచర్ నమోదవుతున్నది. సగటు ఉష్ణోగ్రత కంటే 6.7 డిగ్రీలు ఎక్కువ రికార్డ్ అవుతున్నట్లు ఐఎండీ అధికారులు తెలిపారు. జమ్మూకాశ్మీర్, కాంగ్రాలోనూ ఎండలు దంచికొడుతున్నాయి. ఇక్కడ 40.8 డిగ్రీల టెంపరేచర్ నమోదవుతున్నది. జమ్మూలో ఉష్ణోగ్రత 44.3 డిగ్రీలకు టచ్ అయింది. రాజస్థాన్ లోని గంగానగర్లో అత్యధికంగా 46.2 డిగ్రీలు రికార్డైంది.

# ఆగని మృత్యుఘోష

## కల్తీ మద్యం ఘటనలో 37కు చేరిన మృతుల సంఖ్య

చెన్నై, జూన్ 20: కల్తీ సారా వ్యవహారం తమిళనాడు రాష్ట్రాన్ని కుదిపేస్తోంది. తమిళనాడులోని కళ్లకురిచ్చి జిల్లా కరుణాపురం గ్రామంలో గంటగంటకు మరణాల సంఖ్య పెరుగుతోంది. తాజాగా కల్తీ సారా తాగిన ఘటనలో మృతుల సంఖ్య 26కు చేరింది. మరో 60 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో 30 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. బాధితుల ఆర్తనాదాలతో ఆస్పత్రులు నిండిపోయాయి. కల్తీ సారా సేవించిన వారు వరుసగా మృతి చెందుతుండటంతో.. అప్పటికే సారా సేవించిన వారంతా ఆస్పత్రులకు పరుగులు తీశారు. దీంతో కల్లకురిచి ప్రభుత్వ ఆస్పత్రి బాధితులతో నిండిపోయింది. వీరి లో 30 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలోని జిప్మర్ ఆస్పత్రికి తరలించారు. కళ్లకురిచ్చి ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను జిల్లా కలెక్టర్ ఎంఎస్ ప్రశాంత్ పరామర్శించారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ.. 'కల్లకురిచి లో కల్తీ మద్యం సేవించి మరణించిన వార్త విని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. నేరాలను నిరోధించడంలో విఫలమైన అధికారులపై కూడా చర్యలు తీసుకున్నాం. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారి గురించి ప్రజలు తెలియజేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం, సమాజాన్ని నాశనం చేసే ఇలాంటి నేరాలను సహించబోమ'ని సీఎం స్టాలిన్ ఓ ప్రకటనలో తెలిపారు. తమిళనాడు గవర్నర్ ఆర్ ఎన్ రవి కూడా మృతి చెందిన వారికి సంతాపం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఘటనను సీరియస్ గా తీసుకున్న ప్రభుత్వం జిల్లా ఎస్పీ సమయసింగ్ మీనాపై సస్పెన్షన్ వేటు వేసింది. అలాగే కలెక్టర్ శ్రావణ్ కుమార్ ను కూడా బదిలీ చేసింది. 18 ప్రత్యేక వైద్య బృందాలను చెన్నై నుంచి కళ్లకురిచ్చికి పంపించినట్లు ప్రభుత్వం తన ప్రకటనలో వెల్లడించింది.

# జమ్మూకశ్మీర్‌కు ప్రధాని మోదీ

**న్యూ ఢిల్లీ, జూన్ 20** : ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజులపాటు జమ్మూ కశ్మీర్‌లో పర్యటించనున్నారు. మూడోసారి ప్రధాని అయిన తర్వాత మోదీ జమ్మూ కశ్మీర్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. శుక్రవారం జూన్ 21 ఇంటర్నేషనల్ యోగా దినోత్సవం. ఈసందర్భంగా ప్రధాని మోదీ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శ్రీనగర్‌లోని దాల్ సరస్సు ఒడ్డున యోగా దినోత్సవాన్ని జరుపుకోనున్నారు. యోగా దినోత్సవానికి ముందు ప్రధాని మోదీ యువతతో ఓ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొంటారు. శ్రీనగర్‌లోని షేర్-ఎ-కశ్మీర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ కేంద్రపాలిత ప్రాంతంలో ఇటీవలి కాలంలో కొన్ని ఉగ్రవాద ఘటనలు కూడా చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ప్రధాని పర్యటన దృష్ట్యా, మొత్తం శ్రీనగర్‌ను రెడ్ జోన్‌గా మార్చారు. షేర్-ఎ-కశ్మీర్ ఇంటర్నేషనల్ సెంటర్, దాల్ సరస్సు చుట్టూ పక్షులు కూడా తిరగలేనంతగా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. కాగా ప్రధాని తన పర్యటన లో జమ్మూ కాశ్మీర్‌కు 1500 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను బహుమతిగా ఇవ్వనున్నారు. అనంతరం నేడు ఉదయం 6:30 గంటలకు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శ్రీనగర్‌లో యోగా కార్యక్రమంలో పాల్గొంటారు. 2015 నుంచి ప్రతిఏటా యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకలకు ప్రధాని నాయకత్వం వహిస్తున్నారు. ఢిల్లీ, చండీగఢ్, డెహ్రాడూన్, రాంచీ, లక్నో, మైసూర్, న్యూయార్క్‌లోని ఐక్య రాజ్యసమితి ప్రధాన కార్యాలయంతో సహా పలు ప్రతిష్టాత్మక ప్రదేశాలలో యోగా దినోత్సవ వేడుకల కు ఆయన నాయకత్వం వహించారు. ఈ ఏడాది యోగా దినోత్స వం థీమ్ 'యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ', వ్యక్తిగత, సామాజిక శ్రేయస్సును ప్రోత్సహించడంలో దాని ద్వంద్వ పాత్రను హైలైట్ చేస్తుంది. ఈ కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లో అట్ట డుగు స్థాయి భాగస్వామ్యా న్ని, యోగా వ్యాప్తిని ప్రోత్సహిస్తుందని పీఎంఓ తెలిపింది.

# విచారణ చేయకుండా ఏదీ తేల్చలేం

## నీట్ వివాదంపై కేంద్ర విద్యాశాఖ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, జూన్ 20 : నీట్ వ్యవహారం దేశవ్యాప్తంగా అలజడి రేపుతోంది. ఈ మేర కు కేంద్ర విద్యాశాఖ కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ వివాదంపై బ్రీఫింగ్ ఇచ్చింది. ఈ విషయంలో అప్పుడే ఏదీ తేల్చలేమని స్పష్టం చేసింది. నిందితులపై కఠిన చర్య లు తీసుకుంటామని తేల్చి చెప్పింది. చర్యలు తీసుకోవడంలో ఏ మాత్రం వెనకడు గు వేయమని వెల్లడించింది. పూర్తి వివరాలు ఇప్పుడే వెల్లడిస్తే అది విచారణపై ప్రభావం చూపించే అవకాశముందని పేర్కొన్నది. విద్యార్థుల ఆందోళనను అర్థం చేసుకోగలమని వివరించింది. ప్రస్తుతానికి విచారణ కొనసాగుతోందని స్పష్టం చేసింది. తప్పుని కప్పిపుచ్చుకోవడం సరికాదనే ఉద్దేశంతోనే ఎగ్జామ్‌ని రద్దు చేశామని వెల్లడించింది. కేంద్ర విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ గోవింద్ జైస్వాల్ ఈ మేరకు మీడియాతో మాట్లాడారు. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఇచ్చిన సమాచారాన్ని పరిగణనలోకి తీసుకునే పరీక్షను రద్దు చేశామని తెలిపారు. ఈ వివాదాన్ని సీబీఐకి అప్పగించామని విచారణ జరుగుతోందని స్పష్టం చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అనేది ప్రత్యేక వ్యవస్థ. దానికంటూ ఓ మెకానిజం ఉంది. దీనంతటిపైనా విచారణ కొనసాగుతోందని, త్వరలోనే మరోసారి పరీక్ష నిర్వహి స్తామని, ఆ డేట్‌ని వెల్లడిస్తామన్నారు. ఈ సారి ఓఎంఆర్ పద్ధతిలో ఎగ్జామ్ ఎందుకు పెట్టారన్న ప్రశ్నకి సమాధానమిచ్చారు గోవింద్ జైస్వాల్. అందరూ కలి సి ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఈ సారి నీట్ ఎగ్జామ్‌కి సంబంధించి పలు సమస్యలు తలెత్తాయని, వాటిలో ఒక్కో సమస్యని పరిష్కరిం చుకుంటు న్నామని వివరించారు. ముందుగా గ్రేస్ మార్క్ గురించి చర్చ జరిగిందని, ఆ తరవాత పేపర్ లీకేజీ తెరపైకి వచ్చిందని అన్నారు. గుజరాత్‌లో మాల్ ప్రాక్టీస్ జరిగిన విషయమూ తమ దృష్టికి వచ్చిందని తెలిపారు.

# కేజ్రీవాల్‌కు బెయిల్

- రూ.లక్ష పూచీకత్తుతో మంజూరు చేసిన ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు

**ఢిల్లీ, జూన్ 20:** ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నేషనల్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కు ఢిల్లీ మద్యం పాలసీ కేసులో భారీ ఊరట లభించింది. రూ.1 లక్ష పూచీకత్తుతో కేజ్రీవాల్ కు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు తాజాగా తీర్పును ఇచ్చింది. ఇటీవల లోక్ సభ ఎన్నికల సందర్భంగా 15 రోజుల మధ్యంతర బెయిల్ ను సుప్రీంకోర్టు మంజూరు చేసింది. అయితే రెగ్యులర్ బెయిల్ కోసం కింది కోర్టుకు వెళ్లాలని సూచించింది. ఈ క్రమంలోనే ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో గతంలోనే రెగ్యులర్ బెయిల్ కోసం కేజ్రీవాల్ పిటిషన్ దాఖలు చేశారు. కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్ పై ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో బుధవారం, గురువారం సుదీర్ఘ వాదనలు జరగ్గా.. వాటన్నింటినీ పరిశీలించిన కోర్టు తీర్పును రిజర్వ్ చేసి.. తాజాగా బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది.

# నేడు టీజీ మంత్రివర్గ సమావేశం

## రుణమాఫీ అర్హత నిర్ధారణే ప్రధాన ఎజెండా

**హైదరాబాద్, జూన్ 20, (ప్రజాస్వరం):** నేడు తెలంగాణ మంత్రివర్గ సమావేశం జరగనున్నది. రైతు రుణమాఫీకి అర్హత నిర్ధారణే ప్రధాన ఎజెండాగా సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఆగస్టు 15లోగా రైతు పంట రుణాలను మాఫీ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ఇదే అంశంపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. రుణమాఫీకి సుమారు రూ.30 వేల కోట్లు అవసరమని ఆర్థిక శాఖ ప్రతిపాదించడంతో, అందుకు అవసరమైన నిధుల సేకరణ, విధి విధానాల రూపకల్పనపై కీలక నిర్ణయాలు తీసుకోనుంది

# యుద్ధాన్ని ఆపిన మోదీ.. నీట్ లీక్‌ను ఆపలేకపోయాడు

- విద్యా వ్యవస్థను బీజేపీ ప్రభుత్వం ధ్వంసం చేసింది
- రాహుల్ గాంధీ మండిపాటు



**న్యూఢిల్లీ, జూన్ 20:** నీట్ వివాదంపై రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఈ ఎగ్జామ్‌ని రద్దు చేయడం పైనా అసహనం వ్యక్తం చేశారు. భారత్ జోడో యాత్రలో వేలాది మంది విద్యా ర్థులు పేపర్ లీక్‌లపై తనతో చర్చించారని గుర్తు చేశారు. విద్యాసంస్థలతో పాటు మొత్తం వ్యవస్థను బీజేపీ తన చేతుల్లోనే పెట్టుకుందని, అందుకే ఇలాంటివి జరుగుతున్నాయని విమర్శించారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపిన మోదీ పేపర్ లీక్‌లను ఆపలేకపోయారని చురకలు అంటించారు. ఆర్ఎస్ఎస్ కి చెందిన వాళ్లనే ఏరికోరి విద్యాసంస్థల్లో వైస్ చాన్స్‌లర్‌లుగా నియమిస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ పూర్తిగా విద్యావ్యవస్థను ధ్వంసం చేసిందని ఆరోపించారు. పెద్ద నోట్ల రద్దుతో ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీసినట్టే ఇప్పుడు విద్యావ్యవస్థనీ ఇలాగే నాశనం చేస్తున్నారని విమర్శించారు. నీట్ పేపర్ లీక్‌లో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "విద్యావ్యవస్థ ఇంత గందరగోళంగా మారడానికి కారణం ఆర్ఎస్ఎస్. ఈ పరిస్థితి మారనంత వరకూ ఇలా పేపర్ లీక్‌లు జరుగు తూనే ఉంటాయి. మోదీ విద్యాసంస్థల్ని తన చెప్పుచేతల్లో పెట్టుకున్నారు. దాదాపు అన్నిచోట్లా ఆ సంస్థకు (ఆర్ఎస్ఎస్)చెందిన వ్యక్తుల్నే వైస్‌చాన్స్‌లర్‌లుగా నియమిస్తున్నారని అన్నారు.

# పోలీసులతో నా భద్రతకు ముప్పు

## బెంగాల్ గవర్నర్ సంచలన వ్యాఖ్యలు

**కోల్ కతా జూన్ 20:** పోలీసులతో తన భద్రతకు ముప్పు ఉందని బెంగాల్ గవర్నర్ సి.వి. ఆనంద బోస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ప్రస్తుతం విధుల్లో ఉన్న ఇన్ చార్జి అధికారి, ఆయన టీమ్ వల్ల నా భద్రతకు ముప్పు ఉంది. ఇప్పటికే నేను ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి సమాచారం ఇచ్చాను. కానీ ఇంత వరకు చర్యలు లేవు'' అని ఆందోళన వ్యక్తం చేశారు

# రిజర్వేషన్ల కోటాను కొట్టేసిన బీహార్ హైకోర్టు


**పాట్నా జూన్ 20:** బీహార్ లో బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీలకు 65 శాతం రిజర్వేషన్ల కోటాను పాట్నా హైకోర్టు గురువారం కొట్టేసింది.ఆర్టికల్స్ 14, 15,16 కింద సమానత్వ క్లాజ్ కు విరుద్ధంగా ఉన్నందున బీహార్ రిజర్వేషన్ చట్టం2023 చట్టాన్ని పక్కన పెట్టేసింది.బీహార్ 2023లో తీసుకొచ్చిన శాసనం బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ కోటాను 50 శాతం నుంచి 65 శాతానికి పెంచేందుకు ఉద్దేశించింది. ఈ చట్టంతో బీహార్లో రిజర్వేషన్లు మొత్తం 75 శాతానికి చేరుకుంటాయి. దీంతో రిజర్వేషన్లు ఇచ్చే అతి పెద్ద రాష్ట్రంగా బీహార్ అయ్యేది. కానీ కోర్టు ఈ చట్టం ప్రతిపాదనను ఆమోదించలేదు. ప్రస్తుతానికి రిజర్వేషన్ల కోటా పరిమితి 50 శాతం మేరకే ఉంది. దానికి మించి రిజర్వేషన్లు కల్పించే చట్టాలను కోర్టులు తిరస్కరిస్తున్నాయి.

# పాలేరుకు మూడేండ్లలోపే... ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం

## త్వరలోనే అర్హులైన వారందరికీ రేషన్ కార్డు, పింఛన్

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## పాలేరు నియోజవర్గం కూసుమంచిలో పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం జూన్ 20 (ప్రజాస్వరం) :** పాలేరు నియోజకవర్గంలోని ఇళ్లులేని పేదలందరికీ మూడేళ్లలోపే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. కూసుమంచి మండలం జీళ్లచెర్వు, కేశవాపురం, ధర్మతండా, పోచారం, కిష్టాపురం, పాలేరు, ఎర్రగడ్డ తండా, నర్సింహులగూడెం, సంధ్యా తండా, లాల్ సింగ్ తండా, గెగోళ్ళపల్లి, చౌటపల్లి, బోడియా తండా తదితర గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాలేరు ప్రజలు తనను భారీ మెజారిటీతో గెలిపించారని వారి రుణం తీర్చుకుంటానని హామీ ఇచ్చారు. అతి కొద్దిరోజుల్లోనే అర్హులైన వారికి రేషన్ కార్డులు, పెన్షన్లను అందిస్తామని తెలిపారు. వచ్చేనెల నుంచి రైతు రుణమాఫీని అమలు జరుగుతుందని పేర్కొన్నారు. పేదోళ్ల ప్రభుత్వంలో పేదవారి కోరికలు అన్ని తీరుతాయన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్డు, డ్రైనేజీ లను మొదటి ఏడాదిలోనే పూర్తి చేసే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని ప్రతీ ఒక్కరి సమస్యను తీరుస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో పొంగులేటితో పాటు ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్ లు, వార్డు మెంబర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కూసుమంచి మండలంలోని పలువురు కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు పాలేరు గ్రామంలో చెక్కులను అందించారు.

# ఓదార్పు యాత్ర 2.0

## ఎన్నికల అనంతరం దాడుల్లో గాయపడ్డ, చనిపోయిన వారి కుటుంబాల పరామర్శించనున్న మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి

## డిసెంబర్ నుంచి శ్రీకారం చుట్టే అవకాశం

## తాడేపల్లిలో వైసీపీ విస్తృత స్థాయి సమావేశం




వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి

**విజయవాడ, జూన్ 20, (ప్రజాస్వరం):** వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మళ్లీ ఓదార్పు యాత్రచేపట్టనున్నారు. గురువారం తాడేపల్లిలో జరిగిన వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల అనంతరం జరిగిన రాజకీయ దాడుల్లో గాయపడ్డవారిని ఆయన పరామర్శించనున్నారు. ఈ సమావేశంలో పోటీ చేసిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు, గెలిచిన ఎమ్మెల్యేలు హాజరయ్యారు. వైసీపీ ఓటమితో కుంగిపోయి మృతి చెందిన కుటుంబాలను పరామర్శిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది డిసెంబర్ నుంచి లేదా వచ్చే ఏడాది జనవరి నుంచి ఆయన ఓదార్పు యాత్ర చేపట్టనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి, ప్రతి గడపకూ మనం చేసిన మంచిని ప్రజలు మరిచిపోరని వైఎస్ జగన్ పార్టీ నేతలతో అన్నారు. 'ఇదే ప్రజలు 2029 నాటికి చంద్రబాబు మోసాలు, ప్రలోబాలు గుర్తించి రెట్టించిన ఉత్సాహంతో వైసీపీని అధికారంలోకి తెచ్చుకుంటారు. ఈసారి ఎన్నికల్లో 40 శాతం ఓట్లు షేర్ అంటే 2019తో పోలిస్తే కేవలం 10 శాతం ఓట్లు తగ్గాయి. ఈ 10 శాతం ప్రజలు కూడా చంద్రబాబు మోసాలు, ప్రలోబాలను గుర్తిస్తారు. ప్రతీ కుటుంబానికి మనం చేసిన మంచి ఏంటో ప్రజలకు తెలుసు. విశ్వసనీయతకు మనం చిరునామా. మనం చేసిన మంచే మనకు శ్రీరామరక్ష. ప్రజలకు మరింత దగ్గరయ్యే కార్యక్రమాలు, ప్రజల తరఫున పోరాటాలు చేస్తాం. ఏకంగా స్పీకర్ పదవి తీసుకోబోయే వ్యక్తి మాట్లాడుతున్న మాటలు మనం సోషల్ మీడియాలో చూస్తున్నాం. ఇలాంటి కౌరవులు ఉండే సభకు మనం వెళ్లాల్సి ఉంటుంది.' అని జగన్ పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓడిపోయామన్న భావనను మనసులోంచి తీసేయాలని పార్టీ నేతలకు వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు. 'మేనిఫెస్టోలో 99 శాతం హామీలను అమలు చేసినా ఎన్నికల ఫలితాలు ఇలా రావడం ఆశ్చర్యం కలిగించింది. ఫలితాలు చూసిన తర్వాత శకుని పాచికల కథ గుర్తుకువచ్చింది. శకుని పాచికల మాదిరిగా ఎన్నికల ఫలితాలు వచ్చాయి. కానీ ఆధారాలు లేకుండా ఏమీ మాట్లాడలేం. ఇప్పుడు కేవలం ఇంటర్వెల్ మాత్రమే. శ్రీకృష్ణుడు తోడుగా ఉన్నా పాండవులు ఓడిపోతారు. ధర్మం, విశ్వసనీయత, నిజాయతీ తప్పకుండా గెలుస్తాయి. ప్రతి ఒక్కరూ ఒక అర్జునుని మాదిరిగా తిరిగి విజయం సాధిస్తారు.' అని జగన్ పేర్కొన్నారు.

# రుణమాఫీ అర్హులు 26 లక్షల మంది

(మొదటి పేజీ తరువాయి)

వరకు ఉన్న రుణాన్ని మాఫీ చేయనున్నట్లు తెలిసింది. దీనికి సుమారు రూ. ఆరు వేల కోట్లు అవసరమని సమాచారం. తర్వాత రూ. లక్షన్నర వరకు అమలు చేసే అవకాశం ఉంది. దీనికి మరో రూ.6,500 కోట్లు అవసరమని సమాచారం. ఈ రెండు దశల్లో సుమారు 16 లక్షల రైతు కుటుంబాలకు రుణమాఫీ అమలవుతుందని తెలిసింది. రూ.రెండు లక్షల వరకు ఉన్న వారికి తర్వాత రెండు దశల్లో అమలు చేయనున్నట్లు సమాచారం. జులైలో కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ను ప్రవేశపెట్టి, మిగిలిన రుణ మాఫీ అమలుకు నిధులను సమీకరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.సాగు చేసే రైతుకు మాత్రమే రైతుభరోసా,రైతుభరోసా అమలుకు సంబంధించిన మార్గదర్శకాలపైనా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్చించి ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. గుట్టలు, కొండలు, రియల్ ఎస్టేట్ లేఅవుట్ల లాంటివన్నీ మినహాయించనున్నారు. సాగు చేసే రైతుకు మాత్రమే రైతుభరోసా దక్కాలనేది ప్రభుత్వ ఉద్దేశమని, దీనికి



తగ్గట్లుగానే మార్గదర్శకాలుంటాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎన్ని ఎకరాల భూమి ఉన్నా, ఒక రైతుకు ఐదు ఎకరాలకు మాత్రమే రైతుభరోసాను పరిమితం చేయనున్నట్లు తెలిసింది.

# ఏ ఫర్ అమరావతి.. పీ ఫర్ పోలవరం

- గత ఐదేండ్లు విధ్వంస పాలన చూశాం
- వైసీపీ హయాంలో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- అమరావతిలో పర్యటన... నిర్మాణాల పరిశీలన

**విజయవాడ, జూన్ 20, (ప్రజాస్వరం):** ఏపీ అంటే అమరావతి, పోలవరం అని.. రాజధాని అంటే ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాదని సీఎం చంద్రబాబు అన్నారు. గురువారం అమరావతి నిర్మాణాల పరిశీలన అనంతరం సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరూ ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లకుండా ఉండాలనే ఉద్దేశంతోనే అమరావతిలో రాజధాని నిర్మాణం చేపట్టామని చెప్పారు. పోలవరం పూర్తైతే రాష్ట్రం మొత్తానికి నీరు వస్తుందనే ఉద్దేశంతో దానిని పూర్తి చేసేందుకు ప్రాధాన్యత ఇచ్చాం. అందుకోసం విభజన చట్టం తోడ్పాటు తీసుకున్నాం. రాజధాని అమరావతి ఆంధ్రప్రదేశ్ ప్రజలందరి చిరునామా. ఆ తర్వాత ఐదేళ్లు రాష్ట్రంలో విధ్వంస పాలన చూశాం. రాజకీయాలకు పనికిరాని, అర్హత లేని వ్యక్తి సీఎం అయితే ఎలా ఉంటుందో గత ఐదేళ్లలో ప్రత్యక్షంగా చూశాం. అందుకే జగన్ లాంటి ముఖ్యమంత్రి మనకు అవసరం లేదని ప్రజలు తిప్పికొట్టారు. ఇటీవల ఎన్నికల్లో కూటమికి కనివినీ ఎరుగని విజయాన్ని కట్టబెట్టారు. వైసీపీ 11 సీట్లకే పరిమితమైందని పేర్కొన్నారు.

వైసీపీ హయాంలో అమరావతి రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. 1631 రోజులు ఆందోళన చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అపార నమ్మకంతో ఆ పోరాటాన్ని విరమించారు. రైతులందరికీ మనస్ఫూర్తిగా నమస్కారాలు.' అని చంద్రబాబు అన్నారు.పోలవరం రాష్ట్రానికి వరమని.. కానీ వైసీపీ పాలనలో పోలవరం అది శాపంగా మారిందని చంద్రబాబు విమర్శించారు. 'పోలవరం పూర్తైతే రాయలసీమ రతనాల సీమగా మారుతుంది. వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టును గోదారిలో కలిపేసింది. కేంద్ర నిధులతో పోలవరాన్ని కట్టి, నదుల అనుసంధానం వంటి విధానాలు, ఇక్కడి నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటే సాగునీటి రంగానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. పోలవరం సందర్శించాక చాలా బాధేస్తోంది. జగన్ పాలన ప్రజావేదిక కూల్చివేతతోనే ప్రారంభమైంది. వైసీపీ పాలనలో అమరావతిలోని నమూనాలను కొన్ని అల్లరిమూకలు ధ్వంసం చేశాయి. ఇక్కడి రైతులు వాటిని కాపాడుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేశారు. పైపులు, రోడ్డు, మట్టిని దొంగతనం చేస్తున్నా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎక్కడ కట్టిన బిల్డింగులు అక్కడే ఉన్నాయి. ఐకానిక్ కట్టడాలన్నీ అలానే నిలిచిపోయాయి. ఐఏఎస్, ఐపీఎస్ భవనాలు, అసెంబ్లీ బిల్డింగ్ ఉండాల్సిన చోట తుమ్మచెట్లు మొలిచాయి. కేంద్ర ప్రోత్సాహంతో రాష్ట్రంలోని 11 కేంద్రీయ విద్యా సంస్థలు ఏర్పాటు చేశాం. అన్ని ప్రాంతాల అభివృద్ధికి స్పష్టమైన విధానం ప్రకటించాం.' అని వివరించారు.

'వైసీపీ ప్రభుత్వం 3 రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడింది. అమరావతి బ్రాండ్ దెబ్బతీయాలని చూశారు. విషం చిమ్మి సింగపూర్ కన్సార్టియం తరిమేశారు. స్వచ్ఛందంగా రైతులు భూములిస్తే ఎన్నో అవమానాలకు గురి చేశారు. రాజధాని ఏదీ అని చెప్పుకోలేని దుస్థితికి తీసుకొచ్చారు. తెలుగుజాతి గర్వంగా తలెత్తుకునేలా రాజధాని నిర్మాణం ఉండాలి. కర్నూలును ఆధునిక నగరంగా తయారుచేయాలి. రుషికొండను నాశనం చేశారు. ఎన్నో అప్పులు చేశారు. ఖజానా మొత్తం ఖాళీ అయ్యింది. గత సీఎంలు అభివృద్ధి చేశారు. జగన్‌లా ఎవరూ చేయలేదు.' అని సీఎం చంద్రబాబు వైసీపీ ప్రభుత్వం, జగన్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

**ప్రజావేదిక నుంచి యాత్ర..**

ఏపీ సీఎం చంద్రబాబు గురువారం అమరావతిలో పర్యటించారు. ఉండవల్లి ప్రజావేదిక నుంచి పర్యటన ప్రారంభించిన ఆయన.. జగన్ ప్రభుత్వం కూల్చేసిన ప్రజావేదిక శిథిలాలను పరిశీలించారు. ఉద్దండరాయుని భూమి పూజ ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ చంద్రబాబు మోకాళ్లపై కూర్చుని సాష్టాంగ నమస్కారం చేశారు. అనంతరం రాజధాని నిర్మాణాలను పరిశీలించారు. సీడ్ యాక్సెస్ రోడ్, అసంపూర్తిగా మిగిలిన అఖిల భారత సర్వీస్ అధికారులు, మంత్రులు, న్యాయమూర్తుల గృహ సముదాయాన్ని పరిశీలించారు. ఐకానిక్ నిర్మాణాల కోసం గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు మొదలుపెట్టిన ప్రాంతాలనూ పరిశీలించారు. కాగా, వైసీపీ హయాంలో 3 రాజధానుల పేరుతో ఈ ప్రాంతంలో నిర్మాణాలు ఆగిపోయాయి. ఈ క్రమంలో వాటిని పరిశీలించి ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయనున్నారు.

కాగా, సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలిసారిగా పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం రాజధాని అమరావతిలో పర్యటించారు. అటు, సీఎంగా ఆయన బాధ్యతలు చేపట్టక ముందు నుంచే అధికారులు ఇక్కడ పనులు చేపట్టారు.

# ఏపీకి నిధుల వరద పారుతోందా..

**విజయవాడ, జూన్ 20 (ప్రజాస్వరం):**

చంద్రబాబు గెలిచారు. సీఎం అయ్యారు. వెంటనే ఐదు సంతకాలు పెట్టారు. కానీ చాలా మంది సంతకాలు పెడితే పనైపోతుందా అమలవ్వాలి కదా అని మనసులో అనుకుంటున్నారు. ఎందుకంటే ఏపీ ఆర్థిక పరిస్థితి అలా ఉంది మరి. జగన్మోహన్ రెడ్డి ప్రతీ వారి ఆర్బీఐ ముందు కనీసం నాలుగు వేల కోట్ల అప్పుల కోసం నిలబడేవారు. వాటికి తోడు కనిపించిన ప్రతీ ఆస్తి తాకట్టు పెట్టేశారని టీడీపీ నేతలు ఆరోపిస్తూ వస్తున్నారు. ఆదాయం పెరగలేదు. మరి ఎలా అమలు చేస్తారన్నదే సందేహం. ఏపీ కంటే మెరగైన ఆర్థిక పరిస్థితి ఉన్న తెలంగాణలో మాత్రం పథకాల అమలుకు తంటాలు పడుతున్నారు. చంద్రబాబు పాలన మొదలైంది నిర్ణయాలు వేగంగా తీసుకుంటున్నారు తొలి నిర్ణయాలుగా ఏకంగా ఐదు ఫైల్స్‌పై సంతకం చేశారు చంద్రబాబు. తొలి సంతకం మెగా డీఎస్సీ తాను అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ రిలీజ్‌పై తొలి సంతకం చేస్తానన్నారు చంద్రబాబు. ఇచ్చిన మాటకు అనుగుణంగా ఆయన తొలి సంతకం చేశారు. పెన్షన్ల పెంపు సహా మరో మూడు సంతకాలు పెట్టారు. ఇవన్నీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారాలే. ముఖ్యంగా సామాజిక పెన్షన్లు. ఇప్పుడు నెలకు పందొమ్మిది వందలకోట్ల వరకూ ఖర్చు అవుతున్నాయి. అది వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మూడు వేల కోట్లపైనే అవుతుంది. అదేమీ చిన్న మొత్తం కాదు. 250 పెంచడానికి జగన్మోహన్ రెడ్డి మూడేళ్ల సమయం తీసుకున్నారు. కానీ చంద్రబాబు ఒక్క సంతకంతో వెయ్యి పెంచారు. ఇతర విభాగాల వాళ్లకు పదిహేను



వేలుదాకా చేశారు. ఇక మెగా డీఎస్సీ కూడా అనౌన్స్ చేశారు. ఇవన్నీ దీర్ఘకాలంలో ఖర్చులను పెంచేవే. ఇంత క్లిష్టమైన ఆర్థిక పరిస్థితుల్లో చంద్రబాబు ఎలా హామీలు చేస్తారనేది సస్పెన్స్ గా మారింది. పరిస్థితిపై చంద్రబాబు సమీక్ష చేశారా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. అయితే సీఎం ఆషామాషీగా చేసి ఉండరని ఆయన లెక్కలు ఆయనకు ఉంటాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. కేంద్రం నుంచి అందే సహకారం.. ఆటోమేటిక్ గా ఏపీలో పెరిగే పెట్టుబడులు, వ్యవహారాలు, వైసీపీ నేతలు దోచిన ఆదాయాన్ని నిలిపేయడం ద్వారా సర్కార్ కు పెరిగే ఆదాయం వంటి వాటివి అంచనా వేసుకునే హామీల అమలు ప్రారంభించారని భావిస్తున్నారు. కేంద్రంలో కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ పదవుల కోసం పట్టుబట్టలేదు. బీజేపీ ఎన్ని ఇస్తే అన్నే తీసుకున్నారు. రాష్ట్రం కోసమే తాను రాజకీయం చేస్తానని అంటున్నారు. ఆయన ప్రధానంగా రాష్ట్రానికి ఆర్థిక సాయం కోరుకున్నారని ఆ మేరకు హామీ వచ్చిందని ఢిల్లీలో ప్రచారం జరుగుతోంది. ఏపీతో పాటు ఎన్డీఏలో మరో కీలక భాగస్వామి అయిన జేడీయూ నేత నితీష్ సీఎంగా ఉన్న బీహార్‌కు సాయం అందబోతోందని చెబుతున్నారు. ఇలాంటి ఓ రిపోర్టుపై .. కేటీఆర్ స్పందించారు ప్రాంతయ పార్టీల వల్ల అదే లాభమన్నారు. మరో వైపు ఏపీలో చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలతో తెలంగాణ ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. ఏపీ అంత విరివిగా పథకాలు అమలు చేయగలిగినప్పుడు మెరుగైన ఆర్థికపరిస్థితి ఉన్న తెలంగాణ ప్రభుత్వం ఎందుకు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. అయితే తెలంగాణకు గత ప్రభుత్వం చేసిన అప్పులకు కట్టాల్సిన వాయిదాలు పెనుభారంగా ఉన్నాయి. ముఖ్యంగా కాళేశ్వరం కోసం తీసుకున్న అప్పు భారంగా మారింది. అదే సమయంలో ఆర్బీఐ నుంచి తీసుకొచ్చే అప్పుల్ని తగ్గించుకున్నారు. తీసుకునే అప్పుల కన్నా తిరిగి చెల్లించేవే ఎక్కవగా ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. అయితే ప్రజలకు ఈ కారణాలు నచ్చవు.. వారికి ప్రభుత్వం హామీలు అమలు చేసిందా లేదా అన్నదే ముఖ్యం. చంద్రబాబు సంతకాలు చేశారు కానీ ఇంకా అమలు కాలేదు. సంతకాల పవర్ మరో పదిహేను రోజుల నుంచి తేలనుంది. ఆ రోజున... ఒక్కో పెన్షన్ దారునికి ఏడు వేలు ఇస్తారు. ఆ తర్వాత నుంచి నాలుగు వేలు ఇస్తారు. అవి చేతికి అందితే... చాలా వరకూ సక్సెస్ అయినట్లే. లేకపోతే ఇబ్బందికరమే. ధనిక రాష్ట్రం తెలంగాణలో కేసీఆర్ సర్కార్ ఏపీతో పోలిస్తే చాలా తక్కువే అప్పులు చేశారు. అయినా రేవంత్ సర్కార్ హామీల అమలు కోసం కిందా మీదా పడుతుంది. చంద్రబాబుకు ఏ సమస్యలూ లేకపోతే.. రాకపోతే ఆయన గొప్పతనమే అనుకోవచ్చు.

## పడిపోయిన మిర్చి ధర...

# గౌడన్‌కు పంట




**గుంటూరు, జూన్ 20 (ప్రజాస్వరం):**

రాష్ట్రంలో మిర్చి ధరలు పతనమయ్యాయి. గత ఏడాది మేలో క్వింటాల్ మిర్చి కనీస ధర రూ.9 వేలు, గరిష్ట ధర రూ.26,500 పలికాయి. ఈ ఏడది ధరలు తగ్గడంతో క్వింటాల్ కనీస ధర రూ.8 వేలు, గరిష్ట ధర 20,700కి పడిపోయింది. తేజ మంచి రకానికి చెందిన మిర్చీ మాత్రమే క్వింటాల్ రూ.19,500 ధర పలుకుతోంది. మిగిలిన అన్నిరకాల మిర్చి ధరలు గణనీయంగా తగ్గాయి. ఎగుమతులు ప్రారంభంకాకపోవడంతో కోల్డ్ స్టోరేజీల్లో మిర్చి నిల్వలు పేరుకుపోతున్నాయి. ఇప్పటికే 75 లక్షల మిర్చి బస్తాలు అక్కడ నిల్వ ఉన్నాయి.ఆరుగాలంపాటు చమటోడ్చి పండించిన మిర్చీ పంటను అమ్ముకుని నాలుగు కాసులు చూస్తామనుకున్న రైతుకు ధరలు పడిపోవడంతో నిరాశ ఎదురైంది. ఎగుమతులు ఎప్పుడెప్పుడు ప్రారంభమవుతాయా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇక ఇప్పటికే రాష్ట్రంలో తొలకరి ప్రారంభం కావడంతో మిరప నాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. మన దేశం నుంచి సుమారు 20 దేశాలకు మిర్చి ఎగుమతి అవుతుంది. మిర్చి ఉత్పత్తిలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. 2022-23 వార్షిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.10,440 కోట్ల విలువైన మిర్చి విదేశాలకు ఎగుమతైంది. లాభాలు ముట్టడంతో గత రెండేళ్లుగా రైతులు మిర్చి పంటపైనే దృష్టి పెడుతున్నారు.అటు కర్ణాటకలో మిర్చి దిగుబడి ఎక్కువగా రావడంతో అక్కడ కోల్డ్ స్టోరేజీలు సరిపోక ఏపీకి తీసుకొచ్చి నిల్వ చేస్తున్నారు. గుంటూరులో దాదాపు వంద వరకూ కోల్డ్‌స్టోరేజీలు ఉన్నాయి. వీటిల్లో 3.21 లక్షల టన్నులకు పైగా మిర్చిని నిల్వ చేశారు. ఇందులో 2.71 లక్షల మెట్రిక్ టన్నుల పంట రైతులది. మిగిలిన 52 వేల మెట్రిక్ టన్నుల పంట వ్యాపారులది. ఇక పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఉన్న కోల్డ్ స్టోరేజీలల్లోనూ 75 లక్షల బస్తాల పంట నిల్వ ఉంది. ఒక్కో బస్తా 40 కిలోలు ఉంటుంది. ఉత్పత్తి పెరడం వల్ల ధర రోజురోజుకీ తగ్గుతుండటం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది.

## ఆరో పెద్ద పార్టీగా

# టీడీపీ



**గుంటూరు, జూన్ 20 (ప్రజాస్వరం):**

తెలుగుదేశం పార్టీ జాతీయస్థాయిలో మరోసారి గుర్తింపు సాధించింది. 18వ లోక్ సభలో ఆరు పెద్ద పార్టీగా అవతరించింది. 41 పార్టీల సభ్యులతో కొత్తగా ఏర్పడనున్న లోక్ సభలో.. 16 మంది సభ్యులతో ఈ ఘనత సాధించింది. జాతీయస్థాయిలో టిడిపి గుర్తింపు సాధించడం ఇది మొదటిసారి కాదు. గతంలో లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష హోదా టిడిపికి దక్కింది. జాతీయస్థాయిలో ప్రధాన ప్రతిపక్ష హోదాతో సముచిత స్థానం దక్కించుకుంది ఆ పార్టీ. మళ్లీ ఇన్నాళ్లకు ఈ చాన్స్ వచ్చింది.ఇటీవల దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ముచ్చటగా ఎన్డీఏ మూడోసారి అధికారాన్ని సొంతం చేసుకుంది. గత రెండు ఎన్నికల్లో బిజెపి సొంతంగా అధికారంలోకి రాగా.. ఇప్పుడు ఎన్ డి ఏ మిత్రపక్షాల సాయంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. ముఖ్యంగా ఎన్డీఏ లో రెండో అతిపెద్ద పార్టీగా తెలుగుదేశం నిలిచింది. జెడియు మరో భాగస్వామ్యపక్షంగా నిలబడింది. అందుకే చంద్రబాబుతో పాటు నితీష్ కుమార్ కు ప్రాధాన్యత దక్కింది. తాజాగా లోక్సభలో సంఖ్యాపరంగా తెలుగుదేశం పార్టీ ఆరో స్థానంలో నిలిచింది. ఆ పార్టీకి ప్రత్యర్థిగా ఉన్న వైసిపి 15వ స్థానానికి పరిమితం అయ్యింది. 41 పార్టీల సభ్యులతో లోక్సభ కొలువుదీరింది. బిజెపి నుంచి 240 మంది సభ్యులు, కాంగ్రెస్ 99, సమాజ్ వాది 37, తృణమూల్ కాంగ్రెస్ 29, డీఎంకే 22 స్థానాలు సాధించాయి. టాప్ 5 లో నిలిచాయి. 16 మంది సభ్యులతో తెలుగుదేశం పార్టీ ఆరో పెద్ద పార్టీగా అవతరించింది. ఈ ఎన్నికల్లో బిజెపికి మాత్రమే మూడంకెల స్థానాలు దక్కాయి. 34 పార్టీలకు ఏక అంకె సీట్లు వచ్చాయి. 16 పార్టీలకు కేవలం ఒక్కో సీటు మాత్రమే వచ్చింది. వైసీపీకి నాలుగు స్థానాలు వచ్చాయి. జనసేనకు రెండు సీట్లు దక్కాయి.అయితే ఏపీ నుంచి తెలుగుదేశం పార్టీకి 16 సీట్లు దక్కడం విశేషం. ఎన్డీఏలో రెండో పెద్ద పార్టీగా, జాతీయస్థాయిలో ఆరో పెద్ద పార్టీగా నిలవడం విశేషం.జాతీయస్థాయిలో తెలుగుదేశం పార్టీ చక్రం తిప్పిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఎన్టీఆర్ తోపాటు చంద్రబాబు సైతం సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాట్లు క్రియాశీలక పాత్ర పోషించారు. ఇందిరా గాంధీ హత్య సమయంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్కు సానుకూల పవనాలు వీచాయి. కానీ ఏపీలో మాత్రం తెలుగుదేశం పార్టీ హవా నడిచింది. ఆ పార్టీ మెరుగైన సీట్లను దక్కించుకుంది. దేశవ్యాప్తంగా విపక్షాలు తుడుచుపెట్టుకుపోయాయి. ఆ సమయంలో లోక్సభలో ప్రతిపక్ష పాత్ర పోషించింది టిడిపి. యునైటెడ్ ఫ్రంట్, నేషనల్ ఫ్రంట్ ఏర్పాటులో కూడా కీలకంగా మారింది. 1996లో వాజ్పేయి నేతృత్వంలోని ఎన్డీఏ సుస్థిరతకు కూడా టిడిపి ఒక కారణం. ఇప్పుడు ఈ ఎన్నికల్లో ఎన్డీఏ భాగస్వామ్య పక్షంగా టిడిపి పాత్ర కీలకం. ఆరో అతిపెద్ద పార్టీగా అవతరించి జాతీయ స్థాయిలో సైతం టిడిపి క్రియాశీలక పాత్ర పోషిస్తుండడం విశేషం.

## బ్యాంకుల నుంచి కదులుతున్న

# ఫిక్సిడ్ డిపాజిట్లు

**గుంటూరు, జూన్ 20 (ప్రజాస్వరం):**

ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రంగాన్ని ఐదేళ్లుగా పీడిస్తున్న స్తబ్దత మెల్లగా వీడుతోంది. భవిష్యత్తు ఏమవుతుందో తెలియక నలిగి పోయిన వాళ్లంతా మెల్లగా ఊపిరిపీలుస్తున్నారు. ఎక్కడ పెట్టుబడి పెట్టాలో తెలీక ఇన్నాళ్లు గందరగోళానికి గురైన వారికి ఎన్నికల ఫలితాలతో స్పష్టత వచ్చేసింది.ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో ఏపీ రియల్ ఎస్టేట్ రంగం ఊపిరి పీల్చుకుంది. చేతిలో డబ్బున్నా పెట్టుబడులు పెట్టలేక బ్యాంకులకు పరిమితం చేసిన వారు కూడా ఇప్పుడు వాటిని నగదుగా మార్చుకుంటున్నారు. గత నాలుగైదు రోజుల్లో భారీ ఎత్తున ఫిక్సిడ్ డిపాజట్లను రద్దు చేసుకుంటున్నారని బ్యాంకులు ధృవీకరిస్తున్నాయి. కోట్లలో డిపాజిట్లు చేసిన ఖాతాదారులు సైతం రియల్ ఎస్టేట్ పెట్టుబడుల కోసం నగదుగా మార్చుకుంటున్నారు.చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వారంలోపే బ్యాంకు డిపాజిట్లను కరిగిస్తున్న వారి సంఖ్య పెరిగింది. ఇన్నాళ్లు బ్యాంకుల్లో ఫిక్స్ డిపాజిట్లుగా ఉన్న నోట్ల కట్టలకు కాళ్లు వస్తున్నాయి. డిపాజిట్లను నగదుగా మార్చుకుని అధిక వడ్డీ, ఆదాయం లభించే మార్గాలపై పెట్టుబడి పెట్టేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.ఫిక్సిడ్ డిపాజిట్లు తగ్గిపోతే బ్యాంకుల లాభాలు గణనీయంగా తగ్గుతాయిఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్లుగా రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న అనిశ్చిత క్రమంగా తొలగిపోతోంది. ఐదేళ్ల క్రితం వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుక తవ్వకాలను నిలిపివేయడంతో మొదలైన నిర్మాణరంగం డౌన్ ఫాల్ ఆ తర్వాత కోలుకోలేదు. చిన్నాచితక పెట్టుబడిదారులు కుదేలైపోయారు. నిర్మాణాలు పూర్తైనా అమ్ముకోలేక అల్లాడిపోయారు. బ్యాంకు వడ్డీలు తీర్చడానికి అయినకాడికి అమ్ముకున్న వారు కొందరైతే ఇసుక కొరత, నిర్మాణ వ్యయానికి అంచనా వ్యయానికి మధ్య వ్యత్యాసం 30-40శాతం పెరగడంతో ప్రాజెక్టుల్ని మధ్యలో ఆపేసిన వారు ఇంకొందరు.ఇక 2014లో రాష్ట్ర విభజన తర్వాత 2015లో అమరావతి రాజధానిగా ప్రకటన వెలువడింది. తొలి ఏడాది కొంత సందిగ్ధత కొనసాగినా రాజధాని నిర్మాణ పనులు ప్రారంభించి 2016 ప్రథమార్థంలోనే హైదరాబాద్ నుంచి ప్రభుత్వ కార్యాలయాలను విజయవాడకు తరలించారు. మొదట్లో తాత్కలికంగా ఎక్కడో చోట సర్దుకుపోయినా ఆర్నెల్లలోనే వెలగపూడిలో సచివాలయం, విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో ప్రభుత్వ కార్యాలయాల కాంప్లెక్సను అందుబాటులోకి తెచ్చారు. ఆ తర్వాత రాజధాని నిర్మాణ పనుల్లో వేగంగా పెంచారు.విజయవాడ కేంద్రంగా ప్రభుత్వ కార్యకలాపాలు నడవడం, కృష్ణా నదికి అవతలి వైపు రాజధాని నిర్మాణంతో రియల్ ఎస్టేట్ జెట్ స్పీడ్‌లో వెళ్లింది. ఇక హైదరాబాద్ నుంచి పెద్ద ఎత్తున తరలి




వచ్చిన ఉద్యోగులు కూడా కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారు. విజయవాడ నగరం విస్తరించడానికి పరిమితులు ఉండటం, వ్యవసాయ భూములు కావడంతో నగరం వేగంగా గుంటూరు జిల్లా తాడేపల్లి వైపు విస్తరించింది. 2014కు ముందతో పోలిస్తే రెండు మూడు రెట్లు ఎక్కువగా భూముల ధరలు పెరిగాయి. 2014 తర్వాత రాజధాని ఎక్కడ ఏర్పాటు అవుతుందనే విషయంలో రకరకాల ప్రచారాలు జరగడంతో మొదట్లో పెట్టుబడులు పెట్టిన వారు అప్పులు పాలైనా ఆ తర్వాత ఏడాది నుంచి స్థిరమైన వృద్ధి కనిపించింది. 2014లో తాడేపల్లి ప్రాంతంలో గజం భూమి ధర రూ.10-15వేల మధ్యలో ఉంటే 2019 నాటికి అది రూ.50వేలకు చేరింది. ఉండవల్లి, మంగళగిరి, నంబూరు, కాజా ఇలా జాతీయ రహదారి వెంట భారీ ఎత్తున రియల్ ఎస్టేట్ నడిచింది. ఇటు విజయవాడలో కూడా ఐదేళ్లలో భారీగా నిర్మాణాలు జరిగాయి. 2019ఎన్నికల ఫలితాల తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం మొత్తం తలకిందులై పోయింది. భూములపై పెట్టుబడులు పెట్టిన వారంతా లబోదిబోమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఈఎంఐలు కడుతున్నా భూముల భవిష్యత్తు ఏమవుతుందో తెలియక ఆందోళన చెందారు. ఇక గ్రూప్ హౌస్‌లు, చిన్నాచితక పెట్టుబడిదారులైతే విలవిలలాడిపోయారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, టౌన్ ప్లానింగ్ వేధింపులు, ఇసుక కొరత, కార్పొరేషన్లలో సిబ్బంది అరాచకాలతో విసిగిపోయారు. ఎంత పెద్ద బిల్డర్లైనా వార్డు వాలంటీర్లకు లోకువయ్యారన్నట్టు పరిస్థితి తయారైంది. స్థానిక నాయకులకు కప్పం కట్టనిదే నిర్మాణాలు జరగనివ్వని పరిస్థితి తెచ్చారు. దీంతో నిర్మాణదారులు పనులు నిలుపుకుని ఎన్నికల ఫలితాల కోసం ఎదురుచూశారు. రూ.100కోట్లకు పైగా వార్షిక లావాదేవీలు జరిగే స్కేల్ 4 బ్రాంచీల్లో ఈ తరహా రద్దీ ఎక్కువగా ఉంటోంది. బ్యాంక్ బ్రాంచీల వారిగా లాభాలను పరిగణలోకి తీసుకుంటే ఈ ప్రాఫిట్స్ మళ్లీ గాడిన పడటానికి ఆర్నెల్ల సమయం పట్టొచ్చని అంచనా వేస్తున్నారు. రిజిస్ట్రేషన్ల సమయంలో లావాదేవీలను బ్యాంకు ఖాతాలతో చేయాల్సి ఉండటంతో త్వరలోనే డిపాజిట్లు మళ్లీ పెరుగుతాయని ఆశాభావం బ్యాంకుల్లో ఉంది.

# రౌడి షీటర్ దారుణ హత్య

**హైదరాబాద్, జూన్ 20 (ప్రజాస్వరం):**

హబీబ్ నగర్ పోలీస్ స్టేషన్ కి చెందిన రౌడీషీటర్ అలీమ్ దారుణ హత్యకు గురయ్యాడు. ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లేపల్లి కూడలి సమీపంలో అలీమ్ ను గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు కత్తితో పొడిచి చంపి అక్కడి నుండి పరారయ్యారు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఆసిఫ్ నగర్ పోలీసుల హుటాహుటిన హాస్పిటల్ కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.




# ఆ ఇద్దరేనా...

## రాధా, వర్మలను ఊరిస్తున్న ఎమ్మెల్సీలు

**విజయవాడ, జూన్ 20 (ప్రజాస్వరం):**

ఏపీలో రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అయ్యాయి. వాటికి సంబంధించి ఎన్నిక జరగనుంది. ఈనెల 25న ఎలక్షన్ కమిషన్ షెడ్యూల్ ప్రకటించనుంది. వైసీపీ నుంచి టీడీపీలోకి ఫిరాయించిన ఎమ్మెల్సీలు రామచంద్రయ్య, ఇక్బాల్ పై అనర్హత వేటుపడడంతో.. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నిక అనివార్యంగా మారింది. ఆ ఇద్దరూ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నవారే. ఎవరైనా ఎమ్మెల్సీలు రాజీనామా చేసినా, అనర్హత వేటుపడినా మూడు నెలల వ్యవధిలో ఎన్నికలు నిర్వహించాలి. ఆ ఇద్దరు ఎమ్మెల్సీలపై వేటుపడి రెండు నెలలు దాటుతోంది. అందుకే ఎన్నికల కమిషన్ షెడ్యూల్ వెల్లడించింది. అయితే ఆ రెండు ఎమ్మెల్సీల ఎన్నిక లాంఛనమే. కనీసం పోటీ పెట్టే పరిస్థితిలో వైసీపీ లేదు.టిడిపి కూటమి అంతులేని మెజారిటీని కైవసం చేసుకుంది. 166 స్థానాలతో పటిష్టమైన స్థితిలో ఉంది. టిడిపి ఒక్కటే ఒంటరిగా 135 సీట్లలో గెలుపొందింది. ఈ ఐదేళ్లలో ఎమ్మెల్యేల ద్వారా ఎన్నికయ్యారు ఎమ్మెల్సీలను ఏకపక్షంగా కూటమి గెలుచుకోనుంది.అయితే ఎమ్మెల్సీలుగా ఎవరికి ఛాన్స్ ఇస్తారన్న చర్చ బలంగా నడుస్తోంది. పొత్తులో భాగంగా చాలామంది టిక్కెట్లు వదులుకున్నారు. త్యాగం చేశారు. అటువంటి వారికి ప్రత్యామ్నాయ రూపంలో అవకాశం కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ ఆశావహులంతా పావులు కదుపుతున్నారు. శాసనమండలి నుంచి ఒకరిని తీసుకుని మంత్రి పదవి కేటాయిస్తారని.. అందుకే క్యాబినెట్లో కేవలం 24 మందిని మాత్రమే భర్తీ చేశారని ప్రచారం జరుగుతోంది.ఎమ్మెల్సీగా వంగవీటి రాధాకృష్ణకు ఛాన్స్ ఇస్తారని ప్రధానంగా చర్చ నడుస్తోంది. ఎమ్మెల్సీగా ఎంపిక చేసి మంత్రివర్గంలోకి తీసుకుంటారని కూడా టాక్ నడుస్తోంది. 2019 ఎన్నికలకు ముందు టిడిపిలో చేరారు రాధ. కానీ పోటీ చేసేందుకు ఛాన్స్ దక్కలేదు. కేవలం అప్పట్లో ప్రచారానికి పరిమితమయ్యారు. పార్టీ అధికారంలోకి రాకపోవడంతో నిరాశకు గురయ్యారు. కానీ గత ఐదేళ్లుగా వేరే పార్టీలో చేరలేదు.ఈ ఎన్నికల్లో సైతం టికెట్ ఆశించారు. కానీ దక్కలేదు. ఈసారి కూడా అంకితభావంతో ప్రచారం చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చింది. 2009 తర్వాత రాధ పొలిటికల్ కెరీర్ ఆశించిన స్థాయిలో లేదు. అందుకే ఇప్పుడు చంద్రబాబు రాధా కెరీర్ గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తారని తెలుస్తోంది.మరోవైపు పవన్ కోసం సీటు త్యాగం చేసిన వర్మకు ఎమ్మెల్సీ పదవి ఇస్తారని తెలుస్తోంది. పిఠాపురం నియోజకవర్గంలో వర్మకు తిరుగులేదు. అది టిడిపి గెలిచే సీటు కూడా. అటువంటి సీటును పవన్ కోసం త్యాగం చేశారు వర్మ. పవన్ విజయానికి కృషి చేశారు. పవన్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించి తీసుకొస్తానని చంద్రబాబుకు మాట ఇచ్చారు వర్మ. అటు పవన్ సైతం వర్మ విషయంలో సానుకూలంగా ఉన్నారు. తన కోసం సీటు త్యాగం చేసిన వర్మకు న్యాయం చేయాలని కూడా చంద్రబాబుకు పవన్ కోరినట్లు తెలుస్తోంది. అందుకే ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టి మంత్రివర్గంలోకి తీసుకుంటారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు పొత్తుల్లో భాగంగా మైలవరం సీటు వదులుకున్నారు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు. అటు తెనాలి టికెట్ను నాదెండ్ల మనోహర్ కు ఇచ్చేందుకు సమ్మతించారు మాజీ మంత్రి ఆలపాటి రాజా. వారు కూడా ఎమ్మెల్సీ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. మరి చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

# టీచర్లు...మంత్రులు...

విశాఖపట్టణం, జూన్ 20 (ప్రజాస్వరం):

ఏపీలో ఓ ట్రెండ్ బాగా నడుస్తోంది. ఈ ట్రెండు ఇప్పుడేమి కొత్తగా మొదలైందీ కాదు..! ఓ సినిమాలో నేను ట్రెండ్ ఫాలో అవ్వను.. ట్రెండ్ సెట్ చేస్తా.. అన్నట్లు ఇక్కడ వ్యవహారం ఉంది. అయితే ఇక్కడ అదే ట్రెండు ఫాలో అవుతూ జాక్‌పాట్ కొట్టేస్తున్నారు ఆ మహిళా నేతలు. ఆ వృత్తి నుంచి వచ్చిన వారు రాజకీయాల్లో రాణించడం అందున వారందరూ మహిళల కావడం ఇక్కడ చెప్పుకోవలసిన విశేషం. ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయులుగా పనిచేసి రాజకీయాల్లోకి వచ్చిన వారు ఏకంగా మంత్రులు అయిపోతున్నారు. ఇప్పుడు ఏపీ అంతట ఇదే ట్రెండ్ నడుస్తోంది. తాజాగా హోం మంత్రి వంగలపూడి అనిత రాజకీయాల్లోకి రాకముందు ఉపాధ్యాయురాలుగా పని చేశారు. అలాగే మాజీ మంత్రి తానేటి వనిత కూడా ఎమ్మెల్యే కాకముందు కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం చేశారు. అదేవిధంగా మాజీ మంత్రి పీతల సుజాత సైతం ఉపాధ్యాయురాలుగా పని చేసినవారే. దాంతో టీచర్లందరూ ఏపీలో మంత్రులు అవుతున్నారనే టాక్ బాగా వినిపిస్తోంది. ఎందుకంటే ఇప్పటికే ఉపాధ్యాయులుగా పనిచేసి అనంతరం ఎమ్మెల్యేలుగా గెలుపొంది మంత్రులవడం ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు.ప్రస్తుతం వంగలపూడి అనిత ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ జిల్లా పాయకరావుపేట నియోజకవర్గ నుంచి తెలుగుదేశం పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. అంతేకాదు తాజాగా చంద్రబాబు మంత్రివర్గంలో కీలకమైన హోం శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. హోంమంత్రి అనిత 2009లో ఆంధ్ర యూనివర్సిటీ నుండి ఎంఏ, ఏంఈడి పూర్తి చేసి ఉపాధ్యాయురాలుగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం 28 సంవత్సరాలకే తన ఉద్యోగానికి రాజీనామా చేసి 2012 వ సంవత్సరంలో రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. ఇక, 2014లో పాయకరావుపేట



నియోజక వర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2018లో టీటీడీ బోర్డు సభ్యురాలుగా అనిత బాధ్యతలు స్వీకరించారు.అయితే కొన్ని రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆమె 2019లో పాయకరావుపేట నుంచి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అనంతరం 2021 లో తెలుగుదేశం పార్టీ ఆమెను రాష్ట్ర తెలుగు మహిళ అధ్యక్షురాలుగా నియమించింది. అయితే తాజాగా జరిగిన ఎన్నికల్లో ఆమె తిరిగి పాయకరావుపేట నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. అయితే ఈసారి ఆమెను అదృష్టం వరించింది. మంత్రి పదవుల్లో కీలక శాఖ అయిన హోం శాఖను అనిత దక్కించుకున్నారు.ఇక, అదే విధంగా ఐదేళ్లపాటు సుదీర్ఘంగా మంత్రిగా పనిచేసిన తానేటి వనిత ఒకప్పుడు ఉపాధ్యాయురాలే. తానేటి వనిత తండ్రి జొన్నకూటి బాబాజీరావు గోపాలపురం మాజీ ఎమ్మెల్యే. 1995లో విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ నుంచి ఎంఎస్సీ, ఎంఈడి పూర్తి చేశారు మాజీ మంత్రి వనిత. తరువాత నల్లజర్లలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఆమె లెక్చరర్‌గా పని చేశారు. అయితే తండ్రి వారసత్వాన్ని స్వీకరించిన వనిత 2009లో టీడీపీ తరపున గోపాలపురం నియోజకవర్గ నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తరువాత 2012లో తన ఎమ్మెల్యే పదవికి తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో కొవ్వూరు నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.తిరిగి 2019లో మళ్లీ కొవ్వూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు వనిత. అయితే వనితను అదృష్టం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మొదటి కేబినెట్ లోనే మంత్రిగా పనిచేసి అవకాశం దక్కింది. స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం 2022లో మంత్రివర్గ పునర్విభజనలో మరోసారి వనితను అదృష్టం వరించింది. కీలక శాఖ అయిన హోం మంత్రిగా తానేటి వనిత బాధ్యతలు చేపట్టారు. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి గోపాలపురం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు.ఇక మరో మాజీ మంత్రి పీతల సుజాత సైతం ఉపాధ్యాయులుగా పనిచేశారు. 2004లో తండ్రి వారసత్వంగా రాజకీయాలలోకి వచ్చి మొదటిసారి పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే ఆ తర్వాత 2009లో నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా ఆచంట జనరల్ రిజర్వేషన్ కు మారిపోవడంతో ఆమె పోటీ చేయలేదు. తర్వాత 2014లో చింతలపూడి నియోజకవర్గంలో నుంచి టీడీపీ అభ్యర్థిగా పీతల సుజాత పోటీ చేసి గెలుపొందారు. అంతేకాక చంద్రబాబు నాయుడు కేబినెట్ లోనే స్త్రీ శిశు సంక్షేమ గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే 2019, 2024 లో ఆమెకు పోటీ చేసేందుకు ఎక్కడ అవకాశం కల్పించకపోవడంతో సైలెంట్ గా ఉండిపోయారు.ఈ గణాంకాల ప్రకారం టీచరుగా పనిచేసి అనంతరం రాజకీయాలకు వచ్చిన మహిళ నేతలు తప్పకుండా మంత్రులు అవుతారనే ట్రెండ్ బాగా ఏపీలో నడుస్తోంది. ఇక రాబోయే రోజుల్లో ఇంకెంత మంది ఉపాధ్యాయులు ఎమ్మెల్యేలుగా గెలుపొంది మంత్రులు అవుతారో చూడాలి..!

## నల్లారి కిరణ్‌కు కీలక పదవి...



తిరుపతి, జూన్ 20 (ప్రజాస్వరం):

లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన ఆయనకు బీజేపీ అధిష్ఠానం కీలక పదవిని కట్టబెట్టొచ్చనే ప్రచారం పొలిటికల్ సర్కిల్స్‌లో జోరుగా సాగుతోంది. కేంద్రంలోని ఎన్డీఏ సర్కారులో కీలకంగా ఉన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా కిరణ్ విషయంలో సానుకూలంగానే ఉన్నట్లు చెప్తున్నారు. ఆ క్రమంలో ఆయనకు రాజ్యాంగ పదవి దక్కడం ఖాయమైందన్న టాక్ వినిపిస్తుంది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ చివరి ముఖ్యమంత్రిగా కిరణ్ కుమార్ రెడ్డి రికార్డులకు ఎక్కారు. 2009లో వై.యస్.రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత అప్పటి కాంగ్రెస్ హై కమాండ్ రోశయ్యను సీఎంగా చేసింది. అప్పట్లో కిరణ్ శాసన సభ స్పీకర్ గా వ్యవహరించారు. రోశయ్య సీఎంగా బాధ్యతలు చేపట్టగానే కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడింది. దానికి తోడు తండ్రి మరణించగానే సీఎం పదవి ఆశించి ఎమ్మెల్యేలతో సంతకాల సేకరణ కూడా చేసిన జగన్.. ఓదార్పు యాత్రంటూ హడావుడి మొదలుపెట్టారు.సహజంగా మృదుస్వభావి అయిన రోశయ్య.. అటు కేసీఆర్, ఇటు జగన్‌ల విషయంలో సాఫ్ట్ కార్నర్‌తో వ్యవహరిస్తుండటంతో కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఆయన్ని తప్పించి గవర్నర్‌గా పంపించింది. ఆ క్రమంలో స్పీకర్ గాఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డిని అప్పటి వరకు ఎలాంటి మంత్రి పదవి నిర్వహించకపోయినా ఒకేసారి సీఎంను చేసింది. కిరణ్ తండ్రి నల్లారి అమర్‌నాథ్‌రెడ్డి అప్పటికే కాంగ్రెస్ పార్టీలో పలుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పనిచేశారు. అది కిరణ్‌కు కలిసి వచ్చింది. మరో వైపు అప్పటికే తెలుగుకంటే హిందీ, ఇంగ్లీషుల్లో అనర్గళంగా మాట్లాడగలిగే కిరణ్‌కు ఢిల్లీ పెద్దలతో మంచి రాపో ఏర్పడింది.పైపెచ్చు ఎలాంటి వివాదాలకు తావులేని రాజకీయ జీవితం, ఎలాంటి అవినీతి ఆరోపణలు లేని వ్యక్తిగత చరిత్ర, ఏదైనా ముక్కుసూటిగా చెప్పే మనస్తత్వం, కీలక సందర్భాల్లో కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సైతం వెనుకంజ వేయని ఆయన మనస్తత్వం. ఆయనను ముఖ్యమంత్రి స్థాయికి చేర్చాయి. అయితే ఏపీ విభజన విషయంలో కాంగ్రెస్ హై కమాండ్ తో కిరణ్ కుమార్ రెడ్డి చివరి వరకు పోరాడారు. అయినా ఫలితం లేకపోవడంతో రాష్ట్ర విభజనకు నైతిక బాధ్యత వహిస్తూ సీఎం పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత సొంతంగా జై సమైఖ్యాంధ్ర పార్టీ స్థాపించి 2014 ఎన్నికల్లో పోటీ చేసినా.. పెద్దగా ప్రభావం చూపించలేదు. కొన్నేళ్లు సైలెంట్‌గా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి.. తిరిగి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు.ఏపీలో వైసీపీ ప్రభుత్వం రావడం. కాంగ్రెస్ ఇంకా కోలుకోకపోవడంతో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి 2023లో బీజేపీలో చేరారు. తాజా ఎన్నికల్లో బీజేపీ నుంచి రాజంపేట ఎంపీగా పోటీ చేసి పరాజయం పాలయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తనకు ముందు నుంచి రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో వైరంతోనే ఆయన ఏరికోరి రాజంపేట నుంచి పోటీ చేశారు. పెద్దిరెడ్డి అరాచకాలను ఎన్నికల ప్రచారంలో ఎండగడుతూ.. సీఎంగా ఉన్నప్పుడు ఆయన తన కాళ్లు పట్టుకుని బతిమలాడారని గుర్తు చేశారు.ఎంత చేసినా ఈ ఎన్నికల్లో ఆయన పెద్దిరెడ్డి ఫ్యామిలీకి చెక్ పెట్టలేకపోయారు. విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లిన పెద్దిరెడ్డి తండ్రీ కొడుకులు మెజార్టీలు తగ్గినా గట్టెక్కగలిగారు. ఎంపీగా మిథున్‌రెడ్డి మెజార్టీని గత ఎన్నికల కంటే గణనీయంగా తగ్గించడంలో కిరణ్ సక్సెస్ అయ్యారు. గత ఎన్నికల్లో 2.7 లక్షల మెజార్టీ సాధించిన మిథున్‌రెడ్డి ఈ సారి 76 వేల ఓట్లతో గెలవగలిగారు. మొత్తమ్మీద రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన నేతృత్వంలోని కూటమి విజయం సాధించినా.. ఆ ప్రభంజనంలో కిరణ్ కుమార్ రెడ్డి గెలవలేకపోయారు.దాంతో కేంద్రం ఆయన్ని గవర్నర్ గా నియమించబోతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆయనకు ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఉండనే ఉంది. ప్రస్తుతం దేశంలో వివిధ రాష్ట్రాలకు ఇన్‌చార్జ్ గవర్నర్లు కొనసాగుతున్నారు. కేంద్రంలో తిరిగి ఎన్డీఏ ప్రభుత్వం కొలువు తీరడంతో అన్ని రాష్ట్రాలకు ఇంచార్జ్ గవర్నర్ ల ప్లేస్ లో పూర్తి స్థాయి గవర్నర్ లను నియమించనున్నారు. ఈ నేపథ్యంలో కిరణ్ కుమార్ రెడ్డిని గవర్నర్‌గా నియమించే అవకాశాలు ఉన్నాయన్న టాక్ గట్టిగానే వినిపిస్తుంది.ఈ విషయంలో కిరణ్‌కి ఎన్డీఏ సర్కారులో కీలకంగా మారిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సపోర్ట్ కూడా ఉందంటున్నారు. కిరణ్ తమ్ముడు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి టీడీపీ నుంచి పీలేరు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ లెక్కలతో కిరణ్ ఏదో ఒక రాష్ట్రానికి ప్రథమ పౌరుడిగా వెళ్తారంటున్నారు. మరి చూడాలి ఆయన లక్ ఎలా ఉండబోతుందో ?

## పొలం విషయంలో దాయదుల ఘర్షణ

నారాయణపేట, జూన్ 20 (ప్రజాస్వరం)::

నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలం చిన్నపుర్ల గ్రామంలో మొన్న జరిగిన ఘర్షణ మరువకముందే జోగులాంబ గద్వాల జిల్లాలో భూత గదాలతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది.. ఒకరిపై ఒకరు కొట్టుకుంటున్న వీడియోలు వాట్సాప్ లో వైరల్ అయింది... జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని ఎములోనిపల్లి గ్రామంలో దాయాదుల మధ్య ఘర్షణ గొడవలకు దారితీసింది. నాలుగు రోజుల కిందట జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం చిన్నపొర్లలో జరిగిన దాయాదుల ఘర్షణలో ఒకరు చనిపోయిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేగింది రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా సీరియస్ గా తీసుకున్నాడు సంఘటన... అ సంఘటన మరువకముందే జోగులాంబ గద్వాల జిల్లాలో మరొకటి చోటుచేసుకుంది.గత 60 సంవత్సరాల నుండి సుమారు 16 ఎకరాల పొలం ఒక కుటుంబానికి చెందిన వారే చేస్తుండగా మీ పూర్వీకులు మాకు పొలం ఎప్పుడో అమ్మేశారంటూ దాయాదుల పోరు ఉండేదని,వర్షాలు పడటంతో మేము పొలం దున్నుతుండగా మా దాయాదులు ఏకంగా పొలం వద్దకు వచ్చి గొడవ పెట్టుకుని ఘర్షణకు దిగారని భాదితులు తెలిపారు. రోజురోజుకు భూ సమస్యలు తీవ్రతరం కావడంతో దాయాదుల మధ్య ఘర్షణలు ఎక్కువగా జరుగుతున్నాయి.గొడవ జరుగుతున్నప్పుడే భాదితులు 100 కి కాల్ చేయడంతో పోలీసులు సంఘటనా స్థలానికి ఆలస్యంగా చేరారని భాదితులు చెబుతున్నారు. కేసు నమోదు అయ్యిందో లేదో తెలియక భాదితులు సంఘటన జరిగిన వీడియోలను సోషల్ మీడియాలో వదిలారు.ఎప్పటికైనా మా దాయాదుల నుండి మా కుటుంబానికి ప్రాణహాని ఉందంటున్నారు భాదితులు.

## చదవు మానేసి డ్రగ్స్....

హైదరాబాద్, జూన్ 20 (ప్రజాస్వరం):

డ్రగ్స్ వినియోగంపై తెలంగాణ పోలీసులు ఉక్కు పాదం మోపుతున్న విషయం తెలిసిందే. తాజాగా డ్రగ్స్ సరఫరా చేస్తూ అరెస్ట్ అవుతున్న వారిలో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉంటున్నారు. విద్యార్థులకు అసలు డ్రగ్స్ ఎక్కడినుండి వస్తున్నాయి అనే విషయంపై నార్కోటిక్ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులకు కొన్ని నమ్మలేని నిజాలు బయటపడ్డాయి. బీటెక్ లేదా డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఈజీ మనీ కోసం అలవాటు పడి డ్రగ్స్ వ్యాపారంలోకి దిగుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. డార్క్ వెబ్ ద్వారా డ్రగ్స్?ను ఆర్డర్ చేయడం నేర్చుకున్న విద్యార్థులు ఇక చదువులకు స్వస్తి చెప్పి డ్రగ్స్ వ్యాపారంపైనే దృష్టి పెడుతున్నారు.ఇటీవల రాచకొండ ఎస్ఓటి పోలీసులు డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముగ్గురు యువకులను అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు యువకులు చదువును మధ్యలో వదిలేసి డ్రగ్స్ వ్యాపారంలోకి దిగినట్లుగా గుర్తించారు. భరత్ రెడ్డితోపాటు విఖ్యాత్ అనే ఇద్దరు విద్యార్థులకు డ్రగ్స్ సరఫరా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరికి ఉన్న నెట్వర్క్ ద్వారా బెంగళూరు నుండి మత్తు పదార్థాలు కొనుగోలు చేసి వాటిని హైదరాబాద్?కు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఎక్కువగా వాడుతున్న ఎండిఎంఏ డ్రగ్?ను బెంగళూరుకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. అక్కడ ఒక్కో గ్రామంలో 1200 రూపాయలు పెట్టి కొనుగోలు చేస్తున్న విద్యార్థులు తిరిగి వాటిని హైదరాబాదులో అధిక రేటుకు విక్రయిస్తున్నారు. ఒక్కో గ్రామ్ డ్రగ్?ను 5000 రూపాయలకు విక్రయిస్తున్నారు.వీరిద్దరూ కాలేజీ?లో డ్రాప్ అవుట్ విద్యార్థులుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో భరత్ రెడ్డిపై హయత్ నగర్?తో పాటు అబ్దుల్లాపూర్?మెట్?లోను కేసులు ఉన్నట్లు పోలీసుల విచారణలో బయటపడింది. వ్యసనాలకు బానిసై డ్రగ్స్ వ్యాపారంలో ఈజీగా డబ్బులు వస్తాయని తమ చదువులకు స్వస్తి చెప్పి ఈ తరహా వ్యాపారం చేస్తున్నట్లు దర్యాప్తులో బయటపడింది. విద్యార్థులు ఎవరు డ్రగ్స్ బారిన పడవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## హుందా రాజకీయాలకు నవీన్ పట్నాయక్

భువనేశ్వర్, జూన్ 20 (ప్రజాస్వరం):

నిరాడంబరతకు, హుందాతనానికి మారుపేరు ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్. మొన్నటి ఎన్నికల్లో ఆయన నేతృత్వంలోని బీజేడి ఓడిపోయింది. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. 25 సంవత్సరాల నవీన్ పాలనకు తెరపడింది. అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చిన నవీన్ అప్రతిహాసంగా ఒడిశాను ఏలారు. కానీ ఈ ఎన్నికల్లో ఒడిశా ప్రజలు తిరస్కరించారు. ప్రజాభిప్రాయాన్ని గౌరవించిన నవీన్ నేరుగా గవర్నర్ వద్దకు వెళ్లి తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. దేశ చరిత్రలో ఇదో అరుదైన అధ్యయనం. ఓటమితో ఎవరు ఇటువంటి చర్యలకు దిగరు. కానీ ఓటమిని హుందాతనంతో ఒప్పుకున్నారు నవీన్. గతంలో తన క్యాబినెట్లో పనిచేసిన దళిత నేత మోహన్ మజిని అభినందనలు తెలిపారు. నేరుగా కలిసి ఆశీర్వదించారు. తాజాగా శాసనసభలో సైతం తన హుందాతనాన్ని చాటుకున్నారు.జనతా దళ్ పార్టీలో 1998లో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు నవీన్ పట్నాయక్. తండ్రి బిజు పట్నాయక్ అకాల మరణంతో రాజకీయాల్లోకి నవీన్ రావాల్సి వచ్చింది. కనీసం ఆయనకు ఒడిస్సా భాష కూడా తెలియదు. కానీ 1998లో ఎంపీగా పోటీ చేసి గెలిచారు నవీన్. 2000లో తన తండ్రి బిజు పట్నాయక్ పేరి ట బిజు జనతా దళ్ పార్టీని ఏర్పాటు చేశారు. బిజెపితో పొత్తు పెట్టుకుని తొలిసారిగా అసెంబ్లీకి పోటీ చేశారు. కాంగ్రెస్ పార్టీని ఓడించి ఒడిశా పీఠంపై కూర్చున్నారు. అది మొదలు బిజెపితో కలిసి బిజేడి కొనసాగింది. కానీ ఈ ఎన్నికల్లో బిజెపితో పొత్తు పెట్టుకునే క్రమంలో ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఎవరికి వారు పోటీ చేయగా బిజెపి అధికారంలోకి వచ్చింది. బిజెడి ప్రతిపక్షానికి పరిమితమైంది. ఓటమిని హుందాగా అంగీకరించిన నవీన్ పట్నాయక్ నేరుగా గవర్నర్ వద్దకు వెళ్లి తన రాజీనామాను సమర్పించారు. బిజెపి ప్రభుత్వాన్ని ఆహ్వానించారు.ఎన్నికల్లో రెండు అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేశారు నవీన్ పట్నాయక్. కానీ ఒక్కచోట మాత్రమే గెలిచారు. గంజాం జిల్లాలోని హింజలి నియోజకవర్గం నుంచి గెలిచిన నవీన్%ొా% బోలంగీర్ జిల్లాలోని కంటాభంజీలో మాత్రం ఓడిపోయారు. మంగళవారం నూతన శాసనసభ్యుల ప్రమాణ స్వీకారం అసెంబ్లీలో జరిగింది. కార్యక్రమానికి నవీన్ హాజరయ్యారు. ఈ క్రమంలో అందర్నీ పలకరిస్తూ ముందుకు సాగుతున్న నవీన్ ఓ నేత వద్ద ఆగిపోయారు. నవీన్ పై గెలిచిన లక్ష్మణ్ బాగ్ కుర్చీలో నుంచి లేచి నవీన్ కు నమస్కరించారు. తనను తాను పరిచయం చేసుకున్నారు. నవీన్ పట్నాయక్ వెంటనే.. ఓహో మీరేనా నన్ను ఓడించింది.. మీకు అభినందనలు అని చెప్పేసరికి సభలో ఉన్న ముఖ్యమంత్రి, మంత్రులు చప్పట్లతో ఆహ్వానించారు. నవీన్ పట్నాయక్ హుందాతనాన్ని కొనియాడారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ దృశ్యం వైరల్ అవుతోంది. నవీన్ హుందాతనం అభినందనలు అందుకుంటోంది. రాజకీయాలంటే నవీన్ పట్నాయక్ మాదిరిగా చేయాలంటూ నెటిజెన్లు కామెంట్లు పెడుతున్నారు.

## పన్ను చెల్లింపుదారులకు... శుభవార్తే




న్యూఢిల్లీ, జూన్ 20 (ప్రజాస్వరం):

ఫైనాన్స్ మినిస్టర్ నిర్మలా సీతారామన్ జూలైలో లోక్ సభలో బడ్జెట్ ను ప్రవేశపెట్టనున్నారు. ఇది ఆమెకు ఏడో బడ్జెట్. మోడీ 2.%ా% వరకు ఆమె ఐదు పూర్తి స్థాయి బడ్జెట్లు.. ఒక మధ్యంతర బడ్జెట్ (5ం1=6) ప్రవేశ పెట్టారు. బడ్జెట్ కు మరో నెల ఉన్నందున, నిర్మలా సీతారామన్ ఈ సారి పన్ను చెల్లింపుదారులకు కొంత ఉపశమనం కలిగిస్తారనే అంచనాలు, ఊహాగానాలు, ఆశలు ఢిల్లీ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఆమె తక్కువ పన్ను శ్లాబులతో కొత్త పన్ను విధానాన్ని ప్రకటించిన బడ్జెట్ 2020లో గణనీయమైన పన్ను టాక్స్ పేయర్స్ ను ప్రోత్సహించింది.ప్రవేశపెట్టబోయే బడ్జెట్ లో కొన్ని వర్గాల పన్ను చెల్లింపుదారులకు ఆర్థిక మంత్రి నుంచి శుభవార్త అందే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రభుత్వ వర్గాల ఆధారంగా రాయిటర్స్ నివేదిక ప్రకారం.. వినియోగాన్ని పెంచడమే లక్ష్యంగా కొన్ని వర్గాల వ్యక్తులకు వ్యక్తి గత పన్ను రేట్లను తగ్గించే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఏడాదికి రూ.15 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉన్నవారికి పన్ను మినహాయింపు లభిస్తుందని నివేదిక తెలిపింది.2020లో ప్రవేశపెట్టిన కొత్త పన్ను విధానంలో మార్పులు చేసే అవకాశం కనిపిస్తోంది. కొత్త విధానంలో రూ.15 లక్షల లోపు వార్షికాదాయంపై 5-20 శాతం, రూ.15 లక్షలకు పైగా ఆదాయంపై 30 శాతం పన్ను ఉండబోతోంది. ఉదాహరణకు ఒక వ్యక్తి ఆదాయం రూ.3 లక్షల నుంచి రూ.15 లక్షలకు ఐదు రెట్లు పెరిగినప్పుడు వ్యక్తి గత పన్ను రేటు ఆరు రెట్లు పెరుగుతుందని మరో మూలాన్ని ఉటంకిస్తూ నివేదిక పేర్కొంది.ఆదాయపు పన్ను తగ్గింపు వల్ల వినియోగదారుల చేతుల్లో అదనపు నగదు వినియోగం పెరుగుతుంది. కొన్ని కేటగిరీలకు పన్నులు తగ్గించడం వల్ల మధ్య తరగతికి పొదుపు కూడా పెరుగుతుందని నివేదిక పేర్కొంది.2023-24లో ఆర్థిక వ్యవస్థ 8.2 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, వినియోగం ఆ వేగంతో సంగ వరకు పెరిగిందని నివేదిక తెలిపింది.ఎన్డీయే భాగస్వామ్య పక్షాల మద్దతుతో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ప్రధాని మోడీ ప్రకటించేప్పుడు మధ్య తరగతి పొదుపును పెంచడం, వారి జీవితాలను మెరుగుపరచడంపై తమ ప్రభుత్వం దృష్టి పెడుతుందని చెప్పినందున పన్ను రేట్ల తగ్గింపుపై ఊహాగానాలు వ్యక్తం అవుతున్నాయి.

**2024 బడ్జెట్ లో పన్ను విషయంలో పరిశ్రమ అంచనాలు**

పన్ను చెల్లింపుదారులకు, ముఖ్యంగా పేద వారికి ఆర్థిక మంత్రి సీతారామన్ కొన్ని పన్ను ఉపశమన చర్యలను ప్రకటిస్తారని ఇండియా ఇంక్ ఆశిస్తోంది. ద్రవ్యోల్బణం అధిక స్థాయిలో ఉన్నందున 2024-25 పూర్తి బడ్జెట్ లో తక్కువ శ్లాబులో ఉన్నవారికి ఆదాయపు పన్ను ఉపశమనం పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని కొత్తగా ఎన్నికైన సీఐఐ అధ్యక్షుడు సంజీవ్ పురి పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.లోక్ సభ ఎన్నికలకు ముందు ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ లో, ఆర్థిక మంత్రి పన్ను రేట్లు లేదా శ్లాబుల్లో ఎటువంటి మార్పులను ప్రకటించలేదు. కానీ ఇప్పుడు పన్ను చెల్లింపుదారులు %-% ముఖ్యంగా వేతన జీవులు, మధ్య తరగతి %-% ఆమె కొంత ఉపశమనం కలిగిస్తుందని ఆశిస్తున్నారు.

# రోజుకు 191 కోట్లు...

**హైదరాబాద్, జూన్ 20 (ప్రజాస్వరం):**

పాత ప్రభుత్వం చేసిన అప్పులు ఓవైపు.. తాజాగా చేస్తున్న అప్పులు మరోవైపు.. ఇక అప్పులకు కడుతున్న వడ్డీలు ఇంకోవైపు. గతంలో, ఇప్పుడు ఇబ్బడిముబ్బడిగా తెస్తున్న అప్పులు రేవంత్ సర్కార్ ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు నిధులు సమీకరించుకుంటూనే పాత అప్పులకు వడ్డీలు కట్టడం తెలంగాణ ప్రభుత్వానికి సవాల్ గా మారింది.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి గత ప్రభుత్వం చేసిన అప్పులు భారంగా మారాయి. సీఎంగా రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టే నాటికి రాష్ట్రం అప్పులు దాదాపు 7లక్షల కోట్ల రూపాయలు ఉండగా.. వాటికి వడ్డీలు కట్టడం తలకు మించిన భారం అవుతోంది. పాత అప్పులకు ప్రతిరోజూ దాదాపు 191 కోట్ల వరకు అసలు, వడ్డీ చెల్లిస్తుందట రేవంత్ సర్కార్. డిసెంబర్ 7న కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఆరు నెలల్లో పాత అప్పులకు సంబంధించిన దాదాపు 38వేల కోట్ల వరకు అసలు ప్లస్ వడ్డీ చెల్లించిందని అధికారులు చెబుతున్నారు. అసలే జీతాలు, సంక్షేమ పథకాల అమలు కోసం అవస్థలు పడుతోన్న రేవంత్ ప్రభుత్వానికి.. పాత అప్పులు తలకు మించిన భారంగా మారాయి.బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అప్పులతో ఇబ్బందులు పడుతూనే కొత్త అప్పులు చేస్తోంది రేవంత్ సర్కార్. డిసెంబర్ నుంచి జూన్ 17వ తేదీ వరకు రేవంత్ ప్రభుత్వం 25వేల 118 కోట్ల రూపాయల అప్పు తీసుకుంది. అయినా ఖజానా ఎప్పుడూ ఖాళీగానే కనిపిస్తోందట. ఉద్యోగుల జీతాల నుంచి మొదలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు తోడు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు వేల కోట్ల రూపాయలు కావాలి. అందులో మరీ ముఖ్యంగా రైతు రుణమాఫీ, రైతు భరోసాకు దాదాపు 40వేల కోట్ల రూపాయలు అవసరమని అంచనా వేస్తున్నారు. ఈ రెండు పథకాల కోసం అప్పులు చేయడం తప్ప మరో గత్యంతరం లేదు.హైదరాబాద్‌లో విలువైన భూములను బ్యాంకులకు తాకట్టు పెట్టి అప్పు తీసుకునే ప్రయత్నం చేస్తోంది తెలంగాణ ప్రభుత్వం. ఇలా పాత అప్పులకు వడ్డీలు కడుతూ.. కొత్త అప్పులు చేస్తూ.. పాలనను నెట్టుకొస్తుంది రేవంత్ సర్కార్. మరి ఎంతకాలం ఇలా అప్పుల మీదే ఆధారపడి ప్రభుత్వాన్ని నడుపుతారన్నది మాత్రం ఆసక్తికరంగా మారింది.

# ఆర్టీసీ ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్‌లో అవకతవకలు

**హైదరాబాద్, జూన్ 20 (ప్రజాస్వరం):**

టీజీఎస్ఆర్టీసీ ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ విధానంలో నిబంధనలు పాటించలేదని బీఆర్ఎస్ ఆరోపించింది. టెండర్లు పిలవకుండా కోట్లాది రూపాయల కాంట్రాక్ట్ ను ఓ కంపెనీకి కట్టబెట్టారని బీఆర్ఎస్ ఆరోపించింది. దీనిపై టీజీఎస్ఆర్టీసీ వివరణ ఇచ్చింది. అయితే తాజాగా టీజీఎస్ఆర్టీసీ వివరణపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ మరోసారి లేఖ రాశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టమ్ కోసం ఏ టెండర్ లేకుండా ఓ కంపెనీకి కట్టబెట్టారనడానికి టీజీఎస్‌ఆర్‌టీసీ యాజమాన్యం విడుదల చేసిన వివరణతో స్పష్టం అవుతుందని ఆరోపించారు.ప్రభుత్వ కమిటీ మార్చి 4న చర్చలు జరిపిందని లెటర్ ఆఫ్ ఇంటెంట్ స్పష్టంగా పేర్కొందని, అయితే ఫిబ్రవరి 29న మునుపటి టెండర్‌ను రద్దు చేసినట్లు ప్రభుత్వం పత్రికా ప్రకటన పేర్కొంది. ఆ తర్వాత టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారుల బృందం దేశంలోని వివిధ రాష్ట్రాలకు వెళ్లి, ప్రభుత్వ అధికారులను కలిశారు. ఇతర రాష్ట్రాల్లోని అధికారులు, వారి అభిప్రాయాలను తీసుకుని, సాంకేతిక నైపుణ్యం, నాణ్యత, కార్యకలాపాలు, ఆర్థిక ఇతర అంశాలను అధ్యయనం చేసి, ఆపై చలో మొబిలిటీకి అనుమతి ఇచ్చారు. టీజీఎస్ఆర్టీసీ ప్రతినిధి బృందం కేవలం 3 రోజుల్లో అధ్యయనం ఎలా ముగించగలరు, వారు ఎన్ని రాష్ట్రాల్లో పర్యటించారు? ప్రతినిధి బృందంలోని సభ్యులు ఎవరు, వారు ఎన్ని రాష్ట్రాల్లో పర్యటించారు, వారు ఏ అధికారులను కలిశారు, 2022లో ఇచ్చిన కాంట్రాక్ట్‌ను 2023లో రద్దు చేశారు. కానీ రద్దు చేసిన తర్వాత కేవలం 3 రోజుల్లో మరో నిర్ణయం తీసుకున్నారు. ఈ కాంట్రాక్టును ఫలానా కంపెనీకి గిఫ్ట్ గా ఇవ్వాలనే ఉద్దేశం ప్రభుత్వానికి ముందుగానే ఉందనే అనుమానం వస్తుంది" అని బీఆర్ఎస్ ప్రశ్నించింది.టీజీఎస్ఆర్టీసీ ప్రెస్ నోట్ ప్రకారం ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టమ్ కోసం 2022లో 6 కంపెనీలు పోటీ పడ్డాయి, 2024లో కేవలం 3 కంపెనీలు మాత్రమే పోటీ పడ్డాయి, ఆ కంపెనీలు ఏవి? చలో మొబిలిటీ బిడ్డింగ్‌లో పాల్గొందా? ప్రభుత్వ నోట్‌లో పేర్కొన్న విధంగా ఏ కంపెనీ అవసరాలను తీర్చకపోతే, సాధారణంగా పేరున్న కంపెనీలు టేబుల్‌పై చర్చలు జరపడానికి ఇష్టపడవు. అప్పుడు ఆన్‌లైన్ టెండర్లకు ప్రాధాన్యత ఇవ్వకూడదు, గ్లోబల్ టెండర్లను ఎందుకు పిలవలేదు? టెండర్లు, కొనుగోళ్లకు ప్రముఖమైన టీఎస్టీఎస్(తెలంగాణ స్టేట్ టెక్నికల్ సర్వీస్) ఎందుకు ఉపయోగించలేదు? బస్ స్టాల్స్‌లో షెడ్‌ల నిర్మాణాలు, బస్ డిపోల్లోని స్టాల్స్ వంటి తక్కువ మొత్తాలకు కాంట్రాక్టులు ఆన్‌లైన్‌లో ఉంచుతున్నప్పుడు, కోట్లాది రూపాయల విలువైన కాంట్రాక్టును ఆన్‌లైన్ ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో పారదర్శకంగా ఎందుకు చేయలేదు?" అని బీఆర్ఎస్ ప్రశ్నించిందిటీజీఎస్ఆర్టీసీ ప్రెస్ నోట్‌లో రాష్ట్ర ప్రభుత్వం లేదా రవాణా మంత్రికి ఎటువంటి పాత్ర లేదని పేర్కొంటూ రవాణా మంత్రిని రక్షించే ప్రయత్నం ఉంది. టీజీఎస్ఆర్టీసీ ఒక కమిషన్ కాదు, ఇది ప్రభుత్వంలో విలీనం చేసిన కార్పొరేషన్.

ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ నుంచి బ్యూరోక్రాట్‌లు కూడా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా ఉన్నారని గమనించాలి. రాష్ట్ర ప్రభుత్వానికి లేదా రవాణా మంత్రికి సంబంధం లేదని మీరు చెబితే, ఇంత పెద్ద కాంట్రాక్ట్ బోర్డుకు తెలియకుండా ఉంచారా అనే అనుమానం వస్తుంది" అని బీఆర్ఎస్ అభిప్రాయపడింది.మహాలక్ష్మి పథకం పన్ను చెల్లింపుదారుల డబ్బుతో పనిచేస్తోంది, పురుష ప్రయాణికులు టికెట్లు కొనుగోలు చేయడంతో కొనసాగిస్తున్నారు. మహాలక్ష్మి పథకం ముసుగులో ప్రభుత్వం ఒక నిర్దిష్ట కంపెనీకి లబ్ధి చేకూర్చడం ద్వారా బహిరంగంగా స్కామ్ చేస్తుంది. కర్ణాటక ప్రభుత్వం అదే మహాలక్ష్మి పథకం కోసం శక్తి స్మార్ట్ కార్డులను జారీ చేసింది. వాళ్లు ఈ-గవర్నెన్స్ పోర్టల్ ద్వారా టెండర్ ప్రక్రియను కూడా నిర్వహించారు. దానిని అధ్యయనం కోసం ఎందుకు పరిగణించలేదు. హైదరాబాద్ మెట్రో ఇప్పటికే యూపీఐ, స్మార్ట్ కార్డ్ సేవలతో ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టమ్‌ని ఉపయోగిస్తోందని తెలియకపోవడం ఆశ్చర్యం కలుగుతుంది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు జీరో టిక్కెట్‌ను జారీ చేస్తారు. అయితే కంపెనీ దాని కమిషన్‌ను పొందుతుంది. అందుకే ఒప్పందంలో మహాలక్ష్మి ప్రయాణికులతో పాటు పురుషులు కొనుగోలు చేసిన టికెట్లతో 30 లక్షల టికెట్ లావాదేవీలను పేర్కొన్నారు. మహిళా పథకంలో అవినీత జరగకుండా పారదర్శకత పాటించడం ప్రభుత్వ బాధ్యత.కాంగ్రెస్ ప్రభుత్వం తరపున మొత్తం ప్రెస్ నోట్ కొన్ని ప్రయోజనాలకు అనుకూలంగా వ్యత్యాసాలు, నిబంధనల ఉల్లంఘనలను వివరిస్తుంది. నోట్ షీట్/కాంట్రాక్ట్ ఫైల్ నిర్దిష్ట పత్రాలు, బిడ్డర్లు వారి కొటేషన్లు, అన్ని వివరాలు, ఉన్నత స్థాయి కమిటీ నివేదికలు, కమిటీ సభ్యుల పేరు, హోదా, మార్చిలో కార్పొరేషన్ నిర్వహించిన వివిధ అధ్యయన నివేదికలను వీక్షించడానికి బీఆర్ఎస్ ప్రతినిధి బృందాన్ని అనుమతించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని క్రిశాంక్ అన్నారు.ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం అమలు విషయంలో చేస్తోన్న ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని టీజీఎస్ఆర్టీసీ పేర్కొంది. ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకు బోర్డు అనుమతితోనే ఈ వ్యవస్థను సంస్థ అమలు చేస్తుందని తెలిపింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందని చేస్తోన్న నిరాధారమైన ఆరోపణలను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఖండిస్తోందని తెలిపింది. నియమ నిబంధనలకు లోబడి బోర్డు అనుమతితోనే సంస్థలో నిర్ణయాలు తీసుకుంటుందని స్పష్టం చేస్తోంది.

## కాళేశ్వరం ఎస్ఐ భవానిసేన్‌ను సర్వీస్ నుండి శాశ్వతంగా తొలగింపు

**మల్టీజోన్ ఐజిపి ఏవి రంగనాథ్**



**కాళేశ్వరం, జూన్ 20 (ప్రజాస్వరం)::**

మహిళా పోలీస్ కానిస్టేబుల్ పై లైంగిక దాడులకు పాల్పడినందు గాను కాళేశ్వరం ఎస్ఐ భవాని సేన్ ను సర్వీస్ నుండి శాశ్వతంగా తొలగిస్తూ మల్టీ జోన్ 1 ఐ జి పి శ్రీ ఏ. వి. రంగనాథ్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. కాళేశ్వరం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న మహిళా హెడ్ కానిస్టేబుల్ పై స్టేషన్ ఎస్. ఐ భవాని సేన్ తుపాకీ చూపించి లైంగిక దాడికి పాల్పడినట్లు సదరు మహిళా హెడ్ కానిస్టేబుల్ పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో భూపాలపల్లి ఎస్పీ చేపట్టిన విచారణలో ఎస్ ఐ, మహిళా హెడ్ కానిస్టేబుల్ పై లైంగిక దాడికి పాల్పడినట్లుగా నిజ నిర్ధారణ కావడంతో పాటు ఎస్ ఐ, భవాని సేన్ గత 2022 జులై మాసంలో లైంగిక వేధింపులకు పాల్పడంతో ఇతనిపై ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగింది. సదరు ఎస్ఐ తన హోదా అడ్డుపెట్టుకొని మరో ముగ్గురు మహిళా పోలీస్ కానిస్టేబుళ్ల పై లైంగిక దాడులకు పాల్పడినట్లుగా ఆరోపణలు రావడంతో పాటు ఎస్ఐ తరుచుగా లైంగిక దాడులు, వేధింపులకు పాల్పడే వ్యవహారం పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్ట దిగజార్చే విధంగా ఉంది. ఎస్ఐ పై ఈ పరిస్థితుల్లో విచారణ చేయడం సరైన నిర్ణయం కాదనే ఆలోచనతో కాళేశ్వరం ఎస్ఐ భవాని సేన్ పై, ఎలాంటి విచారణ లేకుండానే భారత రాజ్యాంగాన్ని అనుసరిస్తూ ఆర్టికల్ 311 ప్రకారం సర్వీసు నుండి శాశ్వతంగా తొలగిస్తున్నట్లుగా మల్టీ జోన్ ఐజిపి ఏవి. రంగనాథ్ వెల్లడించారు.

# మౌనం...ఇంకెంత కాలం

**హైదరాబాద్, జూన్ 20 (ప్రజాస్వరం):**



ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో.. నెల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పరాభవం తర్వాత పదేళ్లు తెలంగాణను ఏలిన కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సైలెంట్ అయ్యారు. అధికారంలో ఉండి అహంకార ప్రదర్శించిన గులాబీ పార్టీని ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో బండకేసి బాదారు. లోక్‌సభ ఎన్నికల్లో సున్నా చుట్టేశారు. ఇక లోక్‌సభ ఎన్నికలకు ముందు కేసీఆర్ కూతురు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవితను ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఈడీ అరెస్ట్ చేసింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత లోక్‌సభ ఎన్నికల ప్రచారం చేసిన కేసీఆర్.. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత మాత్రం పూర్తిగా సైలెంట్ అయ్యారు. మూడు నెలలుగా జైల్లో ఉన్న కవితను కూడా పరామర్శించేందుకు వెళ్లడం లేదు.అధికారంలో ఉన్నప్పుడు జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పేస్తా, పొరుగు రాష్ట్రాలలో ప్రభుత్వాలను మార్చేస్తా, తెలంగాణలో బీఆర్ఎస్ తప్ప మరే పార్టీనైనా తొక్కేస్తా అంటూ బీరాలు పలికిన కేసీఆర్.. అధికారం కోల్పోయాక తన కూతురు కవితను జైలు నుంచి విడిపించుకోలేకపోతున్నారు. గత ఎన్నికల సమయంలో తన గెలుపుతోపాటుగా ఏపీలో తన మిత్రుడు జగన్ గెలుపు కోసం కూడా సాయమందించిన కేసీఆర్ ఇప్పుడు సొంత పార్టీని కాపాడుకోవడానికి మరొకరిసాయం సాయం కోరాల్సిన పరిస్థితి నెలకొంది.దేశ రాజకీయాల్లో చక్రం తిప్పాలని పార్టీ పేరు మార్చిన కేసీఆర్.. పార్టీ నేతల స్థానాలు మార్చి ఆయన స్నేహితుడు జగన్ అధికారం కోల్పోయారు. వారి గెలుపు కలలను ప్రజలు కల్లలు చేశారు. ఓటమి రుచి చూపించారు. మరోవైపు తెలంగాణలో బీఆర్ఎస్ స్థానాన్ని ఆక్రమించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. దీంతో గులాబీ పార్టీలో ఉన్నవారు ఆ పార్టీని వీడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కారు షెడ్డుకు పోయిందని, రెట్టింపు స్పీడ్‌తో మళ్లీ వస్తుందని చెప్పి పార్టీ క్యాడర్‌లో ధైర్యం నింపే పనిచేశారు. కానీ, రెంట్టింపు స్పీడ్ కాదు.. స్టార్టింగ్ ట్రబుల్‌లో చతికిల పడిందని గుర్తించిన క్యాడర్ ఇక ఆ పార్టీలో ఉన్నా లాభం లేదని భావిస్తున్నారు. దీంతో కేసీఆర్ ఇప్పుడు నోరు తెరవడానికి కూడా భయపడుతున్నారని తెలుస్తోంది. ఈ మౌనం ఎన్నాళ్లు అన్నది మాత్రం ఎవరికీ అంతుచిక్కడం లేదు. మౌనం వీడకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమైతే పార్టీ ఉనికే ప్రశ్నార్థకమవుతుందని క్యాడర్ ఆందోళన చెందుతోంది.

# అభివృద్ధి పనులు ఆగకూడదు

**రంగారెడ్డి, జూన్ 20 (ప్రజాస్వరం)::**

కూకట్పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమావేశం నిర్వహించారు. అధికారులతో మాట్లాడుతూ గత ఆరు నెలలుగా ఎలాంటి అభివృద్ధి జరగకుండా పెండింగ్లో ఉన్న పనులను సైతం పట్టించుకోకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా వేల కోట్ల రూపాయలతో కూకట్పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని అభివృద్ధిలో ఎలాంటి ఆటంకాలు జరగకుండా అందరి సహకారంతో ట్రాఫిక్ సమస్యలను డ్రైనేజీ సమస్యలను మంచినీటి సమస్యలను నిర్మూలించామన్నారు.ప్రభుత్వం మారిన ఆరు నెలల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగకపోగా గత సంవత్సరంలో 65 కోట్ల రూపాయలతో రోడ్లు డ్రైనేజీ మంచినీటి పైప్లైన్ లకు శంకుస్థాపనలు చేసి టెండర్లు జరిగిన అలాంటి పనులను పక్కన పెడుతున్నారని జిహెచ్ఎంసి అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి కొరకు ఎక్కడికి వెళ్లడానికైనా వెనకాడన%అఆ% అభివృద్ధి కోసం పని చేస్తామన్నారు.

## పోరాడతారా... యూ టర్న్ తీసుకుంటారా..?

**విజయవాడ, జూన్ 20 (ప్రజాస్వరం):**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలకు రంగం సిద్ధమవుతోంది. అటూ ఇటూ మార్చినా చివరికి 21, 22 తేదీల్లో సభను సమావేశపరాచలని డిసైడయ్యారు. ఈ రెండు రోజుల్లో సభ్యుల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నిక ప్రక్రియను పూర్తి చేస్తారు. తర్వాత వాయిదా వేస్తారా కొనసాగిస్తారా అన్నది అప్పుడే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. అయితే గత ప్రభుత్వ విధ్వంసం మొత్తాన్ని ప్రజల ముందు ఉంచాలంటే పక్కాగా శ్వేతపత్రాలు సిద్ధం చేయాల్సి ఉందని.. అందుకే ముందుగా సభ్యుల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నికకే పరిమితం చేస్తున్నారని భావిస్తున్నారు. అయితే ఆ తర్వాత రెండు వారాలకయినా మళ్లీ పూర్తి స్థాయి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. పూర్తి స్థాయి బడ్జెట్ కూడా ప్రవేశ పెట్టాల్సి ఉంది. ఎన్నికల కారణంగా జగన్ ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ ను మాత్రమే ప్రవేశ పెట్టింది. ప్రమాణ స్వీకార సమావేశాలకు, ఆ తర్వాత జరగాల్సిన సమావేశాలకు మాజీ సీఎం జగన్ హాజరవుతారా.. లేకపోతే గతంలోలా బహిష్కరణ అస్త్రం ప్రయోగిస్తారా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఎందుకంటే ఏపీ రాజకీయాలు ప్రతిపక్ష నేత సభకు రాలేనంత ఘోరంగా గత ఐదేళ్లలో దిగజారిపోయాయి. టీడీపీ నేతలు ప్రతీకారం కోసం ఎదురు చూస్తున్నారని చెప్పాల్సిన పని లేదు. అందుకే సభకు వెళ్లడం.. అపరిమితమైన బలంతో ఉన్న అధికార పక్షాన్ని ఎదుర్కోవడం అంత తేలిక కాదన్న భావన ఉంది. అసెంబ్లీలో వైఎస్ఆర్‌సీపీకి కేవలం పదకొండు మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో గట్టిగా నిలబడి అధికారపక్షంగా తన వాయిస్ గా గడగడలాడించేవారు ఎవరూ లేరు. జగన్ కన్నా రాజకీయాల్లో సీనియర్ అయని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మరోసారి గెలిచి అసెంబ్లీలో అడుగు పెడుతున్నారు. కానీ ఆయన తెరవెనుక రాజకీయ వ్యూహాల్లో దిట్ట కానీ అసెంబ్లీలో నిలబి సాధికారికంగా మాట్లాడి అధికారపక్షానికి కౌంటర్ ఇచ్చేంత టాకింగ్ పవర్ లేదు. ఉన్నదల్లా జగన్మోహన్ రెడ్డి మాత్రమే. ప్రతీ దానికి ఆయనే మైకందుకోవాల్సి ఉంటుంది. కానీ మైక్ ఎంత సేపు ఇస్తారన్నది కూడా పజిలే. ప్రధాన ప్రతిపక్ష హోదా గుర్తింపు వచ్చి ఉంటే.. అధికారపక్షంతో పాటుగా తమకూ ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేయవచ్చు. సభా సంప్రదాయాలు కాపాడాలని కోరవచ్చు. కానీ ఇక్కడ వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష నేత హోదా రాలేదు. అంతకు మించి జగన్‌కు మందు వరుసలో సీటు లభిస్తుందో లేదో చెప్పలేని పరిస్థితి. స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటే అ నిర్ణయానికి శిరసావహించాల్సిందే. గత అసెంబ్లీలో తెలుగుదేశం పార్టీకి 23 మంది సభ్యులు ఉన్నారు. ప్రధాన ప్రతిపక్షనేతగా చంద్రబాబుకు హోదా ఉంది. అయినా అసెంబ్లీలో ఆయనను ఘోరంగా అవమానించారు. ప్రతి ఒక్క వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే ఆయనను వ్యక్తిగతంగా కించ పరిచారు. ఆయన కుటుంబాన్ని ఘోరంగా తిట్టారు. ఈ తిట్లు తట్టుకోలేక ఆయన చాలెంజ్ చేసి బయటకు వెళ్లారు. కౌరవసభలా చేశారని.. గౌరవసభగా చేసి మళ్లీ ముఖ్యమంత్రిగా సభలోకి వస్తానని చాలెంజ్ చేసి వెళ్లారు.అలాగే అడుగు పెడుతున్నారు. గత సభలో ఇంత జరిగితే ఆ పరిస్థితులందటికి కారణమైన వైఎస్ఆర్‌సీపీ వారిని టీడీపీ సభ్యులు వదిలి పెట్టే అవకాశం ఉండదు. పైగా జగన్మోహన్ రెడ్డి ఓటమి భారంలో ఉన్నారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో జగన్ ను టార్గెట్ చేయడానికి టీడీపీ ఖచ్చితంగా ప్రయత్నిస్తుంది. ప్రజాస్వామ్య పద్దతుల్లో అయినా జగన్ పై ఎటాక్ ఖాయం. ఏ ప్రభుత్వం మారినా గత ప్రభుత్వంలో తప్పులు, అవకతవకలు అంటూ అసెంబ్లీలో ప్రకటనలు చేస్తుంది. జగన్ ప్రభుత్వం లో అలాంటివి లెక్కలేనన్ని ఉన్నాయని టీడీపీ చెబుతోంది. ఇప్పటికే కొన్ని శాంపిల్స్ రిలీజ్ చేసింది. జగన్ ప్రైవేటు నివాసానికి కోట్ల ప్రజాధనం వెచ్చి ఫర్నీచర్ తోపాటు ఇతర సౌకర్యాలు కల్పించుకోవడం, ఐదు వందల కోట్లు పెట్టి రుషికొండ ప్యాలెస్ ను నిర్మించుకోవడం... ప్రాజెక్టుల్ని నిర్లక్ష్యం చేయడం వంటివన్నీ బయటకు వస్తున్నాయి. అలాగే కొండంత అప్పులు చేశారని టీడీపీ నిందిస్తోంది. ఈ మొత్తం వ్యవహారాలపై వైట్ పేపర్లు రిలీజ్ చేయాలనుకుంటున్నారు. అంటే అది పూర్తిగా జగన్ పాలనా వైఫల్యాలను ప్రజల ముందు పెట్టడమే. దీనికి కౌంటర్ ఇచ్చుకోవడం.. పదకొండు మంది ఎమ్మెల్యేలతో జగన్‌కు కష్టమవుతుంది. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు జగన్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. మామూలుగా అయితే విస్తృత స్థాయి సమావేశం అవసరం లేదు. గెలిచిన ఎమ్మెల్యేలతో ఎల్పీ భేటీ నిర్వహించి నాయకుడ్ని ఎన్నుకుంటారు. ఇప్పటి వరకూ అలాంటి ఆలోచన చేయలేదు. నేరుగా విస్తృత స్థాయి సమావేశానికి పిలుపునిచ్చారు. అంటే ఖచ్చితంగా అసెంబ్లీ బహిష్కరణ నిర్ణయం తీసుకుంటారని అంటున్నారు.గతంలో కూడాజగన్ ఓ సారి అసెంబ్లీ బ బహిష్కరణ నిర్ణయం తీసుకున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హతా వేటు వేయకపోవడానికి నిరసనగా అసెంబ్లీని బహిష్కరంచారు. తానే కాదు.. యాభై మంది వరకూ ఉన్న తన ఎమ్మెల్యేలను కూడా అసెంబ్లీకి పోనివ్వలేదు. అప్పుడు కూడా ఇలా విస్తృత స్థాయి సమావేశాన్ని లోటస్ పాండ్‌లో నిర్వహించి నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు నిర్వహించబోయే విస్తృత స్థాయి సమావేశంపై అందుకే రాజకీయవర్గాల్లో ఆసక్తి వ్యక్తమవుతోంది. ఒక వేళ అసెంబ్లీ బహిష్కరణకు జగన్ నిర్ణయం తీసుకుంటే... ఆయనపై పారిపోయారని ముద్ర పడుతుంది. ధైర్యంగా ఎదుర్కొంటనే రాజకీయంగా గుర్తింపు ఉంటుందని చెబుతున్నారు. ఇదే విషయాన్ని జగన్ శ్రేయోభిలాషిగా పేరు తెచ్చుకున్న ఉండవల్లి అరుణ్ కుమార్ కూడా చెప్పారు. పోరాడమని సలహా ఇచ్చారు. మరి జగన్ ఏం చేయబోతున్నారో ?

## జాతరలో అంబలి తాగిన గ్రామస్థులకు అస్వస్థత

**చిత్తూరు, జూన్ 20 (ప్రజాస్వరం):**

చిత్తూరు జిల్లా పాలసముద్రం మండలం పాలసముద్రం గంగమ్మ జాతర అంబలి తాగి 50 మంది అస్వస్థత గురయ్యారు. వాంతులు విరేచనాలు ఎక్కువ కావడంతో వివిధ ఆస్పత్రికి తరలించారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది ఆరోగ్యం మెరుగుపడడంతో గ్రామస్తులు ఇళ్లకు చేరారు.అధికారులు త్రాగునీరు కలుషితమా లేక వేరే ఏదైనా కారణమా అని పరిశీలిస్తున్నారు.

## ఏపీ డీజీపీగా ద్వారకా తిరుమలరావు

**అమరావతి, జూన్ 20 (ప్రజాస్వరం):**

1989 ఐపీఎస్ బ్యాచ్కు చెందిన ద్వారకా తిరుమల రావును నూతన డీజీపీగా ఏపీ ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ద్వారకా తిరుమలరావు ఏపీఎస్ ఆర్టీసీ ఎండీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఏపీ డీజీపీగా ఉన్న హరీష్ గుప్తాను మళ్లీ హోం సెక్రటరీగా ప్రభుత్వం బదిలీ చేసింది.

### బాధ్యతలు స్వీకరించిన మంత్రి

# వాసంశెట్టి సుభాష్

**అమరావతి, జూన్ 20 (ప్రజాస్వరం):**

రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్స్ మరియు ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖ మంత్రిగా వాసంశెట్టి సుభాష్ బాధ్యతలు చేపట్టారు. మంత్రిగా బాధ్యత చేపట్టేందుకు రాష్ట్ర సచివాలయానికి కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు వేద పండితులు పూర్ణకుంభం తోను, అధికారులు పుష్ప గుచ్చాలను అందజేస్తూ ఘనంగా స్వాగతం పలికారు. చ పండితుల వేద మంత్రోచ్ఛారణ ల మధ్య ఆ భగవంతునికి షోడశోపచారా పూజ నిర్వహించిన తదుపరి తమ సీట్లో ఆసీనులు అయ్యారు. గత ప్రభుత్వ హయాంలో అమల్లోవున్న వైయస్సార్ భీమా పథకానికి పేరు మారుస్తూ తొలి ఫైల్ పై సంతకం చేశారు. వైయస్సార్ బీమా పథకాన్ని చంద్రన్న బీమా పథకంగా పేరు మారుస్తూ తొలి సంతకం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం విషయంలో గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించిందన్నారు. నవరత్నాల పథకాలు పేరుతో కార్మికుల సంక్షేమానికి సంబంధించిన 13 పథకాల అమలును నిలుపుదల చేసిందన్నారు. కార్మిక శాఖకు వచ్చిన రూ.3,000 కోట్ల సెస్సును పూర్తిగా పక్కదారి పట్టించడం జరిగిందన్నారు. కార్మిక భీమా పథకం కింద గతంలో శ్రీ నారా చంద్రబాబు నాయుడు హయాంలో రూ.2.55 కోట్ల భీమా సొమ్మును చెల్లిస్తే, గత ప్రభుత్వ హయాంలో కేవలం రూ.1.25 కోట్లను మాత్రమే చెల్లించడం జరిగిందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి మరియు విజయవాడలలో వున్న ఈ ఎస్ ఐ ఆసుపత్రులను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, 238 పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉన్నా భర్తీ చేయకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేసింది అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై కూడా పూర్తిగా గత ప్రభుత్వం అశ్రద్ధ వహించిందన్నారు. బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు తమ ప్రభుత్వం గట్టిగా కృషి చేస్తుందని ఆయన అన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ కార్యదర్శి హరిజవహర్లాల్, కమిషనర్ శేషగిరి బాబు, ఫ్యాక్టరీల డైరెక్టర్ చంద్రశేఖర్ వర్మ, బాయిలర్స్ డైరెక్టర్ ఉమామహేశ్వరరావు, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ ఆంజనేయులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మేయర్ గుండు సుధారాణికి అవిశ్వాస గండం

**వరంగల్, జూన్ 20 (ప్రజాస్వరం):**



గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుండు సుధారాణికి అవిశ్వాస గండం పొంచి ఉంది. ఆమెను గద్దె దించాలని గతం నుంచే ప్రయత్నాలు చేస్తుండగా, మంగళవారం బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు మున్సిపల్ కౌన్సిల్ హాలులోనే సమావేశం పెట్టుకున్నారు.ప్రస్తుతం గుండు సుధారాణి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతుండగా, ఆ ఒక్క పార్టీకి చెందిన కార్పొరేటర్లు మినహా మిగతా బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు సమావేశమై అవిశ్వాస నిర్ణయం తీసుకోగా, వరంగల్ నగరంలో ఇప్పుడిదే హాట్ టాపిక్ గా మారింది. ఇదిలాఉంటే పదవీ గండం పొంచి ఉందనే ఉద్దేశంతోనే గులాబీ పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి ఎంట్రీ ఇచ్చిన సుధారాణికి ఇప్పుడు ఆమె అంటే గిట్టని కార్పొరేటర్లతో అవిశ్వాస ముప్పు పొంచి ఉండటంతో మేయర్ కాస్త ఆందోళనలో పడినట్లు తెలుస్తోంది. గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి 2021 ఏప్రిల్ లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున 29వ డివిజన్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. అనంతరం గులాబీ పార్టీ పెద్దల సహకారంతో అనూహ్యంగా మేయర్ పీఠాన్ని దక్కించుకున్నారు. దీంతో బీఆర్ఎస్ నుంచి మేయర్ పదవిని ఆశించిన మిగతా కార్పొరేటర్లంతా తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. అప్పటినుంచి ఆమె తీరుపై అసహనంతోనే కొనసాగుతున్నారు.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తరువాత ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ అడ్రస్ గల్లంతవగా, కొంతమంది కార్పొరేటర్లు కూడా కండువాలు మార్చారు. బీఆర్ఎస్ లో మేయర్ తీరు నచ్చక కాంగ్రెస్ లో చేరారు. దీంతో గ్రేటర్ బీఆర్ఎస్ బలహీన పడగా, మేయర్ కూడా సెల్ఫ్ డిఫెన్స్ లో పడ్డారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లతో తన పదవికి గండం పొంచి ఉందనే ఆలోచనతో నాటకీయ పరిణామాల నడుమ సుధారాణి కూడా హస్తం గూటికి చేరారు.దీంతో ఆమె తీరు నచ్చక కాంగ్రెస్ లో చేరిన కార్పొరేటర్లు మేయర్ హస్తం పార్టీలోకి రావడాన్ని వ్యతిరేకించారు. కానీ అధిష్ఠానం ఆమెను పార్టీలో చేర్చుకోగా.. పార్టీ మారిన మేయర్ పీడ తప్పలేదనే భావనతో కొందరు కాంగ్రెస్ కార్పొరేటర్లు కూడా ఆమెపై అసంతృప్తితో రగులుతున్నారు.గ్రేటర్ వరంగల్ లో మొత్తంగా 66 మంది కార్పొరేటర్లు ఉండగా, ఆమెపై అప్పుడు బీఆర్ఎస్ లో ఇప్పుడు కాంగ్రెస్ లో గుర్రుగా ఉన్న కార్పొరేటర్ల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఈ రెండు పార్టీలకు తోడూ బీజేపీ కార్పొరేటర్లు కూడా ఆమెను గద్దె దించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఉన్న మూడు పార్టీల కార్పొరేటర్లలో మెజారిటీ సభ్యులకు గుండు సుధారాణి మేయర్ గా కొనసాగడం ఇష్టం లేదనే విషయం స్పష్టమవుతోంది.గ్రేటర్‌లో మొత్తం 66 డివిజన్లు ఉండగా, అందులో కాంగ్రెస్ కు 35 మంది సభ్యుల బలం ఉండగా, బీఆర్ఎస్ 22, బీజేపీకి 9 మంది సభ్యుల బలం ఉంది. కాగా అవిశ్వాసం కోసం పాలకవర్గంలోని సగానికంటే ఎక్కువ మంది కార్పొరేటర్లు సంతకం పెట్టాల్సి ఉంటుంది. కానీ అవిశ్వాస తీర్మాన నోటీసులు ఇవ్వాలంటే సొంతంగా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు సంఖ్యా బలం లేదు. దీంతోనే కాంగ్రెస్ పార్టీలోని కొందరు కార్పొరేటర్లను కూడా కలుపుకొని అవిశ్వాస తీర్మానం పెట్టాలనే యోచనలో కొందరు కార్పొరేటర్లున్నారు.ఎలాగైనా గుండు సుధారాణిని దించడంతో పాటు ఆ పదవిని దక్కించుకోవాలన్న ఆశతో ఉన్న కొందరు కార్పొరేటర్లు అవిశ్వాసానికి పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం బీఆర్ఎస్, బీజేపీకి చెందిన దాదాపు 8 మంది కార్పొరేటర్లు అందరి ముందు బహిరంగంగానే సమావేశం అయ్యారు. తమకు ఉన్న బలంతో పాటు కలిసి వచ్చే కార్పొరేటర్లను కలుపుకుని తొందర్లోనే అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన లెటర్ అధికారులకు అందించనున్నట్లు తెలిసింది.అందులో మేయర్ తో పాటు డిప్యూటీ మేయర్ ను కూడా ఆ పదవి నుంచి తప్పించాలనే ప్రయత్నం జరుగుతున్నట్లు తెలిసింది. ఈ నెల 20వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు సెక్రటరీ విజయలక్ష్మీ ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేయగా, అదే సమావేశంలో కార్పొరేటర్లంతా కలిసి కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిసింది. ఇప్పటికే మేయర్ గుండు సుధారాణి పదవీ గండంతో గందరగోళంలో పడగా, రెండు, మూడు రోజుల్లో గ్రేటర్ రాజకీయాల్లో కీలక మార్పులు చోటు చేసుకుంటాయోననే చర్చ జరుగుతోంది.

# సీఎం అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు



ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ "స్కామ్"తో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీ కోర్టు బుధవారం జూలై 3 వరకు పొడిగించింది. అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ గడువు ముగియడంతో బుధవారం తీహార్ జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో తదుపరి విచారణ జులై 3న జరగనుంది.ఢిల్లీ లిక్కర్ కేసులో ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న సీఎం అరవింద్ కేజ్రీవాల్ ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మార్చి 21న అరెస్టు చేసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రచారానికి అనుమతిస్తూ మే 10 నుంచి జూన్ 1 వరకు ఆయనకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. మరోవైపు దేశ రాజధానిలో నెలకొన్న నీటి సంక్షోభానికి పరిష్కారం చూపాలని కోరుతూ ఢిల్లీ జలవనరుల శాఖ మంత్రి అతిషి బుధవారం ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఢిల్లీలో నీటి సంక్షోభంపై విలేకరుల సమావేశంలో ఢిల్లీ మంత్రి అతిషి మాట్లాడుతూ పరిస్థితిని పరిష్కరించకుంటే జూన్ 21 నుండి నిరవధిక నిరాహార దీక్షకు దిగుతానని ప్రకటించారు. సంక్షోభం కారణంగా దాదాపు 28 లక్షల మంది ప్రజలు తమ రోజువారీ నీటి అవసరాలను తీర్చుకోవడానికి కష్టపడుతున్నారని కూడా ఆమె చెప్పారు. ఢిల్లీలో నీటి సంక్షోభం మంగళవారం మురికివాడల నుండి ప్రధాన ఆసుపత్రులు మరియు పార్లమెంట్ హౌస్, ప్రెసిడెంట్ ఎస్టేట్, చాణక్యపురి, రాయబార కార్యాలయాలు, ప్రధానమంత్రి గృహం మరియు పార్లమెంటు సభ్యుల ఫ్లాట్‌ల వరకు విస్తరించిందని అధికారులు తెలిపారు.

## నీట్ అవకతవకలపై ఉన్నస్థాయి కమిటీ

**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్**

**న్యూఢిల్లీ, జూన్ 20 (ప్రజాస్వరం):**

వైద్య విద్య కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వివరణ ఇచ్చారు. ఈ పరీక్షలో జరిగిన తప్పులు నిర్దిష్టమైన ప్రాంతాలకు మాత్రమే పరిమితమని, ఉత్తీర్ణత సాధించిన లక్షలాది మందిపై ప్రభావం ఉండదన్నారు. నీట్ వ్యవహారంపై ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరీక్షలో అవకతవకలపై బిహార్ ప్రభుత్వంతో చర్చిస్తున్నామన్నారు. అవసరమైతే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఔ౫ం) అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. పారదర్శకంగా పరీక్షల నిర్వహణెళి తమ తొలి ప్రాధాన్యమని.. విద్యార్థుల ప్రయోజనాల విషయంలో రాజీ పడేది లేదన్నారు. తప్పు చేసిన ఎవరినీ ఉపేక్షించబోమని చెప్పారు. విద్యార్థుల విషయంలో రాజకీయాలు చేయవద్దని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్

**న్యూఢిల్లీ, జూన్ 20 (ప్రజాస్వరం):**

లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా ఒడిశాకు చెందిన సీనియర్ ఎంపీ భర్తృహరి మహతాబ్ వ్యవహరించనున్నారు. ఈ విషయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఒడిశాలోని కటక్ నుంచి ఏడుసార్లు విజయం సాధించిన భర్తృహరి.. స్పీకర్ ఎన్నిక పూర్తయ్యే వరకు లోక్‌సభ ప్రిసైడింగ్ అధికారిగా కార్యకలాపాలు నిర్వహిస్తారని తెలిపారు. 18వ లోక్‌సభకు కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయిస్తారని.. ఆయనకు కె.సురేష్ (కాంగ్రెస్), టీఆర్ బాలు (డీఎంకే)తో పాటు రాధామోహన్ సింగ్ (భాజపా), ఫగ్గన్ సింగ్ కులస్తే (భాజపా), సుదీప్ బంధోపాధ్యాయ (టీఎంసీ) ఛైర్‌పర్సన్‌ల ప్యానెల్ సహాయంగా ఉంటుందని మంత్రి తెలిపారు. భర్తృహరి మహతాబ్ ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలకు ముందే బిజు జనతాదళ్‌ని వీడి భాజపాలో చేరిన విషయం తెలిసిందే. కటక్ నుంచి భాజపా అభ్యర్థిగా పోటీచేసి ఏడోసారి విజయ దుందుభి మోగించారు.

## ధరణిలో తహసీల్దార్, ఆర్డీవోలకు ధరణి లాగిన్

**కరీంనగర్, జూన్ 20 (ప్రజాస్వరం):**

బీఆర్ఎస్ ప్రభుత్వం భూముల లావాదేవీల కోసం ధరణి పోర్టల్ అందుబాటులోకి తెచ్చింది. అయితే ధరణి అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో కాంగ్రెస్ ప్రభుత్వం...ధరణిపై ఓ కమిటీ వేసింది. ఈ కమిటీ ధరణి పోర్టల్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టింది. ధరణి పోర్టల్ సాంకేత సమస్యలతో రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతున్న రైతులు, భూయజమానులకు ప్రభుత్వం ఓ గుడ్ న్యూస్ చెప్పింది. ధరణిలోని భూసమస్యలకు పరిష్కారానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో పలు జిల్లాల్లో రెవెన్యూ యంత్రాంగం రంగంలోగి దిగింది. భూసమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయి పర్యటనలతో పాటు పాత దస్త్రాలను పరిశీలించాలని రెవెన్యూశాఖ అధికారులు నిర్ణయించుకున్నారు. ధరణి సమస్యలపై కలెక్టర్లపై ఇటీవల సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి... జిల్లాల వారీగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి జూన్ చివరి నాటికి సమస్యల పరిష్కారాన్ని ఓ కొలిక్కి తీసుకోవాలని ఆదేశించారు. అయితే గతంలో ధరణి సమస్యలు పరిష్కరించేందుకు కలెక్టర్లకు మాత్రమే అధికారం ఉండేది. ధరణి దరఖాస్తులు పెద్ద సంఖ్యలో ఉండడంతో జాప్యం జరగకుండా ఉండేందుకు ఆర్డీఓలు, తహసీల్దార్లకు ధరణి పోర్టల్ లాగిన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. జీఎల్ఎం, టీఎం-33, మిస్సింగ్ సర్వే నంబర్లు, భూమి హెచ్చుతగ్గులు, నిషేధిత జాబితాలోని భూములు, వారసత్వ భూములు, నాలా కన్వర్షన్, ఎన్నారైల భూములు, కోర్టు కేసుల్లోని భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ఆర్డీఓలు, తహసీల్దార్లు బాధ్యతలు అప్పగించింది. రెవెన్యూ ఆఫీసుల్లో ధరణి సమస్యలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.డ్యాష్ బోర్డులు ఏర్పాటు చేసి ఏ తరహా భూ సమస్యలు ఎక్కువగా పెండింగ్ లో ఉన్నాయని స్పష్టం చేస్తూ రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కలెక్టరేట్‌తోపాటు ఆర్డీఓ,




తహసీల్దార్ కార్యాలయాల్లో డ్యాష్ బోర్డులు ఏర్పాటుచేయాలని ఆదేశించింది. దరఖాస్తుల పెండింగ్‌కు కారణాలను డ్యాష్ బోర్డుల్లో ప్రజలకు తెలియజేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ నెలాఖరు నాటికి పెండింగ్ దరఖాస్తులకు ఓ పరిష్కార మార్గం చూపాలని రెవెన్యూ యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత దరఖాస్తుల పరిష్కారం అయితే మరోసారి దరఖాస్తుల ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో లక్షలాది కుటుంబాలు భూసమస్యలు ఎదుర్కొంటున్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం అంటోంది. ఆ సమస్యల పరిష్కారానికి ధరణి పోర్టల్‌ను పునర్వ్యవస్థీకరించి, భూవ్యవహారాలను అందుకు సంబంధించిన చట్టాల్లో మార్పులు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు ధరణి పోర్టల్ ప్రక్షాళనకు సత్వర చర్యలు చేపట్టింది. ధరణి పోర్టల్ అమలులో వచ్చిన సమస్యలను అధ్యయనం చేయడానికి ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ భూసంబంధిత నిపుణులు, అధికారులతో చర్చించి 18 రాష్ట్రాల్లోని ఆర్వోఆర్ చట్టాలని పరిశీలించింది. భూ వివాదాల పరిష్కార కోసం రెవెన్యూ ట్రిబ్యునల్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. భూమికి సంబంధించిన ముఖ్యమైన చట్టాలన్నింటిని కలిపి ఒకే చట్టంగా రూపొందించాలని కమిటీ ప్రభుత్వానికి సూచించింది. ధరణి పోర్టల్ బలోపేతం చేయాడానికి, సామాన్య ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతుంది.

## సికింద్రాబాద్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

**సికంద్రాబాద్, జూన్ 20 (ప్రజాస్వరం)::**

సికింద్రాబాద్ లోని ఆల్ఫా హెూటల్, సందర్శిని హెూటల్, రాజ్ బార్ అండ్ రెస్టారెంట్ లో ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు చేసారు. చాలా కాలంగా ఫ్రిడ్జ్ లోనే నిల్వ ఉంచిన మటన్ మాంసాహార ముడి పదార్థాలను గుర్తించారు. ఆల్ఫా బ్రాండ్ ఐస్ క్రీమ్, బ్రెడ్ ప్యాకెట్లపై డేట్ లేకుండా కస్టమర్లకు విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. నిబంధనలు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఆల్ఫా హెూటల్ పై కేసు నమోదు చేసారు. రాజ్ బార్ అండ్ రెస్టారెంట్ కిచెన్ అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. రాజ్ బార్ అండ్ రెస్టారెంట్ సిథటిక్ ఫుడ్ కలర్స్ ఉపయోగిస్తున్నారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ వ్యాలిడిటీ ముగిసినట్లు గుర్తించారు.



# విద్యుత్ కోనుగోళ్లలో తిరకాసులు

**హైదరాబాద్, జూన్ 20 (ప్రజాస్వరం):**

విద్యుత్ కొనుగోళ్లలో డిస్కంలకు జరిగిన నష్టం అక్షరాలా 85 వేల కోట్లు.. ఇదే లెక్కను విద్యుత్ సంస్థల అధికారులు సీఎం రేవంత్ రెడ్డికి చెప్పారుఅయితే ఇన్ని వేల కోట్ల భారం ఎందుకు పడింది? మొన్న సీఎం కేసీఆర్ ఏం చెప్పారో గుర్తుందా? తెలంగాణ సర్కార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకొని ఒక్కో యూనిట్‌ను 3 రూపాయల 90 పైసలకే కొనుగోలు చేసిందన్నారు. కాని చివరకు కరెంట్ సరఫరా అయ్యే సరికి ఆ ధర కాస్త 5 రూపాయల 64 పైసలకు పెరిగింది. దీంతో 3 వేల 110 కోట్ల అదనపు భారం పడింది. అది కూడా ఎప్పుడో ఒప్పందం చేసుకుంటే.. 2017 ఆఖర్లో సరఫరా ప్రారంభమైంది. మరి అదైనా ఒప్పందంలో ఉన్నట్టు వెయ్యి మెగావాట్లు సరఫరా అయ్యిందా అంటే అదీ లేదు. దీంతో 2017 నుంచి 2022 మధ్య కాలంలో మళ్లీ 2 వేల 83 కోట్లు చెల్లించి బహిరంగ మార్కెట్లో కొనాల్సి వచ్చింది. ఈ దారుణం ఇక్కడితో ఆగిందా లేదు.. ఇంకేం జరిగిందో మీరే చూడండి.ఇది ఒప్పందం లెక్కలు.. ఇక యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్ల విషయానికి వద్దాం.. భద్రాద్రి పవర్ ప్లాంట్ గురించి కేసీఆర్ ఏం చెప్పారు. అప్పటికప్పుడు మనకు విద్యుత్ తయారీ అత్యవసరం. అందుకే ప్రభుత్వ రంగ సంస్థ %దీఎజూ%తో ఒప్పందం చేసుకున్నాం.. వేగంగా విద్యుత్ ఉత్పత్తి కోసమే సబ్ క్రిటికల్ టెక్నాలజీతో పవర్ ప్లాంట్‌ను నిర్మించామన్నారు. కాని.. ఈ వ్యాఖ్యల వెనక కూడా తిరకాసు ఉంది. అసలు గోదావరి నది ఒడ్డునే పవర్ ప్లాంట్ల నిర్మాణంతో ఇప్పుడు మరో పెద్ద నష్టం ఎదురుకాబోతుందని తెలుస్తుంది.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాల కారణంగా.. ప్రజల నెత్తిన వేల కోట్ల అప్పుల భారం పడినట్టు క్లియర్ కట్‌గా అర్థమవుతోంది.కేసీఆర్ చెప్పినవన్ని కల్లబొల్లి మాటలే అని దీన్ని బట్టి అర్థమవుతోంది. అనాలోచిత నిర్ణయాలు.. ఏకపక్ష నిర్ణయాలు.. ఇవే బీఆర్ఎస్ హయాంలో జరిగిందని తెలుస్తుంది. పేరు కోసం ప్రజల నెత్తిన అప్పులను రుద్దినట్టు అర్థమవుతోంది. ఇప్పటికే కమిషన్ విచారణను స్పీడప్ చేసింది. అన్ని వర్గాల నుంచి సమాచారాన్ని సేకరిస్తుంది. అధికారులను విచారిస్తోంది. సో.. వెరీ సూన్ కమిషన్ తన తుది నివేదికను సిద్ధం చేయడం ఖాయంగా కనిపిస్తోంది.ఇప్పటి వరకు విచారణలో పాల్గొన్నవారు.. ఎదుర్కొన్నవారు.. విచారణ జరిపే వారు.. ఎవరి నోటిన విన్నా మనకు అర్థమయ్యే విషయం ఒకటే.. అదేంటంటే వేల కోట్లలో ప్రజాధనం వృథా అయ్యింది. దీనికి కారణం మేమే డిజైనర్లు.. మేమే కాంట్రాక్టర్లు.. అంతా మేమే అన్నట్టుగా వ్యవహరించిన గత ప్రభుత్వ పెద్దలు.. వారు తీసుకున్న నిర్ణయాలు. మరి ఇదే విషయాన్ని తన రిపోర్ట్‌లో కమిషన్ పొందుపరిస్తే ఏం జరగనుంది? ఈ ఏకపక్ష నిర్ణయాలకు ఎవరు బాధ్యత వహించబోతున్నారు? అనేది అతి త్వరలో తేలనుంది.



# ఊసూరుమనిపిస్తున్న వానలు

● ఉత్తరతెలంగాణలో దయనీయ స్థితి

వరంగల్, జూన్ 20 (ప్రజాస్వరం):

వ్యవసాయ సీజన్ ఆరంభమైంది.. కానీ వర్షాలు మొఖం చాటేయడంతో కరువు మేఘాలు కలవరపెడుతున్నాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అంతటా ఇదే పరిస్థితి.. కనీస వర్షపాతం లేకపోవడంతో రైతులు ఆకాశం వైపు ఎదురుచూస్తూ తీవ్ర నిరాశ చెందుతున్నారు.. మరోవైపు గ్రామాల్లో కప్పతల్లి ఆటలు, పొలిమేర దేవతలకు పూజలు చేస్తున్నారు..కరువు మేఘాలు కమ్మేయడంతో ఈసారి పంటలు అయోమయంలో చిక్కుకున్నాయని రైతుల ఆందోళన చెందుతున్నారు. సకాలంలో విత్తనాలు దొరికినా వాన దేవుడి కరుణ లేకపోవడంతో అన్నదాతల్లో నైరాస్యం కనిపిస్తోంది.విత్తిన పత్తి విత్తనాలు మొలకెత్తకపోవడంతో రైతులు దిగులుతో తలలు పట్టుకుంటున్నారు. ఆ విత్తనాలు ఉడిగిపోకుండా కాపాడుకునేందుకు మానవ ప్రయత్నాలు మొదలుపెట్టారు. వారిలోని ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని వెలికితీస్తూ పంటలు కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాలో కమ్ముకొస్తున్న కరువు మేఘాలు.. పత్తి రైతుల కంటతడిపెట్టిస్తున్నాయి. ఆరంభ శూరత్వంలా మురిపించిన వర్షాలు అడ్రస్ లేకుండా పోయాయి.. రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు రైతులను కలవరపెడుతున్నాయి. భిన్న వాతావరణంతో జూన్ నెలలో



ఇప్పటివరకు కనీస వర్షపాతం నమోదు కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.. ఈ ఖరీఫ్ సీజన్లో ఆరంభంలోనే రైతులకు చేదు అనుభవం ఎదురవుతుండడంతో అయోమయం నెలకొంది..ఈ వ్యవసాయ సీజన్లో రాష్ట్ర వ్యాప్తంగా 55 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతుందని అంచనా.. జూన్ మొదటి వారంలోనే దాదాపుగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పత్తి విత్తనాలు విత్తారు. తొలకరి చినుకులను చూసి ఆనందంతో మురిసిపోయారు. కానీ గత 15 రోజుల నుండి చినుకు చుక్క జాడలేదు. అప్పుడప్పుడు ఉరుములు మెరుపులు మురిపిస్తున్నా వాన చుక్కజాడలేదు.. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పోటీపడి మరి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు ఇప్పుడు బిత్తరపోయి ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు..వరంగల్ ఉమ్మడి జిల్లాలో 16 లక్షల 82 వేల ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణం ఉండగా.. అందులో దాదాపుగా ఆరున్నర లక్షల ఎకరాలకు పైగా పత్తి సాగు జరుగుతుందని అంచనా వేశారు.. ఇప్పటికే పత్తి విత్తనాలు 90% శాతం విత్తారు. కానీ వర్షాలు లేకపోవడంతో చాలా ప్రాంతాల్లో ఆ విత్తనాలు మొలకెత్తడం లేదు. దీంతో రైతులు పడరాన్ని పాట్లు పడుతున్నారు.. కొన్ని ప్రాంతాల్లో బిందెలు, బకెట్ల ద్వారా నీళ్లు తీసుకువచ్చి ఆ విత్తనాలను తడుపుతున్నారు.. మరికొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీళ్లు తీసుకువచ్చి డ్రిప్పింగ్ పద్ధతిలో విత్తనాలను తడిపి మొలకెట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే విత్తిన విత్తనాలు మొలకెత్తకపోవడంతో కొంతమంది రైతులు దిగులతో తలలు పట్టుకున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని ములుగు, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్ జిల్లాలో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. జూన్ నెలలో నమోదు కావాల్సిన సాధారణ వర్షపాతం కంటే 43% లోటు వర్షపాతం కనిపిస్తుంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.. విత్తిన విత్తనాలను కాపాడుకోవడం కోసం భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు..


## నీవు నేర్పిన పునరేకికరణే... నీరజాక్ష...

వరంగల్, నిజామాబాద్, జూన్ 20 (ప్రజాస్వరం):

తెలంగాణలో రాజకీయ పునరేకీకరణకు రంగం సిద్ధమవుతోంది. గత రెండు టర్మ్ లలో కేసీఆర్ పాటించిన సంప్రదాయాన్నే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అమలు చేయాలనుకుంటోంది. ఒక్కరు కాదు ఇద్దరు కాదు.. అసెంబ్లీ బడ్జెట్ సెషన్ కంటే ముందే బీఆర్ఎస్ పార్టీకి చెందిన 12 మంది ఎమ్మెల్యేలను చేర్చుకునేందుకు రంగం రెడీ చేసింది. ఇప్పటికే వారందరితో మాట్లాడి రెడీ చేసి పెట్టారన్న ప్రచారం జోరందుకుంది. గులాబీ పార్టీకి గడ్డుకాలం ఎదురవబోతోంది. ఆ పార్టీ ఏది ముట్టుకున్నా కలిసి రావడం లేదు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా నాలుగున్నరేళ్ల టైం ఉంది. సో ఇప్పుడు గులాబీ బాస్ ముందున్న అతిపెద్ద సవాల్ ఏంటంటే.. తమ పార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకోవడం. ఇప్పటికైతే ఎంపీలెవరూ ఆ పార్టీ నుంచి గెలవలేకపోయారు. సో ఉన్న ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి బుజ్జగింపులు చేస్తున్నట్లుగా ప్రచారమైతే జరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి 12 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరేందుకు సిద్ధమవుతున్నారంటున్నారు. అది కూడా వచ్చే నెల అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముందే ఇది జరిగిపోయేలా ప్లాన్ నడుస్తోందంటున్నారు.పొలిటికల్ సర్కిల్స్ లో ఇప్పుడు జరుగుతున్న ప్రచారం ఏంటంటే.. బీఆర్ఎస్ఎల్పీ కాంగ్రెస్ లో విలీనం అవుతుందంటున్నారు. అయితే ఓసారి లెక్కలు ఎలా ఉన్నాయో చూద్దాం. గత అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీ 39 సీట్లు గెలిచింది. అయితే ఇందులో కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఉన్న లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో బైపోల్ వచ్చింది. ఆ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలిచింది. సో సంఖ్య 38కి తగ్గింది. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.ఫైనల్ గా గులాబీ పార్టీకి ఇప్పుడు 35 మంది ఎమ్మెల్యేలు మిగిలారు. ఇందులో 22 మంది హస్తం పార్టీలోకి వస్తే బీఆర్ఎస్ఎల్పీ విలీనమవుతుంది. ఇప్పటి లెక్క ప్రకారం 12 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హస్తం పార్టీలో జాయిన్ అయ్యేందుకు సిద్ధమవుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఇంత చేసినా విలీనానికి మరో 10 మంది ఎమ్మెల్యేలు అవసరం. సో విలీనానికి టైం ఉన్నా.. ప్రస్తుతానికైతే 12 మంది ఎమ్మెల్యేలపై హస్తం పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ అస్త్రాన్నైతే ప్రయోగించింది. నిజానికి హస్తం పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టడానికి చాలా కారణాలు ఉన్నాయి.కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే కూలిపోతుంది అని అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీ నేతలు పదే పదే కామెంట్లు చేస్తూ వచ్చారు. వీటిపై సీఎం రేవంత్ రెడ్డి ఘాటుగా వార్నింగ్ కూడా ఇచ్చారు. అయినా ఈ కోరస్ తగ్గలేదు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరు చూసి వచ్చే వారికి డోర్లు ఓపెన్ చేసి ఉంచాలని డిసైడ్ అయ్యారు. నిజానికి పార్టీ మారాలనుకుంటున్న వారి గురించి తెలుసుకున్న కేసీఆర్ వారిని బుజ్జగించే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇంకో నాలుగున్నరేళ్లు కళ్లు మూసుకుంటే వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని నచ్చజెబుతున్నారు. అయితే గత పదేళ్లలో అధికారంలో ఉన్నప్పుడు తమ సెగ్మెంట్ కు, నమ్ముకున్న కార్యకర్తలకు ఏమీ చేయలేకపోయారని అసంతృప్త ఎమ్మెల్యేలు చెబుతున్న మాట.నిజామాబాద్ జిల్లా నుంచి ఓ సీనియర్ ఎమ్మెల్యే.. హస్తం పార్టీలో జాయిన్ అవ్వాలని డిసైడ్ అయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఆహ్వానానికి ఓకే చెప్పినట్లు చెబుతున్నారు. అటు కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి కూడా కాంగ్రెస్ గూటికి వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లుగా తెలిసింది. అయితే క్యాబినెట్ బెర్త్ ఇవ్వాలని కోరుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. హైకమాండ్ ఓకే చేస్తే.. ఈ చేరిక జరుగుతుందంటున్నారు. అటు మహబూబ్ నగర్ జిల్లాలో మరింత బలోపేతం అవ్వాలని కాంగ్రెస్ అనుకుంటోంది. ఇప్పటికే పాలమూరు లోక్ సభ స్థానంలో హస్తం పార్టీ గెలవలేకపోయింది. అటు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానంలోనూ విజయం సాధించలేదు. దీంతో అక్కడ ఎమ్మెల్యేలపై ఆపరేషన్ ఆకర్ష్ అస్త్రం ప్రయోగించారు. పార్టీని పాలమూరులో మరింత బలోపేతం చేసుకునేలా ప్లాన్ చేశారు.అటు మెదక్ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు హస్తం పార్టీలో జాయిన్ అయ్యేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే అందులో ఒకరు క్యాబినెట్ బెర్త్ అడుగుతున్నట్లుగా చెబుతున్నారు. ఇంకోవైపు కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు.. వారి రాకను అడ్డుకుంటున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. మరోవైపు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎఫెక్ట్ చూపించలేకపోయింది. మొన్నటి కంటోన్మెంట్ బైపోల్ తో పుంజుకున్నా.. మిగితా ఎమ్మెల్యేలను చేర్చుకోవడం ద్వారా జీహెచ్ఎంసీ పరిధిలో బలం పెంచుకోవాలనుకుంటోంది. వచ్చే ఏడాది గ్రేటర్ ఎన్నికలు జరగనుండడంతో ఇప్పటి నుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారు.అదే సమయంలో కాంగ్రెస్ లో జాయిన్ కావాలనుకుంటున్న వారు కూడా హస్తం పార్టీలో ఉన్న తమ పాతమిత్రులను సంప్రదిస్తూ బెర్త్ కన్ఫామ్ చేసుకునే పనిలో ఉన్నారంటున్నారు. గ్రేటర్ పరిధి నుంచి నలుగురు గులాబీ ఎమ్మెల్యేలు హస్తంతో టచ్ లో ఉన్నారంటున్నారు. కాంగ్రెస్ లోకి వచ్చే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కోసం రకరకాల పదవుల తాయిలాలను రెడీ చేశారంటున్నారు. విన్ విన్ సిచ్యువేషన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారంటున్నారు. అయితే పార్టీ మారాలనుకుంటున్న ఎమ్మెల్యేలు తమకు బీఆర్ఎస్ హయాంలో ఎదురైన చేదు అనుభవాలను, సహకారం అందించని విషయాన్ని, కేసీఆర్ దర్శనం లేకపోవడాన్ని గుర్తు చేసుకుంటున్నారట.ఇంకోవైపు బీఆర్ఎస్, బీజేపీ నేతలు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలకు చెక్ పెట్టేలా హస్తం పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోందంటున్నారు. నిజానికి కొందరు గులాబీ నేతలు తమ వ్యాపారాలు కాపాడుకునేందుకు, కేంద్ర దర్యాప్తు సంస్థల రెయిడ్స్ లేకుండా ఉండేందుకు జాగ్రత్త పడుతూ బీజేపీలోకి ప్రచారం జోరందుకున్న టైంలో కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ ను స్పీడప్ చేసిందంటున్నారు. అటు మాజీ మంత్రి హరీష్ రావు తాను ఏ పార్టీలోకి వెళ్లడం లేదని క్లారిటీ ఇచ్చుకున్నారు. తప్పుడు ప్రచారం చేస్తే లీగల్ నోటీసులు ఇస్తానంటున్నారు.

## మక్కాలో తీవ్రమైన వేడి..

**మృతిచెందిన హజ్ యాత్రికుల్లో 90 మంది భారతీయులే**



ముస్లింల పవిత్ర హజ్ యాత్ర ఈసారి విషాదాంతమైన విషయం తెలిసిందే. ప్రస్తుతం సౌదీ అరేబియాలో ఎండలు దంచికొడుతున్నాయి. మును పెన్నడూ లేనివిధంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ఉష్ణతాపానికి హజ్ యాత్రికులు అల్లాడిపోతున్నారు. తీవ్రమైన వేడికి యాత్రికులు మృత్యువాత పడుతున్నారు. ఇక ఇప్పటి వరకూ 645 మంది చనిపోయినట్లు అధికారిక వర్గాలు తాజాగా వెల్లడించాయి. చనిపోయినవారిలో వివిధ దేశాలకు చెందిన యాత్రికులు ఉన్నట్లు చెప్పారు. ఈజిప్ట్, జోర్డాన్ దేశస్తులు అధికంగా ఉన్నట్లు తెలిపారు. సుమారు 323 మంది ఈజిప్షియన్లు కాగా, 90 మందికిపైగా జోర్డానియన్లు మరణించినట్లు తెలిపారు. అయితే, చనిపోయిన యాత్రికుల్లో దాదాపు 90 మంది భారతీయులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఓ దౌత్యాధికారి వెల్లడించినట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అయితే, భారతీయుల సంఖ్యపై సౌదీ అధికారులు గానీ, భారత ప్రభుత్వం గానీ ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక ప్రకటనా చేయలేదు. మక్కాలో ప్రస్తుతం 50 డిగ్రీల సెల్సియస్‌కు పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ సారి యాత్రలో దాదాపు 18.3 లక్షల మంది పాల్గొన్నారని, వారిలో 22 దేశాలకు చెందిన 16 లక్షల మంది ఉన్నట్లు సౌదీ హజ్ నిర్వాహకులు వెల్లడించారు. మరో రెండు లక్షల మంది సౌదీ అరేబియా వాసులుగా పేర్కొన్నారు. ఎండ తీవ్రతకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఉపశమనం కలిగించడం లేదని అధికారులు పేర్కొన్నారు. మక్కాలోని అతిపెద్ద ఆసుపత్రుల్లో ఒకటైన అల్-ముయిసెమ్ ఆసుపత్రిలో మృతదేహాలను ఉంచినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఆ మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కాగా, గతేడాది హజ్ యాత్రలో 240 మంది యాత్రికులు చనిపోయారు. వారాలో చాలా మంది ఇండోనేషియాకు చెందిన వారే ఉన్నట్లు సౌదీ మీడియా తెలిపింది.

## రైలులో మంటలు

సికింద్రాబాద్, జూన్ 20 (ప్రజాస్వరం)::

రైల్ నిలయం సమీపంలో మెట్టుగూడ బ్రిడ్జీపైన రైల్ లో మంటలు చేలరేగాయి.వంటగది బోగీలో మంటలు ఎగిసిపడ్డాయి. విషయం అందుకున్న రైల్వే అధికారులు, రైల్వే పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకున్నారు. చివరకు మంటలను ఆర్పివేసారు.

## బైక్ దొంగల హల్ చల్

సూర్యాపేట, జూన్ 20 (ప్రజాస్వరం)::

సూర్యాపేట జిల్లా కేంద్రంలో బైక్ దొంగలు రెచ్చిపోయారు. విద్యానగర్ లోని రమేష్ రెడ్డి హాస్పిటల్ లో పార్క్ చేసిన బైక్ ను ఖిలాడీలుఎత్తుకెళ్లారు. లు. సీసీ కెమెరా కు దొంగతనం దృశ్యాలు చిక్కాయి. నిత్యం ఏదో ఒక చోట బైకులు మాయమవుతున్నాయి.

## శారీరక ఎదుగుదల కోసం డివార్మింగ్ మాత్రలు వేసుకోవాలి

**మంత్రి పొన్నం**

హైదరాబాద్, జూన్ 20 (ప్రజాస్వరం)::

రాజ్ భవన్ హైస్కూల్ లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా గారు,హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. మంత్రులు దామోదర రాజనర్సింహా , పొన్నం ప్రభాకర్ రాజ్ భవన్ స్కూల్ విద్యార్థులకు స్వయంగా డివార్మింగ్ మాత్రలు వేసారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్,ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి రాజ్ భవన్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ,హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్.చోంగ్తు,ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్,హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, తదితరులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఈరోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో డీ వార్మింగ్ డే జరుపుకుంటున్నాం తెలంగాణ లో చెప్పాలంటే నట్టల మందు కార్యక్రమం. పిల్లల శారీరక



ఎదుగుదలకు సంబంధించి డీ వార్మింగ్ టాబ్లెట్స్ ఎంతగానో ఉపయోగపడతాయి. ఈరోజు నుండి ఈ నెల 27 వరకు హైదరాబాద్ లో ఉన్న 11 లక్షల 77 వేల మంది పిల్లలకు ఈ నులిపురుగుల నివారణ కార్యక్రమం ద్వారా టాబ్లెట్స్ ఇవ్వడం జరుగుతుంది. 19 సంవత్సరాల వరకు ఉన్న పిల్లలకు ఈ మందులు వేసుకోవాలి. శారీరక ఎదుగుదల సక్రమంగా ఉండాలంటే ఈ టాబ్లెట్స్ వేసుకోవాలి. తల్లిదండ్రులు మీ పిల్లలకు ఈ టాబ్లెట్స్ వేపించాలని విజ్ఞప్తి చేస్తున్నా. భవిష్యత్ లో ఆరోగ్యానికి సంబంధించిన మరిన్ని కార్యక్రమాలు ఈ ప్రభుత్వం చేపడుతుంది.

## రైతన్నలకు గుడ్ న్యూస్ కనీస మద్దతు ధర పెంచేసిన ప్రభుత్వం

ఢిల్లీ, జూన్ 20 (ప్రజాస్వరం)::

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం 14 ఖరీఫ్ పంటలపై కనీస మద్దతు ధర ఎంఎస్పి ని ఆమోదించింది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ, 2018 బడ్జెట్‌లో, ఉత్పత్తి ఖర్చు కంటే కనీసం 1.5 రెట్లు ఎం ఎస్ పి, ఉండాలని ప్రభుత్వం చాలా స్పష్టమైన విధాన నిర్ణయం తీసుకుంది. ఈసారి తీసుకున్న నిర్ణయంతో పోలిస్తే ప్రతి పంటకు కనీసం 50 శాతం ఎక్కువ ఎంఎస్పి ఉంటుంది. అని తెలిపారు. తీసుకున్న నిర్ణయంతో రైతులకు దాదాపు రూ. 2 లక్షల కోట్ల ఎంఎస్పీ లభిస్తుందని, ఇది గత సీజన్‌తో పోలిస్తే రూ. 35,000 కోట్లు ఎక్కువ అని ఆయన తెలిపారు. ఖరీఫ్‌లో 14 రకాల పంటలకు మద్దతు ధరను పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకోగా. వరికి మద్దతు ధరను రూ.117 పెంచింది. తాజా పెరుగుదలతో క్వింటాల్ ధాన్యం ధర రూ.2,300కు చేరుకుంది. పెంచిన ధరలను ఖరీఫ్ సీజన్ నుంచి అమలు చేస్తున్నట్లు కేంద్రప్రభుత్వం తెలిపింది. పత్తి, మొక్కజొన్న, రాగి, జొన్న సహా పద్నాలుగు రకాల పంటలకు మద్దతు ధరను ప్రభుత్వం పెంచింది. వరిపై ఎమ్మెస్పీని రూ.1,533 నుంచి రూ.2,300కి పెంచగా, జొన్నపై ఎంఎస్పీ రూ.2,247 నుంచి రూ.3,371కి పెరిగింది.

## వెహికల్ బీమాలో నకిలీలలు

బద్వేలు, జూన్ 20 (ప్రజాస్వరం):

రవాణా వాహనాలకు ప్రతి సంవత్సరం సామర్థ్య పరీక్షలు ( ఫిట్నెస్ సర్టిఫికెట్- ఎఫ్ సి) తప్పనిసరి. వెహికల్ కండిషన్ చూసి రవాణా శాఖ అధికారులు ఎఫ్ సి చేస్తారు ఆ సమయంలో అన్ని పత్రాలు ఉండాలి వాటిలో బీమా తప్పనిసరి కార్లకు మూడు సంవత్సరాలు ద్విచక్ర వాహనానికి ఐదు సంవత్సరాలు అద్దె వాహనాలకు ప్రతి సంవత్సరం బీమా చేయించుకోవాలి ఒక లారీకి 40 వేల నుంచి 50 వేల రూపాయలు అలాగే ఆటోకు 8000 రూపాయలు ఖర్చు అవుతుంది కొంతమంది వెహికల్ డ్రైవర్లు అంత మొత్తం కట్టలేక వేయి రూపాయలు 2000 రూపాయలు చెల్లించి ఏజెంట్ల వద్ద నకిలీ బీమా పత్రం తీసుకుని వాటిని ఆన్లైన్లో అప్లోడ్ చేస్తున్నారు అధికారులు కూడా వాటిపై ఇచ్చిన తేదీ గడువు ఉందా అని చూసి ఓకే చేస్తున్నారు కొద్ది రోజులకు ఏదైనా ప్రమాదంలో వెహికల్ డ్రైవర్ చనిపోతే అప్పుడు బీమా కింద నయా పైసా కూడా రాదు దీంతో కుటుంబాలు వీధిన పడుతున్నాయి. బద్వేలు నియోజకవర్గం అట్లూరు మండలానికి చెందిన ఒక మహిళ నకిలీ బీమా పత్రం పెట్టి తన వాహనానికి ఎఫ్ సి చేయించుకున్నారు బద్వేలు రవాణా శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీ లో ఈ విషయం వెలుగులోకి వచ్చింది దీంతో అధికారులు ఆమెపై కేసు నమోదు చేశారు అలాగే కడప నగరానికి చెందిన ఆటో డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు అతని కుటుంబ సభ్యులు ప్రమాద బీమాకు దరఖాస్తు చేసుకున్నారు బీమా కంపెనీ అధికారులు వచ్చి ఆటోకు సంబంధించిన పత్రాలు పరిశీలించారు అతను అప్పటికే నకిలీ పత్రలతో ఎఫ్ సి చేయించుకోవడం జరిగింది దీంతో ఆ కుటుంబానికి నయా పైసా కూడా రాలేదు ఇలాంటివి చాలా ఉన్నాయి. కడప జిల్లాలో గత కొంతకాలంగా నకిలీ బీమా పత్రాలు వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది కడప బద్వేలు పులివెందుల ప్రొద్దుటూరు రవాణా శాఖ కార్యాలయాల వద్ద కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు దళారులు నకిలీ బీమా పత్రాలు తయారు చేస్తున్నారు ఇలాంటివి ప్రతిరోజు అయిదారు వస్తున్నాయి అవి చూడ్డానికి ఒరిజినల్ పత్రం లాగే ఉంటాయి దీంతో అధికారులు గుర్తించడం కష్టంగా మారింది అనుమానం ఉండి బార్కోడు తనిఖీ చేస్తే తప్ప గుర్తించలేక పోతున్నారు రవాణా శాఖ అధికారులు అన్నింటిని బార్కోడ్ తో తనిఖీ చేయాలంటే సాధ్యం కాదు. దీంతో కొంతమంది దళారులు అధికారుల కళ్ళు కప్పి నకిలీలు పెట్టి పనులు చేయించుకుంటున్నారు అటు పోలీసు శాఖ ఇటు రవాణా శాఖ అధికారులు నకిలీ ఎఫ్సీలపై స్పెషల్ డ్రైవ్ చేపడితే దీనికి కొంతవరకైనా అడ్డుకట్ట పడుతుంది లేకుంటే వెహికల్ దారులు తీవ్రంగా నష్టపోతారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఇంట్లో ఈడీ సోదాలు



సంగారెడ్డి, జూన్ 20 (ప్రజాస్వరం)::

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఇంట్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. దీంతో, తీవ్ర కలకలం చోటుచేసుకుంది.కాగా, ఈడీ అధికా రులు ఏక కాలంలో గురువారం తెల్లవారుజాము నుంచే పటాన్చెరు నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇంట్లో సోదాలు చేపట్టారు. అలాగే, ఆయన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి ఇంట్లో కూడా తనిఖీలు చేపట్టారు. ఈడీ సోదాల విషయం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. అయితే, ఇద్దరు సోదరులు మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవలి కాలంలో ఓ కేసులో గూడెం మధు అరెస్ట్ అయిన విషయం తెలిసిందే.నిజాంపేటలోని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఇంట్లో కూడా అధికారులు సోదాలు చేస్తున్నారు. ఇక, గతంలో లక్డారం గనుల వ్యవహారంలో పోలీసు స్టేషన్లో కేసు నమోదు అయ్యింది. ఈ కేసు ఆధారంగానే ఈడీ సోదాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక, తాజా సోదాల గురించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

# పుష్ప రిలీజ్ రోజే ఛావా విడుదల



రెంటిలోనూ రష్మికే హీరోయిన్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న కలిసి నటిస్తున్న సినిమా 'పుష్ప - 2 ది రూల్'. సుకుమార్ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 15న రిలీజ్ కావాల్సి ఉండగా, షూటింగ్ ఆలస్యంతో డిసెంబర్ 6కు మార్చారు. అయితే, రష్మిక మాత్రం ఈ విషయంలో అసంతృప్తిగా ఉన్నారట. ఎందుకు అంటే.'ఛావా' కూడా అదేరోజు.. రిలీజ్ కాబోతోంది. పుష్ప' సినిమాతో పాన్ ఇండియా స్టార్ అయిపోయింది రష్మిక. దీంతో ఆమె ఫాలోయింగ్ పెరిగిపోయింది. ఆ సినిమా తర్వాత వరుస అవాకాశాలతో దూసుకుపోతోంది. పుష్ప తర్వాత మరో భారీ హిట్ సినిమా 'యానిమల్'. దీంతో రష్మికకు బాలీవుడ్ లో కూడా విపరీతమైన ఫాలోయింగ్ పెరిగిపోయింది. వరుస ప్రాజెక్ట్ లతో బిజీ బిజీగా ఉంది. విక్కీ కౌశల్ తో ఆమె నటించిన సినిమా 'ఛావా'. ఛత్రపతి శివాజి జీవిత కథ ఆధారంగా ఈసినిమా తెరకెక్కుతోంది. అయితే, ఆ సినిమా కూడా డిసెంబర్ 6నే రిలీజ్ అవుతుందట. దీంతో రెండు సినిమాల మధ్య పోటీ ఉంటుందని, ఏదో ఒక సినిమాపై ఎఫెక్ట్ పడే అవకాశం ఉందని భావిస్తున్నారట రష్మిక. రెండు సినిమాలపై భారీ అంచనాలు ఉన్నాయి. 'పుష్ప' ఇప్పటికే బాలీవుడ్ ని షేక్ చేయడం, ఛత్రపతి శివాజీ లాంటి పవర్ ఫుల్ కథ కావడంతో రెండు సినిమాలపై భారీ అంచనాలు ఉన్నాయి ప్రేక్షకుల్లో. రెండు సినిమాల మధ్య పోటీ ఉంటుందని అనుకుంటున్నారట. అయితే బీ టౌన్ లో వినిపిస్తున్న మరో వార్త ఏంటంటే? 'ఛావా' సినిమాని పోస్ట్ పోన్ చేసే యోచనలో ఉన్నారట మేకర్స్. పుష్ప - 2' సినిమా నుంచి రిలీజైన రెండు పాటలు, అల్లు అర్జున్ లుక్ అన్నీ ప్రేక్షకులను తెగ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా బన్నీ ఫ్యాన్స్ అయితే ఫిదా అయిపోయారు. దీంతో ఎప్పుడెప్పుడు సినిమా రిలీజ్ అవుతుందా అని వెయిట్ చేశారు చాలామంది. అయితే, ఇప్పుడు దాన్ని పోస్ట్ పోన్ చేస్తూ ప్రకటించారు. దానికి కారణం కూడా చెప్పింది మైత్రీ మూవీ మేకర్స్. సినిమా షూటింగ్ ఇంకా పెండింగ్ ఉందని, పోస్ట్ ప్రొడక్షన్ కి కూడా టైం పడుతుందని, క్వాలిటీ సినిమాని ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతోనే సినిమా పోస్ట్ పోన్ చేసినట్లు చెప్పింది. సుకుమార్ దర్శకత్వం వహించిన 'పుష్ప' బాక్సాఆఫీస్ రికార్డులను బద్దలు కొట్టింది. అటు నార్త్ లో కూడా ఈసినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇక ఈ సినిమాలో అల్లు అర్జున్, రష్మిక మందన్న జంటగా నటించారు. 'పుష్ప 2'లో మలయాళ స్టార్ హీరో ఫహాద్ ఫాజిల్, కన్నడ హీరో ధనుంజయ్, సునీల్, అనసూయ భరద్వాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. దేవి శ్రీప్రసాద్ సంగీతాన్ని అందించారు. ఇప్పటికే రిలీజైన రెండు పాటలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి.



# క్లీంకార రాకతో.. జీవితాలు పరిపూర్ణం

ఉపాసన ఎమోషన్ వీడియో

రామ్ చరణ్, ఉపాసనల గారాలపట్టి క్లీంకార మొదటి పుట్టినరోజు ఈరోజు సందర్భంగా దంపతులకు శుభాకాంక్షలు వెల్లువెతుతున్నాయి. ఉపాసన ప్రసవించి ఏడాది అయింది.ఈ విషయాన్ని చెబుతూ తన కుమార్తెకు విషెస్ చెబుతూ ఉపాసన ఓ ఎమోషనల్ వీడియో షేర్ చేశారు. 'నా ప్రియమైన క్లీంకారకు పుట్టినరోజు శుభాకాంక్షలు. నీ రాకతో మా జీవితాలు పరిపూర్ణమయ్యాయి. మా జీవితాల్లో ఆనందం నింపినందుకు ధన్యవాదాలు' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో షేర్ చేశారు. ఈ వీడియోను ఇప్పటికీ లెక్కలేనన్నిసార్లు చూసినట్లు ఉపాసన ఆ వీడియోలో చరణ్, ఉపాసనతోపాటు ఇరు కుటుంబాల వారు క్లీంకార పుట్టినప్పటి రోజులను గుర్తుచేసుకున్నారు. గతేడాది ఉపాసన పుట్టినరోజు నాడు చరణ్ ఈ వీడియోను షేర్ చేశారు. ఇప్పుడు దాన్నే మరోసారి ఆమె అభిమానులతో పంచుకున్నారు. క్లీంకార డెలివరీ టైమ్ నుంచి తమ కుటుంబంలో ఎలాంటి సందడి వాతావరణం నెలకొందో అన్న విషయాలను ఈ వీడియోలో చూపించారు. ఇక క్లీంకారకు మెగా అభిమానులతోపాటు సినీ సెలబ్రిటీలు శుభాకాంక్షలు చెబుతున్నారు. 'లిటిల్ వండర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు' అని కాజల్ కామెంట్ పెట్టగా.. 'హ్యాపీ బర్త్‌డే లిటిల్ స్టార్' అని కియారా అడ్వాణీ, రకుల్ ప్రీత్ సింగ్ రిప్లై పెట్టారు. ప్రస్తుతం ఈ వీడియో నెటిఇట్టింట వైరల్ అవుతోంది.

# కల్కి ఓ అద్భుత సినిమా




ప్రీ రిలీజ్ వేడుకల్లో ప్రముఖుల ఆనందం

కథే కాదు... ఆ ప్రపంచానికి సంబంధించిన విజువల్స్ మొదలుకొని ప్రతి అంశాన్నీ ఊహించుకుని భవిష్యత్తుతో ముడిపడిన ఓ అద్భుతమైన సినిమాని తెరకెక్కించాడు నాగ్ అశ్విన్. ఇందులో నేనొక భాగం కావడం నాకెంతో గర్వకారణం అన్నారు ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్. ఆయన ఓ కీలక పాత్రలో నటించిన చిత్రం 'కల్కి 2898 ఎ.డి'. ప్రభాస్ కథానాయకుడు.అమితాబ్ బచ్చన్ మాట్లాడుతూ 'ఈ సినిమా ఓ కొత్త ప్రపంచం. నాకు ఎప్పటికీ మరిచిపోలేని అనుభవాన్నిచ్చింది. నాగ్ అశ్విన్ ఈ కథ చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాను. ఏం తాగితే ఇలాంటి ఆలోచనలు వస్తాయా అనిపించింది. నిర్మాత అశ్వనీదత్ లాంటి నిర్మాతని ఇదివరకు నేనెప్పుడూ కలవలేదు. ఆయన వ్యక్తిత్వం ఎంతో గొప్పది' అన్నారు. దీపికా పదుకొణె కథానాయిక. కమల్ హాసన్ ప్రతినాయకుడిగా నటించారు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం రాత్రి ముంబయిలో చిత్రబృందం విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించింది. ఈ సందర్భంగా యువ కథానాయకుడు రానా దగ్గుబాటి అడిగిన పలు ప్రశ్నలకు చిత్రబృందం సమాధానమిచ్చింది. వేడుకలో తొలి టికెట్‌ని అమితాబ్ బచ్చన్ కొని కమల్‌హాసన్‌కి అందజేశారు. ఈ సందర్భంగా కమల్‌హాసన్ మాట్లాడుతూ 'ఇలా తొలి ఆట తొలి టికెట్‌ని పొందే అవకాశం 'షోలే' సినిమాకి దక్కుంటే బాగుండేది. కొన్ని వారాలపాటు ఆ సినిమా టికెట్ కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. అప్పట్లో ఆ సినిమాని చూసిన అభిమానులకంటే ఎక్కువగా ఇప్పుడు 'కల్కి 2898 ఎ.డి'ని చూస్తారని ఆశిస్తున్నా. నా గురువు, మార్గదర్శి బాలచందర్‌లాగా అసాధారణమైన మనుషులు చాలా సాధారణంగా కనిపిస్తుంటారు. అందుకే అలాంటివాళ్లతో మాట్లాడేవరకూ వాళ్లపై ఓ అభిప్రాయానికి రాను. సాధారణమైన వ్యక్తిలాగే వచ్చిన నాగ్ అశ్విన్ కథ చెప్పడంలో నేర్పుని చూసి అద్భుతం అనిపించింది. సినిమానీ అంతే నేర్పుగా తెరపైకి తీసుకొచ్చాడు' అన్నారు. ప్రభాస్ మాట్లాడుతూ 'నేను కన్న కలల కంటే గొప్పది ఈ సినిమా. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణెలతో కలిసి నటించడం అద్భుతమైన అనుభవం' అన్నారు. దీపికా పదుకొణె మాట్లాడుతూ 'ఇందులో నేను తల్లి పాత్రలో కనిపిస్తా. నాగ్ అశ్విన్ కథ చెప్పినప్పుడు ఇదివరకెప్పుడూ లేని ఓ కొత్త అనుభవం కలిగింది' అన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వనీ దత్, ప్రియాంక దత్, స్వప్న దత్ పాల్గొన్నారు.

# దీపికకు ప్రభాస్ చేయూత..

నైస్ అంటూ అమితాబ్ ప్రశంస

'భైరవ అంథమ్' ఇండియన్స్ బి÷-గగెస్ట్ సాంగ్ అఫ్ ది ఇయర్ గా టాప్ చార్ట్ లో వుంది. ఈ మల్టీలింగ్వెల్, మైథాలజీ -ఇన్స్పైర్డ్ సైన్స్ ఫిక్షన్ విజువల్ వండర్ జూన్ 27న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ నేపధ్యంలో మేకర్స్ ముంబై లో గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్ లో కల్కి టీంతో హ్యాండ్సమ్ హంక్ రానా దగ్గుబాటి ఇంటరాక్షన్ స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచింది. కాగా కల్కిలో దీపిక గర్భవతిగా కనిపించింది. విశేషమేమిటంటే.. ఇప్పుడు నిజ జీవితంలోనూ దీపికా పదుకోణె గర్భంతో ఉంది. ముంబై'కల్కి 2898 ఏడీ' ప్రీ రిలీజ్ ఈవెంట్ దీపికా హాజరైంది. అయితే నిండు గర్భంతో ఉన్న ఆమె స్టేజి మీద నుంచి కిందకు దిగుతున్న సమయంలో ప్రభాస్ చెయ్యి అందించి సహాయం చేశారు. అదే సమయంలో అక్కడ ఉన్న అమితాబ్ బచ్చన్ సరదాగా ప్రభాస్, దీపికను సరదాగ ఆట పట్టించారు. ప్రభాస్ భుజం తట్టి నైస్ అన్నట్టు ప్రోత్సహించారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. మహిళలను గౌరవించడం ప్రభాస్ తర్వాతే ఎవరైనా, పాన్ ఇండియా స్టార్ సింప్లిసిటీకి ఇది నిదర్శనమంటూ అభిమానులు, నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.



Edited, Printed, Published and Owned by Puram Maheshwar, Printed at Hari Hara Art Printers, H.No.6-1,85, Toopran, Medak (Dist) Telanagana 502336. Published at H.No. 4-50/18, Kallakal (Vill), Kallakal (Po), Manoharabad (M), Medak (Dist), Telangana 502336. Editor Puram Maheshwar. RNI No. TELTEL/2006/17154

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
మెదక్
సంగారెడ్డి-సిద్దిపేట
www.prajaswaramdaily.com
శుక్రవారం 21 | జూన్ 2024 | పేజీలు : 4

# నులి పురుగులను నిర్మూలించాలి : జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



● వివరాలు 2 లో

# పోలీస్‌ల ఆలస్యం చేయడం వల్లే





- చాలా కాలం తర్వాత మళ్ళీ నల్ల కోటు కార్యకర్తల కోసం వేశాను తప్పక న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నా
- ఎంపీ రఘునందన్ రావు

**మెదక్, జూన్ 20 (ప్రజాస్వరం) :**

పోలీస్‌లకు గొరక్షకులు సమాచారం అందించిన వెంటనే స్పందించి ఉంటే మెదక్ ప్రశాంతమైన వాతావరణం చెడిపోయేది కాదని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. గురువారం మెదక్ జిల్లా కోర్టులో అల్లర్లలో అరెస్టయిన వారి కోసం మెదక్ ఎంపీ రఘునందన్ రావు నల్ల కోటు ధరించి బెయిల్ కోసం వారి తరఫున వాదించడం జరిగిందీ. అనంతరం ఎంపీ మాట్లాడుతూ మెదక్ లో గోసంరక్షణ కోసం వెళ్లి గోరక్షకులు అక్కడి నుండి పోలీస్ లకు 11 గంటలకు ఇస్తే ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి ఉంటే అల్లర్లు జరగకుండా మెదక్ ప్రశాంతంగా ఉండేదని అన్నారు. పోలిసులు నిర్లక్ష్యం వల్లనే అల్లర్లకు కారణమని ఇది పూర్తిగా పోలీసుల వైఫలయమైని అన్నారు. అరెస్టు అయినా కార్యకర్తల పక్షాన నిలబడేందుకు చాలా కాలం తర్వాత నల్ల కోటు వేసుకున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం లో గెలిచిన 8 మంది బీజేపీ ఎంపీ లకు కేంద్ర పార్టీ సన్మానం కార్యక్రమం ఉన్నప్పటికీ నా గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తల పక్షాన ఉండేందుకు ఇక్కడికి వచ్చానని తెలిపారు. ప్రతి కార్యకర్త కృషి వల్లే ఎంపీ గా గెలిచానని, వారికి ఏ కష్టం వచ్చినా ముందు ఉంటానని చెప్పానని, అందుకే వారి కోసం వచ్చినట్టు గా రావడం జరిగిందని అన్నారు. కోర్టు లో న్యాయమూర్తి ముందు ఇరు పక్షాల వాదనలు వినిపించమని, న్యాయస్థానం ఈ నెల 21 న వరకు వాయిదా వేసినట్టు తెలిపారు. తమకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పంజా విజయ్, సంతోష్ రెడ్డి తదితరులు ఉన్నారు.



# రాష్ట్రంలో ప్రభుత్వం మారింది కానీ పాలన మారలేదు

- ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడి కట్టడి లో ప్రభుత్వం, అధికారులు విఫలం
- నిబంధనలు పాటించని వారిపై చర్యలు ఎక్కడ
- ఏబీవీపీ రాష్ట్ర కార్య సమితి సభ్యులు శశికాంత్

● వివరాలు 2 లో



# కులం సర్టిఫికెట్ లేని పిట్టలవాడ వాసులు





**అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోని వైనం**

**మనోహరబాద్, జూన్ 20 (ప్రజాస్వరం) :**

అర్హత ఉన్నా అధికారులు ఆ వాడ ప్రజలకు కులం సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. దీంతో విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు. అర్హులైన వారు కల్యాణలక్ష్మి లాంటి పథకాలకు నోచుకోవడం లేదు. తమకు గజం జాగా కూడా లేదని సంక్షేమ పథకాలు అందించాలని కోరుతున్నా సర్కారు పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నా రు. ఈ సమస్య ఎక్కడో కాదు.. మాజీ సీఎం కేసీఆర్ తినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలోనే కావడం గమనార్హం. దండుపల్లి గ్రామంలో ఉన్న పిట్టలవాడలో దాదాపు 55 కుటుంబాలు, 200 మంది వరకు నివాసం ఉంటున్నారు. వీరికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు.. కనీసం పక్కా ఇండ్లు కూడా లేవు. గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారుల చర్యలు చేపట్టడంతో ఆ వృత్తికి స్వస్తి చెప్పి... ప్రస్తు తం నేషనల్ హైవే మీద మక్క కంకులు, సీతా ఫలాలు, మామిడి పండ్లు అమ్ముకుని ఉపాధి పొందుతున్నారు. అయితే వీరికి అధికారులు క్యాస్ట్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో ఎలాంటి సంక్షేమ పథకాలు రావడం లేదు. మూడేళ్లలో 25 మంది ఆడపిల్లలకు పెళ్లిళ్లు కాగా.. ఒక్కరికి కూడా కల్యాణ లక్ష్మి పథకం అమలు కాలేదు. టెన్త్ పాసైన 40 మంది విద్యార్థులు స్కాలర్ షిప్ రాక పైచదువులకు దూరమయ్యారు. ఇతర ప్రాంతాల్లో ని పిట్టల వాళ్లకు ఇచ్చినట్లుగా ఎస్టీ క్యాస్ట్ సర్టిఫికె ట్లు ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గత సంవత్సరం మార్చిలో మెదక్ కలెక్టర్ గా ఉన్న రాజర్షిషా డిస్టిక్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ కేశవరం తూప్రాన్ ఆర్డీఓ ఓం ప్రకాష్, తహసీల్దార్ బిక్షపతితో కమిటీ ఏర్పాటు చేశారు ఆ కమిటీ పిట్టల వాడు వచ్చే ఎంక్వయిరీ చేసింది. కానీ ఆ కమిటీ రిపోర్ట్ ఇప్పటివరకు కలెక్టర్ కు అందజేయలేదని సమాచారం. ప్రభుత్వం ఇప్పటికైనా తమకు ఎస్టి సర్టిఫికెట్ మంజూరు చేయాలని పిట్టలవాడా వాసులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఫీజు కట్టలేక కాలేజీ బంజేసిన - శేఖర్, పిట్టలవాడ నేను ఇంటర్ ఫస్ట్ ఇయర్ వరకు చదివిన. క్యాస్ట్ సర్టిఫికెట్ ఉంటేనే స్కాలర్ షిప్ వస్తదట. లేదంటే ఫీజు కట్టమన్నరు. అంత స్థోమత లేకపోవడంతో సెకండ్ ఇయర్ చదవకుండానే మధ్యలో కాలేజీ బంజేసిన. మా వాడల అందరి పరిస్థితి గిట్లనే ఉన్నది.

## మా భూమి మాకు దక్కేంతవరకు పోరాటం చేస్తాం...బీడీ కార్మిక మహిళలు

### తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేసిన బీడీ కార్మిక మహిళలు



**రామయంపేట, జూన్ 20 (ప్రజాస్వరం) :**

నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో సర్వే నెం.824లో గల 6 ఎకరాల భూమి బీడీ కార్మికులందరూ కలిసి 35 సంవత్సరాల క్రితం కొనుగోలు చేయడం జరిగిందని అట్టి భూమి ని ఒకరికి 2 గుంటలు చొప్పున కొలతలు లేకుండా మొత్తం 6 ఎకరాల భూమిని బీడీ కార్మికులు సొంత డబ్బులతో కొనుగోలు చేశామన్నారు.అట్టి భూమి లో బీడీ కార్మికులకు ఇల్లు మంజూరు అయినాయి. అందుకు కొంతమంది ఆ స్థలంలో 60 గజాలు చొప్పున ఇండ్ల నిర్మాణం చేసుకున్నారు. మరికొంతమంది ఎలాంటి నిర్మాణం చేయలేదు.వారి వారి కుటుంబాల అవసరాల రీత్యా కట్టిన ఇళ్లను మాత్రమే వేరే వారికి విక్రయించడం జరిగింది. ఇల్లు నిర్మాణాన్ని మాత్రం అమ్మడం జరిగింది కానీ ఇంటి చుట్టు ఉన్న కాలు స్థలాలు అమ్మలేదని ఆ కాలి స్థలాలు అక్రమంగా పాతిన హద్దులను మేమే తొలగించామన్నారు. మా ఖాళీ స్థలం భూమి మాకే వర్తించే విధంగా చూడాలని ఎమ్మార్వో గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఇట్టి కాలి స్థలాలను అన్యాక్రాంతం చేసి ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని లేనియెడల కలెక్టర్ కార్యాలయం వెళతామని అన్నారు.ఏదైనా ఈ స్థలానికి సంబంధించి క్రయవిక్రయాలు జరిగితే బీడీ కార్మికుల నిర్ణయం మేరకు రిజిస్ట్రేషన్ జరగాలని తాహసిల్దార్ సురేష్ కుమార్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఇట్టి విషయంపై తహసిల్దార్ ను వివరణ కోరగా రేపటి రోజు ఆర్ ఐ సర్వేలను గ్రామానికి అధికారులను పంపించి స్థలాన్ని సర్వే చేపట్టి అట్టి నివేదికను పై అధికారులకు పంపిస్తామన్నారు.బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతామన్నారు. బీడీ కార్మిక మహిళలు కళావతి, కౌసల్య, లక్ష్మి, నాగలక్ష్మి, సిద్ధవ్వ, రాజ్, బి కాసింబి తదితర బీడీ కార్మిక మహిళలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ దిద్దుబాటు చర్యలు

న్యూఢిల్లీ: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పేలవమైన పనితీరు కనబర్చిన రాష్ట్రాలపై కాంగ్రెస్ అధిష్టానం దృష్టి పెట్టింది. జరిగిన తప్పిదాలను అంచనా వేసేందుకు దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పార్టీ పేలవమైన పనితీరును అంచనా వేయడానికి కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నిజనిర్ధారణ కమిటీలను ఏర్పాటుచేశారు. తెలంగాణతోపాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఢిల్లీ, కర్ణాటక, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌లకు నిజ నిర్ధారణ కమిటీలు వేశారు. ఈ మేరకు బుధవారం పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో తెలంగాణకు సంబంధించి నిజనిర్ధారణ కమిటీలో పార్టీ సీనియర్ నేతలు పిజె కురియన్, రఖీబుల్ హుస్సెన్, పర్గత్ సింగ్‌లకు బాధ్యతలు అప్పగించారు. మధ్యప్రదేశ్‌కు పృథ్వీరాజ్ చవాన్, సప్తగిరి ఉల్కా, జిగేష్ మేవానీ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌కు వీరప్ప మొయిలీ, హరీష్ చౌదరి, ఒడిశాకు అజరు మాకెన్, తారిక్ అన్వర్‌లకు బాధ్యతలు ఇచ్చారు.

# నులి పురుగులను నిర్మూలించాలి : జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్










**తూప్రాన్ / రామయంపేట, జూన్ 20 (ప్రజాస్వరం) :**

జిల్లాలో ఒక సంవత్సరం వయస్సు పిల్లల నుండి 19 సంవత్సరాల వయస్సు కలిగిన 2 లక్షల 36 వేల మంది పిల్లలకు నులి పురుగుల నివారణ మందులను పంపిణీ చేయడంన్ జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన నులి పురుగుల నివారణ దినోత్సవం ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రల ద్వారా ఎటువంటి దుష్ప్రభావాలు కలగవని నులి పురుగులను నిర్మూలించాలని తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రభుత్వ ,ప్రైవేటు పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో, అంగన్వాడి కేంద్రాలలో ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలకు స్వయంగా సిబ్బందే వేయడం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు ఉపయోగించుకొని పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన అన్నారు. జిల్లాలోని ప్రతి పాఠశాల ప్రతి అంగన్వాడీ కేంద్రము ప్రతి కాలేజీలో ప్రతి ఒక్కరు విధిగా మాత్రల అందించే విధంగా ప్రణాళిక చేసుకోవాలని, గ్రామస్థాయిలో పట్టణ స్థాయిలో చాటింపు చేయడం ద్వారా ప్రజలందరికీ నులిపురుగుల నిర్మూలన కోసం ప్రచారం చేయాలని ఆదేశించారు. నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి అన్ని రకాలుగా వైద్య ఆరోగ్యశాఖ సిద్ధంగా ఉండాలని క్షేత్రస్థాయిలోకి వైద్య సిబ్బంది వెళ్లి కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. నులిపురుగులు పిల్లలు ఆరుబయట ఆడుకున్నప్పుడు, చేతులు కడుక్కోకుండా ఆహారం భుజించినప్పుడు, బహిరంగ ప్రదేశంలో మలవిసర్జన చేయటం వలన అపరిశుభ్ర పరిసరాల వలన ఈవి సంక్రమిస్తాయని పిల్లల్లో నులిపురుగుల సంక్రమణ ప్రభావం వలన రక్తహీనత, చురుకుదనం, పోషకాహార లోపం ,ఆకలి లేకపోవుట, బలహీనత, ఆందోళన, కడుపునొప్పి, వికారము విరోచనాలు లాంటి దుష్ప్రభావాలు కనిపిస్తాయి అన్నారు. నులిపులురు ఉండడం వల్ల పిల్లలు ఏకాగ్రత కోల్పోతారని, పని సామర్థ్యం తగ్గిపోతుందని, పాఠశాల హాజరు శాతం తగ్గిపోవడం, పిల్లల్లో కడుపు నొప్పి లాంటి సమస్యలు ఏర్పడతాయన్నారు, నులిపురుగుల సంక్రమణ వ్యాప్తిని నియంత్రించడానికి ఎప్పటికప్పుడు పరిశుభ్రమైన నీటిని తాగాలని ఆహారంపై మూతలు ఉంచాలని, పండ్లు, కూరగాయలు శుభ్రమైన నీటితో కడగాలని, ఆరు బయట ఆడుకునేటప్పుడు కాళ్లకు పాదరక్షలు ధరించాలని, భోజనం చేసే ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి అని తెలియజేశారు. నులిపురుగుల నిర్మూలన కోసం ఉపాధ్యాయులు, అంగన్వాడీలు అందరు తమ వంతు కృషిగా చేయాల్సిన అవసరం ఉందని నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని వారి ఆరోగ్యాన్ని సంరక్షించుటకు మన అందరి కర్తవ్యం అని ఆరోగ్యకరమైన భావిభారత సమాజాన్ని అందించాలంటే నులి పురుగులను నిర్మించాలని పేర్కొన్నారు. నులిపురుగులు నివారణ కోసం ఈ మాత్రలు వేసుకోవడం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు కలగజేయవని, ఒకవేళ ఏదైన సమస్య ఏర్పడినట్లయితే దగ్గర్లోని వైద్యాధికారికి వైద్య సిబ్బందికి తెలియజేయాలని కోరారు. అనంతరం పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు స్వయంగా పిల్లలకు వేసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, వైస్ ఛైర్మెన్ నందాల శ్రీనివాస్, మెట్టు బాల కృష్ణా రెడ్డి, ప్రభుత్వ ఆస్పత్రి అమర్ సింగ్, నాయకులు సత్యనారాయణ గౌడ్, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, తూప్రాన్ ఆర్డిఓ జయచంద్రారెడ్డి, డాక్టర్లు వైద్య సిబ్బంది తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ప్రభుత్వం మారింది కానీ పాలన మారలేదు

- ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడి కట్టడి లో ప్రభుత్వం, అధికారులు విఫలం
- నిబంధనలు పాటించని వారిపై చర్యలు ఎక్కడ
- ఏబీవీపీ రాష్ట్ర కార్య సమితి సభ్యులు శశికాంత్

**మెదక్, జూన్ 20 (ప్రజాస్వరం) :**

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం మారింది గాని పరిపాలన విధానం మారలేదు అలాగే అధికారం మారింది గానీ అధికారుల తీరు మారలేదాని ఏబీవీపీ రాష్ట్ర కార్య సమితి సభ్యులు శశికాంత్ అన్నారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రం లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కానీ దేశ భవిష్యత్తు కానీ నిర్మాణం చేసేటటువంటి విద్యారంగం మీద రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి పట్టింపు లేకుండా పోయిందనీ అన్నారు. విద్యాసంస్థలు మొదలై సుమారుగా 10 రోజులు కావస్తున్న ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు అత్యధిక ఫీజులు వసూలు చేస్తూ అనుమతులు లేకున్నా విద్యాసంస్థలను చలామణి చేస్తున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విచ్చలవిడిగా పుస్తకాలు అమ్ముతున్నప్పటికీ అధికారులు మొద్దు నిద్ర విడాడం లేదనీ మండిపడ్డారు. బ్రాండ్ల పెర విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అమ్ముతూ ఆ సిలబస్ కాకుండా వేరే పుస్తకాలను కొంటె మీకు విద్యను ఎవరు చెప్తారు అవి మా పాఠశాలలో చెల్లవు అంటూ యాజమాన్యాలు బెదిరింపులకు పల్పడుతున్నారానీ అన్నారు. నేటి విద్యాసంస్థలన్ని విద్యా కేంద్రాలుగా ఉండాల్సిన విషయం మరిచి వ్యాపార కేంద్రంగా మారిపోయాయనీ అన్నారు. నూతనంగా ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలకు పైగా కావస్తున్న సీఎం విద్యారంగం లో ఫీజుల నియంత్రణ పై మాట్లాడిన పాపాన పోలేదన్నారు. రాష్ట్రంలో మద్యానికి మంత్రి ఉన్నాడు కానీ విద్యకు మంత్రి కరువైపోయారానున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేసే విధంగా సరైన పద్ధతిలో నడిపే విధంగా స్పెషల్ కమిటీని వేసి విద్య రంగంలో పరిస్థితుల ను చక్కదిద్దాలని అన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీలని అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల దోపిడీ ని విద్యాధికారులు అరికట్టకుంటే ఏబీవీపీ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉందనీ, గత ప్రభుత్వాన్ని ఏ రకంగానైతే చెప్పినట్టుగా గద్దె దింపుదామని చెప్పాము అదే రకంగా ఈ ప్రభుత్వానికి కూడా బుద్ధి చెప్పే దిశగా ఏబీవీపీ ఉద్యమ కార్యచరణ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ, ఏబీవీపీ నాయకులు శశాంక్, ప్రభాస్, అనిల్, అక్షయ్ లు పాల్గొన్నారు.

# కేసీఆర్ కాలనీలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను స్వాధీనం చేసుకున్న నిరుపేదలు






**రామాయంపేట, జూన్ 20 (ప్రజాస్వరం) :**

ఇంటి అద్దెలు చెల్లించలేక నిరుపేదలు ఖాళీగా ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇళ్లను పేదలు స్వాధీనం చేసుకున్నారు. రామాయంపేట మండల కేంద్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాల క్రితం సొంత ఇల్లు లేని నిరుపేదల కోసం 300 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టింది నిర్మాణం పూర్తయి వాటిలో కొన్నింటిని 250 డబుల్ బెడ్రూమ్ ఇళ్లను నిరుపేదలకు గత సంవత్సరం పంపిణీ చేశారు. మరో 50 డబుల్ బెడ్ రూమ్ ఇల్లు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచారు. కాలం గడుస్తున్న నిరుపేదలకు ఇల్లు కేటాయించలేదు. అంతలోనే ప్రభుత్వం మారిపోయి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఖాళీగానే ఉన్నాయి. మున్సిపాలిటీకి చెందిన పలువురు నిరు పేదలు తాము ఇంటి అద్దెలు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నామని గురువారం సుమారు 100 కుటుంబాలకు చెందిన వారు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల తాళాలను తొలగించి ఇండ్లను స్వాధీనం చేసుకున్నారు. తాము ఎంతోకాలంగా డబుల్ బెడ్ రూమ్ కోసం అధికారులు నాయకులు చుట్టూ తిరిగిన పట్టించుకోవడం లేదని తాము అద్దెలు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నామని వారు తెలిపారు ఇప్పటికైనా అధికారులు తమకు సర్టిఫికెట్లు అందజేయాలని వారు డిమాండ్ చేశారు.

## జిపి కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

**కుటుంబ పోషణ భారంగా మారింది**

**సీఐటీయూ జిల్లా కోశాధికారి నరసమ్మ**

**ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందు ధర్నా.**

**మెదక్, జూన్ 20 (ప్రజాస్వరం) :**



గ్రామ పంచాయతీ సిబ్బందికి 8 నెలలుగా బకాయి ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలనీ డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మెదక్ ఎమ్మెల్యే కార్యాలయం ముందు గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి నరసమ్మ మాట్లాడుతూ 8 నెలల నుండి వేతనాలు రాక కనీస నిత్య అవసర సరుకులు కొనుగోలు చేయని పరిస్థితిలో ఉన్నామనీ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధి లైట్స్, డంపింగ్ యార్డ్స్, హరితహారం, పల్లె పకృతి వనాలు, వైకుంఠ ధామాలు తదితర పనుల్లో నిత్యం శ్రమిస్తూ గ్రామీణ ప్రాంతాలలో ఎలాంటి అంటువ్యాధులు, అనారోగ్యాలు రాకుండా ప్రజలకు సేవలందిస్తున్నా మమ్మలినిపట్టించుకున్న నాధుడే లేరు అన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులతో అత్యధికులు దళితులు, బలహీన వర్గాలకు చెందిన పేద కార్మికులు, సంవత్సరాల తరబడి విధులు నిర్వహిస్తున్నా నేటికీ పర్మినెంట్ కు నోచుకోలేదు అన్నారు. ఈ వేతనాలు నెలల తరబడి ఇవ్వకపోవడంతో ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చింది అన్నారు. వేతనాలు రాకపోవడంతో పంచాయతీ కార్మికులు అర్ధాకలితో, అప్పులు చేసుకుని బతకాల్సిన పరిస్థితుల్లో ఉన్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయితీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని 34 రోజుల పాటు సమ్మె చేసిన సందర్భంలో గ్రామ పంచాయితీ సిబ్బందికి 5 లక్షల ఇన్సూరెన్స్, దహన సంస్కారాలకు 10,000/- లు ఇస్తామని సర్క్యులర్ జారీ చేసి ఈ స్కీము ల యొక్క విధి విధానాలు ఇప్పటికీ ప్రకటించలేదు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టో లో పొందుపర్చిన విధంగా గ్రామ పంచాయితీ కార్మికులందరి పర్మినెంట్ చేసి, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేసి, కార్మికుల పెండింగ్ వేతనాలు త్వరితగతిన చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

## సౌత్ సెంట్రల్ రైల్వే జీఎంను కలిసిన మెదక్ ఎంపీ

**పెండింగ్ రైల్వే పనులను పూర్తి చేయాలని వినతి**



**మెదక్, జూన్ 20 (ప్రజాస్వరం) :**

మెదక్ పార్లమెంట్ పరిధిలో పెండింగ్లో ఉన్న రైల్వే సమస్యలను పరిష్కరించేందుకు మెదక్ ఎంపీ రఘునందన్ రావు, సెంట్రల్ రైల్వే జీఎం తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జీఎం కు పెండింగ్ సమస్యలపై జీఎం కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ పరిధిలో పెండింగ్ లో ఉన్న పలు రైల్వే సమస్యల పరిష్కారానికై సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం తో సమావేశమైనట్లు తెలిపారు. ఏదుల నాగుల పల్లి లో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, సిద్దిపేట నుంచి పెద్దపల్లి వరకు రైల్వే లైన్ పొడిగింపు, పఠాన్ చెరు నుంచి అక్కన్నపేట, మెదక్ వరకు రైల్వే లైన్ పొడిగించాలని కోరినట్లు తెలిపారు. మెదక్, సిద్దిపేట నుంచి తిరుపతి వరకు రైలు సౌకర్యం కల్పించాలని, వడియారం, అక్కన్నపేట్ లలో రాయలసీమ, అజంతా ఎక్స్ ప్రెస్ రైళ్ల ను ఆపాలని, వడియారం, సిద్దిపేట రైల్వే స్టేషన్లలో రేక్ పాయింట్స్ నిర్మాణం జరపాలని కోరానని వీటన్నింటికీ జీఎం సానుకూలంగా స్పందించిన ట్లు తెలిపారు.

## ఈ నెల 24 నుంచి 29 వరకు సంక్షేమ అధికారుల పరీక్షల

- పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- పరీక్ష కేంద్రానికి గంట ముందు చేరుకోవాలి
- మొదటి పరీక్ష ఉదయం10 నుంచి 12:30 వరకు
- రెండవ పరీక్ష మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్, జూన్ 20 (ప్రజాస్వరం) :**



గిరిజన సంక్షేమ శాఖ ,సాంఘిక సంక్షేమ శాఖ ,బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని వసతి గృహాల్లో సంక్షేమ అధికారుల పోస్టుల కోసం నిర్వహించే గ్రేడ్ 2 పరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వారి కేటాయించిన పరీక్ష కేంద్రాలకు పరీక్ష సమయానికి ఒక గంట ముందు హాజరు కావాలని సూచించారు. 24 వ తేదీ నుండి ఉదయం 10 గంటలకు మొదటి సేషన్ పరీక్ష మధ్యాహ్నం రెండున్నర గంటల నుండి ఐదు గంటల వరకు రెండవ సెషన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష సమయానికి గంట ముందు అభ్యర్థులు లోపలికి అనుమతించినట్లు తెలిపారు. పరీక్ష సమయం తర్వాత అభ్యర్థులు లోపలికి అనుమతించబడరని తెలిపారు .ఉదయం సెషన్ పరీక్షకు అభ్యర్థులు ఉదయం 8:30 నుండి 9:30 వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతించబడతారని మధ్యాహ్నం సెషన్ పరీక్షకు మధ్యాహ్నం ఒంటిగంటకు లోపల అనుమతించ బడతారని. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రానికి అభ్యర్థులను అనుమతించ బడరన్నారు. నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేయునట్లు తెలిపారు. పరీక్ష హాల్ లోపల చేక్- ఇన్ విధానంలో బయోమెట్రిక్ సమాచారం అతని, ఆమె, ఫోటో అభ్యర్థుల ఎడమ చేతి బొటనవేలు ముద్ర ఉంటాయి. పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు తీసుకెళ్లడం నిషేధమని అభ్యర్థులు వారి వ్యక్తిగత వస్తువులను ఉంచడానికి ఎలాంటి లాకర్ సదుపాయం ఏర్పటు చేయలేదన్నారు. బయోమెట్రిక్ లను ఇన్విజిలేటర్ క్యాప్చర్ చేసే వరకు పరీక్ష హాల్ నుండి బయటకు వెళ్లడానికి వీలు లేదని తెలిపారు. అభ్యర్థులు పరీక్షకు వచ్చేముందు కమిషన్ వెబ్సైట్లో అందుబాటులో ఉన్న మక్ టెస్ట్ లింక్ ఉపయోగించి మాక్ టెస్ట్ ను క్షుణ్ణంగా ప్రాక్టీస్ చేయాలని సూచించారు. హాల్ టికెట్ పై ముద్రించిన సూచనలు కూడా టీజీపీఎస్సీ వెబ్సైట్లో అభ్యర్థులు అందుబాటులో ఉన్నాయి అభ్యర్థులు సి బి ఆర్ టి మోడ్ పరీక్షకు హాజరవుతున్నప్పుడు సూచనలను జాగ్రత్తగా పరిశీలించి వాటిని అనుసరించి పరీక్ష రాయాలన్నారు. అభ్యర్థులు కమిషన్ వెబ్సైట్ నుండి పరీక్షకు మూడు రోజుల ముందు నుండి పరీక్ష ప్రారంభమయ్యే వరకు హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవచ్చు అని తెలిపారు .పరీక్షా కేంద్రంలోకి అనుమతించని వస్తువులను అభ్యర్థులు తీసుకురావద్దని సూచించారు. అభ్యర్థి పరీక్ష కనీసం ఒకరోజు ముందు పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్షా కేంద్రం యొక్క ఖచ్చితమైన ప్రదేశాన్ని తెలుసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రం మార్పు ఎట్టి పరిస్థితిలోనూ స్క్రైబ్ పరిహార సమయాన్ని క్లైమ్ చేసే వికలాంగ అభ్యర్థులు తప్పనిసరిగా సదరం సర్టిఫికెట్ అపెండెక్స్ త్రీ ని పరీక్షా కేంద్రం లోనికి తీసుకురావాలని పరీక్ష రోజున పరీక్ష కేంద్రం చీఫ్ సూపర్డెంట్ కు సమర్పించాలని సూచించారు. అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యే ముందు వారి సొంత ఆసక్తితో సూచనలు అర్థం చేసుకోవాలని అభ్యర్థులు తమ అభ్యర్థిత్వం తిరస్కరణ కు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా అభ్యర్థులు పరీక్ష నిర్మాణ సిబ్బందికి సహకరించాలన్నారు. పరీక్షలు నిర్వహణకు కావలసిన అన్ని రకాల ఏర్పాట్లు పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష సమయాలలో అభ్యర్థులకు అనుకూలంగా ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## రష్యా, ఉ. కొరియా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం



సియోల్ : అమెరికాకు వ్యతిరేకంగా తన దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకునే హక్కు ఉత్తర కొరియాకు ఉందని రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ చెప్పారు. విదేశీ దాడులను, దురాక్రమణను తిప్పికొట్టడంలో రష్యా, ఉత్తర కొరియా పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించాయి. ఇందుకు సంబంధించిన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందంపై పుతిన్, కిమ్‌జోంగ్ ఉన్ బుధవారం సంతకాలు చేశారు. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తర్వాత ఇరు దేశాల మధ్య బలమైన బంధంగా ఈ ఒప్పందాన్ని పరిగణిస్తున్నారు. తమ సంబంధాల్లో ఇదొక మైలురాయిగా ఇరువురు నేతలు భావిస్తున్నారు. భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, సాంస్కృతిక, మానవతా సంబంధాలకు సంబంధించిన అంశాలన్నీ ఈ ఒప్పందం పరిధిలోకి వస్తాయి. 24 సంవత్సరాల తరువాత మొదటిసారిగా పుతిన్ ఉత్తర కొరియాలో పర్యటించిన నేపథ్యంలో ఈ ఒప్పందం వెలువడింది. ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధానికి పూర్తిగా మద్దతునిస్తామని కిమ్ ప్రకటించారు. ఇది చాలా బలమైన ఒప్పందంగా ఆయన వ్యాఖ్యానించారు. సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలన్న ఆకాంక్షలను ప్రతిబింబించేలా ఈ ఒప్పందం వుందని పుతిన్ వ్యాఖ్యానించారు.

## ఫాసిజాన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా ఫ్రాన్స్‌లో కొత్త పాపులర్ ఫ్రంట్




పారిస్ : ఫాసిజాన్ని అడ్డుకోవడమే తమ లక్ష్యమని వామపక్షాలు, ప్రజాతంత్ర శక్తులతో కూడిన పాపులర్ ఫ్రంట్ తెలిపింది. ఫ్రెంచ్ కమ్యూనిస్ట్ పార్టీ జాతీయ కార్యదర్శి ఫాబియన్ రౌసెల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, యూరోపియన్ యూనియన్ ఎన్నికల్లో విజయం సాధించిన మితవాద పార్టీలు, జాతీయ పార్లమెంటు ఎన్నికల్లోనూ రిపీట్ చేయాలని చూస్తున్నాయని, వారి ఆటలు సాగనివ్వమని చెప్పారు..గత వారం జరిగిన ఇయు పార్లమెంటరీ ఎన్నికల్లో అతిపెద్ద ఫ్రెంచ్ శక్తిగా రాస్సెంబ్లెమెంట్ నేషనల్ (నేషనల్ ర్యాలీ) పార్టీ అవతరించింది. అనేక నయా-ఫాసిస్ట్ పార్టీల మాదిరిగానే, నేషనల్ ర్యాలీ కూడా పెట్టుబడిదారీ పాలకవర్గప్రతినిధిగానే వ్యవహరిస్తోంది. నయా ఉదారవాద విధానాలను జోరుగా అమలు చేస్తోంది. 2022లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో రెండవ స్థానంలో నిలిచిన లీ పెన్, ఈసారి పార్లమెంటరీ ఎన్నికలో విజయం సాధించవచ్చన్న ప్రచారం జరుగుతోంది. జాతీయ ర్యాలీ దూకుడుకు అడ్డుకట్ట వేయకపోతే దేశం ఫాసిస్టుల చేతుల్లోకి పోయే ప్రమాదముందని ఫ్రెంచ్‌కమ్యూనిస్ట్ పార్టీ పేర్కొంది. ఇది స్వల్పకాలిక ఎన్నికల పొత్తు కాదు, శాశ్వత కూటమిగా రూపొందుతుందని నాలుగు పార్టీల నాయకులు ఉద్ఘాటించారు. ట్రేడ్ యూనియన్‌లు, ప్రజా సంఘాలు, పర్యావరణ సంఘాలు , ఇతర పౌర సంఘాలు ఇప్పుడు న్యూ పాపులర్ ఫ్రంట్‌కి మద్దతుగా ర్యాలీల్లో పాల్గొంటున్నాయి%.

# అపర మేధావి కొత్తపల్లి జయశంకర్

తెలంగాణ సిద్ధాంతకర్తగా పేరుపొందిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ (ఆగష్టు 6, 1934- జూన్ 21, 2011) వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామ శివారు అక్కంపేటలో జన్మించారు. తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో మంచి ప్రావీణ్యం ఉన్న జయశంకర్ తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించారు. ఆర్థిక శాస్త్రంలో పీహెచ్ డీ పట్టా పొంది, ప్రిన్సిపాల్ గా పనిచేసి కాకతీయ విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ వరకు ఉన్నత పదవులు పొందారు. 1969 తెలంగాణ ఉద్యమంలోనూ, అంతకు ముందు నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్-ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటులో కె.చంద్రశేఖరరావుకు సలహాదారుగా, మార్గదర్శిగా వెన్నంటి నిలిచారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై పలు పుస్తకాలు రచించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలని తరుచుగా చెప్పేవారు. జయశంకర్ 2011, జూన్ 21న ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందే మరణించారు. 1934, ఆగస్టు 6న వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేట లో జయశంకర్ జన్మించారు. తల్లి మహాలక్ష్మి, తండ్రి లక్ష్మీకాంత రావు. ఆయనకు ముగ్గురు అన్న దమ్ములు, ముగ్గురు అక్క చెల్లెళ్లు. జయశంకర్ తల్లిదండ్రులకు రెండో సంతానం. సొంత కుటుంబాన్ని నిర్మించు కోకుండా, తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి, ఆజన్మ బ్రహ్మచారిగా మిగిలి పోయారు.

బెనారస్, అలీగఢ్ విశ్వ విద్యాలయాల నుంచి ఆర్థిక శాస్త్రంలో పట్టా అందుకున్న జయశంకర్ ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పీహెచ్ డీ చేశారు. 1975 నుంచి 1979 వరకు వరంగల్ లోని సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేశారు. 1979 నుంచి 1981 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ గా, 1982 నుంచి 1991 వరకు సీఫెల్ రిజిస్ట్రార్ 1991 నుంచి 1994 వరకు ఆదే యూనివర్శిటీకి ఉప కులపతిగా పని చేశారు. 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 1952 లో జయశంకర్ నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్, ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి నాయకునిగా 1954 లో ఫజల్ అలీ కమిషన్ కు నివేదిక ఇచ్చారు. కె.సి.ఆర్ కు సలహాదారుగా, మార్గదర్శిగా తోడ్పాటు అందించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై ఆయన పుస్తకాలు రాశారు. తెలంగాణ లోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి ప్రసంగాలు చేశారు. జయశంకర్ తన ఆ ఆస్తిని, జీవితాన్ని తెలంగాణ కోసం అంకితం చేశారు. "అబ్ తొ ఏక్ హీ ఖ్వాయిష్ హై, వొ తెలంగాణ దేఖ్నా బెర్ మర్దనా" (ఇప్పుడైతే నాకు ఒకే కోరిక మిగిలింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలి. తర్వాత మరణించాలి అని అనేవారు. తెలంగాణ ఉద్యమాన్ని గల్లీ నుంచి ఢిల్లీదాకా, ఢిల్లీ నుంచి అమెరికా దాకా విదేశాల్లో సైతం వ్యాప్తి చేయడంలో ఆయన పాత్ర మరవ లేనిది. ఆచార్య జయశంకర్ విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతోన్న అన్యాయాల పట్ల, అసమానతల పట్ల తీవ్రంగా పోరాటం చేశారు.

1952 నాన్ ముల్కీ, ఉద్యమం లోకి ఉరికి ఆనాటి నుంచి సమరశీల పాత్రను పోషించాడు. ఎవరూ మాట్లాడటానికి సాహసించని కాలంలోనే 1954 విశాలాంధ్ర ప్రతిపాదనను ఎండగట్టిన ధీశాలి జయశంకర్. విశాలాంధ్ర ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ మొదటి ఎస్సార్సీ కమిషన్ ముందు హాజరై తెలంగాణ వాణిని బలంగా వినిపించిన అపర మేధావి కొత్తపల్లి జయశంకర్. అధ్యాపకునిగా, పరిశోధకుడిగా ఆయన ఏం చేసినా తెలంగాణ కోణంలోనే నిత్యం ఆలోచించి, ఆచరించిన మహనీయులు. తెలంగాణ డిమాండ్ ను 1969 నుంచి నిశితంగా అధ్యయనం చేస్తూ, విశ్లేషిస్తూ ప్రతీరోజూ రచనలు చేసిన మేధావి ఆయన. తెలంగాణ లోని ప్రతీపల్లె ఆయన మాటతో పోరాట గళాన్ని అందుకున్నది. ఆయన తిరగని ప్రాంతం లేదు. తెలంగాణ విషయంలో ఆయన చెప్పని సత్యం లేదు. జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద , విశ్వవిద్యాలయాల పరిశోధనా సంస్థల సభలో, సమావేశాల్లో తెలంగాణ రణన్నినాదాన్ని వినింపించిన పోరాట యోధులు. "మా వనరులు మాకున్నాయి. మా వనరులపై మాకు అధికారం కావాలి. యాచక దశ నుంచి శాసక దశకు తెలంగాణ రావాలి! మా తెలంగాణ మాగ్గావాలి..!! యాభై ఏళ్లుగా ఇదే ఆకాంక్ష.. ఇదే శ్వాస.. ఇదే లక్ష్యం... ఇదే జీవితం.. ఇందులోనే మరణం!" అని ఉద్యమాన్ని శ్వాసించిన మహోరీపాధ్యాయుడు ప్రొఫెసర్ కొత్త పల్లి జయశంకర్, రెండేళ్లు గొంతు క్యాన్సర్ తో బాధపడ్డారు. మీరు చేయాల్సింది మీరు చేశారు. ఈ సమయంలో నేను ఇక్కడ ఇక ఉండలేను. నేను వరంగల్ కు పోతాను. నన్ను పంపండి' అంటూ ఆయన పుట్టిన గడ్డమీద మమకారంతో వరంగల్ వచ్చారు. ఇంట్లోనే వైద్యులు ఆయనకు అన్నిరకాల వైద్యసేవలు అందించారు. 2011 జూన్ 21న తెల్లవారు జాము నుంచి ఆయన పల్స్ రేట్ పడిపోవడంతో ఆక్సిజన్ అందించారు.

చివరకు అదేరోజు ఉదయం 11.30 నిమిషాలకు తుదిశ్వాస విడిచారు. అధ్యాపకుడిగా ఆయన ఎంతో మందికి మార్గనిర్దేశం చేశారు. వృత్తిపట్ల నిబద్ధతను, తెలంగాణ ఉద్యమం పట్ల చిత్తశుద్ధిని వారిలో నూరిపోశారు. ఎమర్జెన్సీ కాలంలో ఆయన సీకేఎం కళాశాలకు ప్రిన్సిపల్ గా పనిచేశారు. సీకేఎం కళాశాల అంటేనే, జిల్లాలో "విప్లవ విద్యార్థి ఉద్యమానికి" కేంద్రంగా అప్పట్లో పేరుండేంది. విప్లవకవి వరవరరావు లాంటి వాళ్లు ఆ కాలేజీలో అధ్యాపకులుగా వ్యవహరించారు. ఎమర్జెన్సీ గడ్డురోజుల్లో ఆయన కళాశాలను నడిపి, ఎంతో మంది విద్యార్థుల్ని, అధ్యాపకుల్ని ఆయన నిర్బంధం నుంచి కాపాడారు. ఆయన అధ్యాపకుడిగా హన్మకొండలోని మల్టీపర్పస్ స్కూల్లో మొదట తెలుగు బోధించారు. ఒక అధ్యాపకున్ని విద్యార్థులు గుర్తు పెట్టుకోవడం సర్వసాధారణమే కానీ, ఒక అధ్యాపకుడే తన విద్యార్థుల్ని గుర్తుపెట్టుకొని, పేరు పెట్టి పిలవడం, ఒక్క జయశంకర్ సార్ కు సాధ్యం అంటూ ఆయనకు తనకు 35 ఏళ్ల అనుబంధం ఉందని, ప్రముఖ సాహితివేత్త రామశాస్త్రి చెప్పేవారు. జయశంకర్ విద్యార్థుల్లో అనేక మంది దేశ విదేశాల్లో ప్రస్తుతం ప్రముఖ స్థానంలో ఉన్నారు. వీరిలో కేయూ మాజీ ప్రొఫెసర్ ఎన్. లింగమూర్తి, ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ, ప్రొఫెసర్ కే. సీతా రామావు తదితరులు అనేక మందికి ఆదర్శ గురువు జయశంకర్.

# 'హజ్' మరణాల్లో ఎంతమంది భారతీయులున్నారంటే?

సౌదీలోని హజ్ యాత్రలో వేడి గాలుల కారణంగా ఈ ఏడాది ఇప్పటి వరకు 645 మంది హజ్ యాత్రికులు మరణించిన విషయం తెలిసిందే. అయితే ఇందులో సుమారు 90 మంది భారతీయులు ఉన్నట్టు సన్నిహిత వర్గాలు తెలిపాయి.అత్యధిక మరణాలు వడదెబ్బ వల్లే సంభవించినట్టు సమాచారం. మరోవైపు ఈ ఏడాది హజ్ యాత్రలో 68 మంది ఇండియన్స్ మరణించారని అరబ్ దౌత్యవేత్త ధృవీకరించినట్టు పలు కథనాలు వెలువడ్డాయి. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 1.8 మిలియన్ల మంది ప్రజలు ఈ యాత్రను సందర్శించారు. ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల సెల్సియస్ దాటడంతో యాత్రికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలోనే అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. కాగా, తీర్థయాత్ర ప్రాంతంలో ఉష్ణోగ్రతలు దశాబ్దానికి 0.4 డిగ్రీల సెల్సియస్ చొప్పున పెరుగుతున్నాయి. 2023లో హజ్ యాత్ర సమయంలో 200 మందికి పైగా యాత్రికులు మరణించారు. అప్పుడు ఉష్ణోగ్రతలు 48 డిగ్రీల సెల్సియస్ ఉండటంతో 2,000 మంది తీవ్ర ఒత్తిడికి గురయ్యారు.



ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

రంగారెడ్డి
వికారాబాద్-మేడ్చల్
www.prajaswaramdaily.com
శుక్రవారం 21 | జూన్ 2024 | పేజీలు : 4

# ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటుకు అందరూ కృషి చేయాలి

- వికారాబాద్‌లో జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం
- రాష్ట్ర సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, జూన్ 20 (ప్రజా స్వరం) :

ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటుకు ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణ ఆల్బెండజోల్ మాత్ర వేయించాలని తెలంగాణా రాష్ట్ర సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారము సంఘం లక్ష్మి బాయి బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవాన్ని పురస్క రించుకొని ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం లో ముఖ్య అతిదిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ర ప్రభుత్వం విద్యా, ఆరోగ్యం పై ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందని , ప్రవేట్ స్కూల్స్ కు దీటుగా ప్రభుత్వపాఠశాలలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.విద్యార్థులు చదువులో నైపుణ్యత, క్రీడలలో ప్రతిభను చాటాలన్నారు,బాలికలు ఆరోగ్యం విషయంలో జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. బాలికల రక్షణ కోసం కంపౌండ్ వాల్ నిర్మాణం, స్కూల్ నందు మౌలిక సదుపాయాలు కలిపించి , హాస్పిటల్స్ ఏర్పాటు చేసి వికారాబాద్ జిల్లా ను అభివృది పథంలో ఉండేలా చేస్తామన్నారు. విద్యార్థులు అందరు విద్యలో ముందుండాలని , ఫుడ్ విషయం లో ఏవైనా సమస్యలు ఏర్పడితే అధికారుల దృష్టికి తెవాలన్నారు. నులి పురుగుల వల్ల ఎదురయ్యే ఆరోగ్యపరమైన సమస్యల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించుకోవాలని అన్నారు. సంవత్సరం లో రెండుమార్లు ఈ మాత్రలు వేస్తారని, జిల్లాలో 1-19 వయస్సు గల చిన్నారులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ ,బిసి, మైనారిటీ హాస్టల్ లలో, గురుకులాలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు.



ఈ రోజు మిస్సయిన వారికి తిరిగి 27వ తేదీన కచ్చితంగా మాత్రలు వేయించాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధ, క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు అందరు బాగా చదువుకొని రాజకీయంగా, అధికారిగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్పీచ్ ఇవ్వగా ఉపాధ్యాయులను , పిల్లలను అభినందించారు. వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్ మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు తప్పని సరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని, చదువుతో పాటు చేతులు సుబ్రపరుచుకోవడం ,పరిసరాల పరిసుబ్రత పాటించాలని, బాలికలు అందరు మాత్రలు వేసుకొని ఆరోగ్యంగా ఉండాలని, లక్ష్యం తో బాగా చదివి ముందుకెళ్ళాలని అన్నారు. అధికారులు ఈ సందర్భంగా జాతీయ నులి పురుగుల నివారణ ఆల్బెండజోల్ మాత్రలను సభాపతి తో కలిసి విద్యార్థులకు వేశారు. ఈ సమావేశంలో జిల్లా ఆరోగ్యా వైద్యాదికారి పల్వన్ కుమార్, ప్రిన్సిపాల్ రమణమ్మ, ఉపాద్యాయులు, విద్యార్థిని విద్యార్తులు ప్రజా ప్రతి నిధులు ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి







**సిఐటియు రాష్ట్ర కార్యదర్శి భూపాల్**

తాండూరు, జూన్ 20 (ప్రజా స్వరం) :

వికారాబాద్ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురు వారం తాండూరు మండలంలో సీసీఐ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిసిఐ కాంటాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శరణప్ప ఆధ్వర్యంలో సిఐటియు సంఘంలో జాయిన్ కావడం జరిగింది. కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అందరు ఏఐటీయూసీ నుండి సిఐటియు అనుబంధంగా సీసీఐ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ గా మార్చడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి భూపాల్ మాట్లాడుతూ సీసీఐ కంపెనీలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న సీనియర్ కార్మికులను కనీస వేతనం పెంచాలని, పర్మినెంట్ చేయాలని, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, కనీస సౌకర్యాలు కాంట్రాక్టు కార్మికులకు క్యాంటీన్ సౌకర్యము, యూనిఫామ్స్ కల్పించాలని ప్రమాద భీమా సౌకర్యం, ఎస్ఐ పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయు ఆధ్వర్యంలో నుండి ప్రభుత్వం నుండి రావలసిన అన్ని సౌకర్యాలు కార్మికులకు కల్పించే విధంగా పోరాడుతామంటూ అని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు వికారాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మైపాల్ రామకృష్ణ, ఉపాధ్యక్షులు కే శ్రీనివాస్, చంద్రయ్య,సీసీఐ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ మహాదేవ్ రాథోడ్, శివప్ప,ప్రదీప్ కుమార్, బాలకృష్ణ, రాహుల్ గోపాల్, లలితమ్మ నాగేందర్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# నులి పురుగుల నివారణపై అవగాహన



మేడ్చల్, జూన్ 20 (ప్రజా స్వరం) :

మున్సిపాలిటీ పరిధిలోని విద్యార్థులకు నులి పురుగుల నివారణ పై ఎ ఎన్ ఎం జయలత ఆధ్వర్యంలో ఆశా వర్కర్లతో కలిసి ఉమానగర్ అంగన్ వాడి సెంటర్,న్యూ లిటిలిల్లి ,శ్రీ చైతన్య, నాగార్జున,సైబరేజ్ రెడ్ సాన్ కళాశాల,ఆపిల్ కిడ్స్ పాఠశాలల్లో అవగాహన కల్పించారు.భోజనం సమయంలో చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు.నులిపురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.అనంతరం విద్యార్థులకు డి వార్నింగ్ మాత్రలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆశ,మమత,రెబ్బమ్మ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలందరికీ ఆల్బెండజోల్ టాబ్లెట్ వేసేట్లు చూడాలి

**ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి**

తాండూరు, జూన్ 20 (ప్రజా స్వరం) :

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మందుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. తాండూరు మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలో నులి పురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని గురువారం నాడు స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆల్బెండజోల్ మెడిసిన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు టాబ్లెట్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా నులి పురుగుల నిర్మూలనకై మెడిసిన్ పంపిణీ చేయడం జరుగుతుందని,పిల్లల ఎదుగుదల కు ఈ మెడిసిన్ ఉపయెగపడుతుందని అన్నారు. నులిపురుగులు పిల్లల కడుపు లో ఉంటే పిల్లలు బలహీనంగా తయారవుతారు కావున పిల్లలందరికీ ఆల్బెండజోల్ టాబ్లెట్ వేసేట్లు చూడాలని వైద్యులకు సూచించారు.

# వికారాబాద్ జిల్లాలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం





- **చదువు వల్లనే సమాజంలో సమూల మార్పులు సాధ్యం**
- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వికారాబాద్, జూన్ 20 (ప్రజా స్వరం) :**

చదువు వల్లనే సమాజంలో సమూల మార్పులు సాధ్యమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కొడంగల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఇందులో భాగంగా బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్య పుస్తకాలను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువును అందించే బడిని గుడి లాగా భావించి విద్యార్థులు శ్రద్ధ, క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని కలెక్టర్ తెలిపారు. విద్య వల్లనే దేశ భవిష్యత్తును మార్చగలమన్న అబ్దుల్ కలాం వ్యాఖ్యను కలెక్టర్ గుర్తు చేశారు. మహనీయుల ఆదర్శాలను పరిగణలోకి తీసుకొని తమ భవిష్యత్తును మార్చుకునే దిశగా విద్యార్థులు సంసిద్ధం కావాలని కలెక్టర్ అన్నారు. ఆరోగ్యవంతమైన పిల్లల కోసం ఆల్బెండజోల్ మాత్రలను 19 సంవత్సరాల లోపు ఉన్న వారందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయాలని కలెక్టర్ తెలిపారు. నులి పురుగుల వల్ల పిల్లలలో ఎదుగుదల లోపించడం, మందబుద్ధి, రక్తహీనత, చదువుపై ఏకాగ్రత కోల్పోవడం వంటి రుగ్మతలకు వారు లోనవుతారని వీటిని నివారించేందుకు ప్రభుత్వం ప్రతియేటా రెండు పర్యాయాలు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయిస్తోందని, ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని వసతి గృహాలు, విద్యా సంస్థలు, అంగన్వాడీ కేంద్రాల్లో బాలబాలికల సంఖ్యకు అనుగుణంగా ప్రతి ఒక్కరికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించేలా అవగాహన కలిగించాలని, ఎస్సీఎస్టీ ,బిసి, మైనారిటీ వసతి గృహాల్లో, గురుకులాలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మంజూరైన పనులను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పర్యవేక్షించి పరిశీలించారు. పాఠశాలల్లో చేపడుతున్న పనులను నాణ్యతతో కూడుకొని ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా అదేవిధంగా పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టర్ పర్యటనలో భాగంగా కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ పల్వన్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, తాసిల్దార్ విజయకుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, ఎంపీపీ ముద్దప్ప, మున్సిపల్ చైర్మెన్ జగ్గప్ప, వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, ప్రధానోపాధ్యాయులు రామ్ రెడ్డి లతో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పూల వర్షంతో ఎస్పీకి ఘనంగా వీడ్కోలు



**వికారాబాద్, జూన్ 20 (ప్రజా స్వరం) :**

బదిలీ అయిన జిల్లా ఎస్పీ నంద్యాల కోటి రెడ్డికి వికారాబాద్ జిల్లా పోలీస్ అధికారులు గురు వారం పూలవర్షంతో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా ఎస్పీ గా విధులు నిర్వహించి ఇటీవల మేడ్చల్ డీసీపిగా గా బదిలీ అయిన జిల్లా ఎస్పీ నంద్యాల కోటి రెడ్డి గురు వారం జిల్లా నుండి రిలీవ్ అయ్యారు..జిల్లా పోలీస్ కార్యాలయం లో జిల్లా ఎస్పీ గారి వీడ్కోలు కార్యక్రమం పోలీస్ కావాతుతో, పూల వర్షం తో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో ముందుగా జిల్లా ఎస్పీ కి పోలీస్ కవాతు ద్వారా గౌరవ వందనం ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో ఎస్పీ గారు మాట్లాడుతూ జిల్లా లో రిపోర్ట్ చేసినప్పటినుండి ఇప్పటి వరకు ఎలాంటి శాంతిభద్రత సమస్యలు రాకుండా పనిచేయడం జరిగింది. జిల్లాలోని హెూం గార్డ్ అధికారి నుండి పై స్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరు కలసి, సమయస్ఫూర్తి పని చేయడం వలన జిల్లాలో ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు లేకుండా పని చేయడం జరిగింది. జిల్లా పోలీస్ అధికారులు అందరం ఒక టీం లాగా పని చేయడం. జిల్లా పోలీస్ అధికారులు ఎస్పీ పైన పెట్టుకున్న నమ్మకాన్ని, చూపిన అభిమానాన్ని ముద్దున్ని అయినాను అని ఎస్పీ తెలిపారు. ఇక ముందు పోలీస్ అధికారులు అందరు కలసి మెలసి పని చేయాలనీ, ఎక్కడికి వెళ్లిన వికారాబాద్ జిల్లాలో పని చేయడం చాలా గౌరవంగా ఉంది అని జిల్లా ఎస్పీ తెలిపారు. ఇన్ని రోజులు జిల్లా పోలీస్ డిపార్ట్మెంట్ కు సహకరించిన జిల్లా ప్రజలు,జిల్లా ప్రజా ప్రతినిధులు , పోలీస్ ఉన్నత అధికారులు, జిల్లా పోలీస్ డిపార్ట్మెంట్, జిల్లా లోని ఇతర శాఖల అధికారులు మరియు జిల్లా మీడియా మిత్రులకు తన తరుపున కృతజ్ఞతలు అని ఎస్పీ తెలిపారు. అనంతరం జిల్లా లోని పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ ఎస్పీ గారి పైన జిల్లా పోలీస్ కార్యాలయం నుండి ఎన్నెపల్లి ఎక్స్ రోడ్డు వరకు పూలవర్షం కురిపించి ఘనంగా వీడ్కోలు పలకడం జరిగింది. మరియు జిల్లా ఎస్పీ సేవలకు అభినందిస్తూ పలుగురు ప్రజలు ఎన్నెపల్లి %శ% రోడ్డు లో జిల్లా ఎస్పీ గారిని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ . రవీందర్ రెడ్డి , డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్ , వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, పరిగి డీఎస్పీ కరుణసాగర్ రెడ్డి , తాండూర్ డీఎస్పీ బాల కృష్ణ రెడ్డి , జిల్లా వర్టికల్ డీఎస్పీ జానయ్య, ఏ ఆర్ వీరేష్ డీఎస్పీ జిల్లా లోని ఇన్స్పెక్టర్ లు, సర్కిల్ ఇన్స్పెక్టర్ లు, జిల్లాలోని ఎస్ ఐ లు, సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.



## కత్తితో దాడి చేసి బంగారం అభరణాల దుకాణంలో చోరీ యత్నం







**మారు వేషంలో వచ్చి దోపిడీకి యత్నించిన ఇద్దరు వ్యక్తులు**

**మేడ్చల్, జూన్ 20 (ప్రజా స్వరం) :**

మేడ్చల్ లో ఇద్దరు దొంగలు పట్టపగలే జ్యూవెలరీ షాపు లోకి చొరబడి షాపు యజమాని శేషరాంను పై కత్తి తో దాడి చేసి చోరీ కీ యత్నించిన సంఘటన చోటు చేసుకుంది. పట్టణం లోని పోలీస్ స్టేషన్ సమీపంలోని ఓ బంగారు ఆభరణాల షాపు లోకి గురువారం మధ్యాహ్నం ఒకరు బురకా వేసుకొని మరొకరు తలకు హెల్మెట్ పెట్టుకొని వచ్చి షాపు యజమాని ఛాతీపై కత్తితో పొడిచి బెదిరించి బంగారం దోచుకునేందుకు ప్రయత్నం చేశారు. కత్తి పోటుకు గురైన షాపు యజమాని తనను ఏమనొద్దని ఏమి కావాలో తీసుకెళ్లండని చెప్తుండగా పక్కనే వున్నా మరో యువకుడు షాపు లోపలి రూములోకి పరుగులు తీశాడు. దొంగ తనానికి వచ్చిన ఇద్దరిని షాపు యజమాని పక్కకు తోసేసి షాపు బయటకు పరుగులు తీసి చోర్ ... చోర్ .. అంటూ అరుపులు పెట్టడంతో షాపు లో వున్న ఇద్దరు దొంగలు బయటకు వస్తుండగా షాపు యజమాని వారిని పట్టుకునే ప్రయత్నం చేశాడు. కత్తితో మరో సారి దాడి చేసేందుకు ప్రయత్నించడంతో అతడు పక్కకు తప్పుకోగా వారు వచ్చిన బైక్ పైనే హైదరాబాద్ వైపు పరారవుతుండగా షాపు లోని లోపలి రూములోకి వెళ్లిన యువకుడు వచ్చి కుర్చీతో కొట్టినా వారు అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న పోలీస్ అధికారులు అడిషనల్ డీసీపీ నర్సిహ్మా రెడ్డి, ఏసీపీ శ్రీని వాస్ రెడ్డి, సీఐ సత్యనారాయణ అక్కడకు చేరుకొని ఘటనా స్థలిని పరిశీలించారు. క్లూస్ టీమ్ తో ఆధారాలు సేకరించారు. సీసీ కెమెరాల ఆధారంగా దొంగలను గుర్తించేందుకు పోలీస్ లు ప్రయత్నిస్తున్నారు. బైక్ ఆపి ఇద్దరు వ్యక్తులు షాపు లోకి వచ్చి కత్తి పోటు పొడిచి అక్కడినుంచి అదే బైక్ పై పరారైన అన్ని దృశ్యాలు కుడా షాపులో వున్నా సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి.

**ప్రజల్లో చైతన్యం అవసరం ...**

తోటి వారికి ఆపద వస్తే తోడు వుండాలనే అవగాహన అవసరమైన చైతన్యం ప్రజల్లో మరింత పెరగాల్సిన అవసరం ఎంతైనా వుంది.కత్తి చేత పట్టుకొని ఒకరిపై దాడి చేసేందుకు వస్తున్న వాణ్ని అడ్డుకునేందుకు అక్కడున్నవారు ఎవ్వరు కుడా ప్రయత్నం చేయక పోవడం విచారం కలిగిస్తోంది ఇద్దరు దొంగలు మిట్ట మధ్యాహ్నం బంగారం షాపులోకి చొరబడి దర్జాగా చోరీ చేసుకొని అడ్డొచ్చిన వ్యక్తిపై కత్తి పోటు పొడిచి పారిపోతున్న కుడా అక్కడున్నవారు ఎందుకు ప్రయతించ లేదో అర్థం కావడం లేదు. కనీసం పక్కనే వున్నా పోలీస్ లకు సమాచారం కుడా ఇవ్వకపోవడం బాధాకరం. కత్తిపోటుకు గురై రక్తం కారుతున్నా కుడా దోపిడీకి వచ్చిన దొంగలను ఎదురించి వారిని పట్టుకునేందుకు షాపు యజమాని చేసిన ప్రయత్నం, చూపిన ధైర్యం కుడా అటుగా వెళ్తున్న వారు చేయక పోవడం విడ్డూరమనే చెప్పాలి.

# ప్రకృతి సమస్తం సంగీత సమ్మేళనం

సుప్రసిద్ధమైన చతుషష్టి కళలలో ఒకటి సంగీతం. శబ్దాన్ని కాలంతో మేళవించి వినసొంపుగా మార్చే విలక్షణమైన ప్రక్రియ. సంగీతం విశ్వమంతా వ్యాపించి ఉంది. ప్రకృతిలో సంగీతం మిళితమై జీవన గమనంలో భాగమై పోయింది. సంగీతం మదిమదినీ పులకరింప జేస్తుంది. నరనరాల్లో రక్తాన్ని ఉరకలెత్తిస్తుంది. రాళ్లు రప్పలు, పశు పక్ష్యాదులు సైతం సంగీతానికి ఆనందపరవశం కావాల్సిందే. అంతటి శక్తి సంగీతానికుంది. విశ్వజనీనంగా మనసును రంజింపజేయగల మహత్తరమైన శక్తి సంగీతానిది. సంగీతం ప్రాముఖ్యతను చాటి చెప్పటానికి 1982లో ప్రారంభించ బడిందే 'ప్రపంచ సంగీత దినోత్సవం'. ప్రతి సంవత్సరం జూన్ 21న దీనిని జరుపుకోవటం ఆనవాయితీ.

శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తిగాన రసఃఫణిః' అంటూ సంగీతం గొప్పదనాన్ని పెద్దలు చెబుతారు. ఆది ప్రణవ నాదమైన "ఓం"కారం నుండి ఉద్భవించినది సంగీతం. సంగీతం ఎప్పుడు, ఎలా ఏర్పడిందో చెప్పటం కష్టం. అయితే, ఇంద్రుడు, బ్రహ్మను ఒక కళను సృష్టించమని అడగగా, బ్రహ్మ సామవేదం నుంచి పరమ శివుని సన్నిధానంలో సంగీతాన్ని సృష్టించాడని అంటారు. బ్రహ్మ ఈ సంగీతాన్ని భరతునికి నేర్పగా ఆయన భూలోకంలో సంగీతాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చాడని చెపుతారు.

పూర్వ మానవులు తమ చుట్టూ ఉన్న ప్రకృతి నుంచి అనేక స్వరాలను కను గొన్నారు. నెమలి కూతలోను, ఏనుగు ఘీంకారం లోనూ, కోకిల కూతలోను, గుర్రం సంకిలింపు లోనూ, ఎద్దులు వేసే రంకెల్లోనూ ఇలా అనేక జంతువుల ధ్వనుల నుంచి స్వరాలను ఏర్పరిచారు. ఈ ఆధునిక కాలంలో మనకు తెలిసిన స్వరాలు ఏడు. ఈ సప్తస్వరాలను నేడు పిలిచినట్టు షడ్జమం (నెమలి), రిషభం (వృషభ ధ్వని), గాంధారం (మేక), మధ్యమం (క్రౌంచము), పంచమం (కోకిల), దైవతం (గుర్రం) మరియు నిషాదం (గజము) అని పిలిచే వారు కాదు. పూర్వం వీటిని కృష్ణ, ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్ధ, మన్ద్ర, అతిస్వర్య అని పిలిచేవారు. ఇప్పటి స్వరాలతో పోలిస్తే, ఈ స్వరాలు 'మగరసనిదప' అనే స్వరాలన్నమాట. ఇవే క్రమేణా రూపాంతరాలు చెందుతూ, నేటి స్వరాల క్రమం 'సరిగమపదని' గా రూపు దాల్చాయి. సంగీతం మానసికోల్లాసానికే గాక, పరమాత్మను చేరుకునేందుకు ఉపయోగపడే సాధనం. "మనఃస్థితిని నియంత్రిం చడానికి సంగీతం ఒక గొప్ప మార్గం". సంగీత ఆస్వాదన జీవితాన్ని ఉత్తమంగా చేస్తుంది . సంగీత సాధన ద్వారా మేధస్సు, ఏకాగ్రత, సహనం పెరుగుతుంది.

చుట్టూ ఉన్న జీవ జంతు జాలాలు పాడే పాటలకు ప్రేరణ పొంది, వాటిని అనుకరిస్తూ పాటలు పాడడం మొదలు పెట్టాడని చెబుతారు. ఇప్పుడు మనుషులు పాడే పలు రాగాలకు జంతువుల కలగానాలే ప్రేరణాలని అంతా అంగీకరించే అంశం. హంసధ్వని, చక్రవాక, కోకిలధ్వని, గరుడధ్వని, హంసనంది, రిషభప్రియ, గోప్రియ, భైరవ తదితర రాగాలే ఇందుకు సాక్ష్యం.

మానవుని శ్రమైక జీవనంలో, పని నుండే పాట పుట్టిందని చెబుతారు. రాయితో రాయిని కొట్టినప్పుడు 'ఠక... ఠక', రాయి నీటిలో పడ్డప్పటి 'బుడుంగ్', ప్రకృతిలోని సెలయేటి గలగలలు, చెట్ల ఆకుల గరగరలు, నీలాకాశంలో రివ్వున ఎగిరిపోయే పక్షుల కిలకిలా రావాలు, పాపాయి నోటి 'ఉంగ్వా ఉంగ్వా' ల తొలి రాగాల్లో సంగీతాన్ని గమనించారు ప్రాచీనులైన రాతి యుగపు మన పూర్వజులు. సంగీతానికి రాళ్లను కరిగించే శక్తి వుంది, మేఘాలు వర్షిస్తాయి. ఆవులు పాలిస్తాయి. చెట్లు పుష్పిస్తాయి. సంగీతానికి ఉన్న శక్తి గురించి సామవేదం చెబుతుంది. ధ్వనితరంగాలు నాడీ వ్యవస్థమీద ఎలా పనిచేస్తుందో స్వరశాస్త్రం వివరిస్తుంది. స్వరాలూ, శ్లోకాలూ, రాగాలూ, మంత్రాలూ మనస్సుమీదే కాక, శరీరంమీద పనిచేస్తాయి అని సంగీత శాస్త్రం చెబుతుంది. అందుకే సామాన్యుడి మొదలు మహారాజుల వరకు అందరికీ బంధువు సంగీతం. "గీతం వాద్యం తథా నృత్యం త్రయం సంగీతముచ్చతే", గీతము, వాద్యము, నృత్యము అను నీ మూడింటి చేరిక సంగీతమని పిలవ పడుతుందని, మరియు రాగము, స్వరము, తాళము అను నీ మూడింటి చేరికయు సంగీతమని సంగీత రత్నాకరంలో చెప్పపడింది. సంగీత ప్రభావంలో హిందూస్తానీ వాగ్గేయకారులు తాన్‌సేన్ మేఘమాల లహరి రాగంలో వర్షాలు కూడా రప్పించాడని, రాళ్ళను కరిగించాడని చెబుతారు.

సంగీత సరస్వతిని ఆరాధించి జీవన్ముక్తి సాధించవచ్చునని, మన వాగ్గేయకారులు, నాదజ్ఞానులు చెబుతారు. త్యాగయ్య, రామదాసు, చైతన్యుడు, అన్నమయ్య మొదలైన సంకీర్తనాచార్యులు సంగీతం ద్వారా భగవంతునిలో తాదాత్మ్యం చెంది ముక్తి సాధించవచ్చునని ప్రబోధించారు. రాతియుగం నుంచి కంప్యూటర్ యుగందాకా సంగీతం స్వేచ్ఛగా రాజ్యమేలుతోంది. మన దేశంలో దాదాపు ఉత్తరాదిలో వ్యాపించి ఉన్నది 'హిందూస్తానీ సంగీతం' దక్షిణాదిలో ఉన్న సంగీతం. అందాలన్నీ 'కర్ణాటక సంగీతం బాపతే.నానా విధ పుష్ప ఫల జాతుల అందమైన చిక్కటడవి అనుకుంటే లలిత సంగీతం పరిమళాల పూల మొక్కలున్న చిరు ఉద్యానవనం. శాస్త్రీయ సంగీతం ఎగిసిపడే అలల మహాసముద్రము అయితే, లలిత సంగీతం మనసును పలకరించే, ఆహ్లాద పరిచే తామర కొలను. శాస్త్రీయ సంగీతంలో 'రాగం' విస్తృతంగా, సంపూర్ణంగా దర్శనమిస్తుంది. లలిత సంగీతంలో రాగంలోని ఒక భాగం సొగసైన భంగిమతో శ్రావ్యమైన నాద లహరులను సృష్టిస్తుంది. అన్నింటిలోనూ ఉంది 'శృతి' – 'లయ'!! ఆత్మ పల్లవించే పడవలా, వెచ్చని పాటలతో, వెండి అలలపై నిద్రిస్తున్న రాజహంసలా అలనాటి సినిమా సంగీతం నుండి కాలానికి అనుగుణ మార్పులతో, నేటి యువతకు అనుకూల మవుతున్న గల్లీ గల్లీలో దద్దరిల్లుతున్న సంగీతం రాజ్యమేలుతున్నది.సంగీతమంటే కేవలం ఏదో ఒక పాటో, వాయిద్యమో కాదు. ఈ ప్రకృతి మొత్తం సంగీత సమ్మేళనంగానే కనిపిస్తుంది. చల్లగా వీచే గాలిలో సంగీతం వినిపిస్తుంది. కోయిల పాటలో సంగీతం ప్రతిధ్వనిస్తుంది. పశు ర్వేత్తి శిశుర్వేత్తి వేత్తి గాన రసం ఫణిః అన్నారు పెద్దలు. కానీ పశువులకన్నా, శిశువుల కన్నా పక్షులకు గానం గురించి బాగా తెలుసు అని ప్రకృతి నిరూపిస్తోంది. పాట అనగానే మనకు ముందుగా గుర్తుకు వచ్చేది కోయిలమ్మ. ఆ తరువాత ఏనాడూ వినకపోయినా మైనా పాట..ఆ తరువాత బాగా పాడుతుందని తెలిసిన నైటింగేల్ పాట..ఇంకొంచెం తక్కువగా రాబిన్‌పిట్ట. చిలకలు పాటలకు కాక పలుకులకు, కులుకులకు ప్రసిద్ధి మనను పొద్దున్నే నిద్దురలేపే కోడి కూడా సుప్రభాత గీతాలు పాడుతున్నా దాని కూత వైతాళిక గీతమైందే తప్ప అది గాయనిగా గుర్తింపుకు నోచుకోలేదు. మన చుట్టూ ఎన్నో మధుర స్వరాల పక్షులు ఉన్నా వాటివి కలకూజితాలు గానే గుర్తింపు పొందాయి. పక్షి ప్రేమికులు పర్యావరణాన్ని శోధించి 980 రకాల పక్షులు పాటలు పాడతాయని వాటి పాటలు ఎంతో కమనీయంగా ఉంటాయని గుర్తించారు. ఇవి ఇంత వరకు మన దాకా వచ్చిన పాటలు. ఈ విశాల ప్రపంచంలో ఇంకా ఇలాంటివి ఎన్ని ఉన్నాయో. ఎన్ని నైటింగేల్స్, మరెన్ని మైనాలు అడవిగాచిన వెన్నెలలా అడవులకే అంకితమై ఉన్నాయో! ఎడారిలో పాటలు పాడుతూ రసజ్ఞతకు నోచుకోక బ్రహ్మ మందభాగ్యానికి ప్రతీకలుగా మిగిలి పోతున్నాయో!!

# చారిత్రాత్మక నలంద యూనివర్సిటీకి పూర్వ వైభవం..



బీహార్‌లోని రాజ్‌గిర్‌లో చారిత్రక నలంద విశ్వవిద్యాలయం నూతన క్యాంపస్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఉదయం నలంద యూనివర్శిటీకి చేరుకున్న మోదీ ముందుగా యూనివర్సిటీలోని అలనాటి వారసత్వాన్ని పరిశీలించారు. ఆ తర్వాత కొత్త క్యాంపస్‌కు చేరుకున్న ప్రధాని అక్కడ బోధి వృక్షాన్ని నాటి నూతన ప్రాంగణాన్ని ప్రారంభించారు. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, బీహార్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, సీఎం నితీష్ కుమార్, నలంద యూనివర్సిటీ ఛాన్సలర్ అరవింద్ పనగారియా ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, భూటాన్, బ్రూనై, దారుస్సలాం, కంబోడియా, చైనా, ఇండోనేషియా, లావోస్, మారిషస్, మయన్మార్, న్యూజిలాండ్, పోర్చుగల్, సింగపూర్, దక్షిణ కొరియా, శ్రీలంక, వియత్నాం సహా మొత్తం 17 దేశాల నుండి విదేశీ రాయబారులు కూడా ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. వర్శిటీ నిర్మాణానికి 17 దేశాల సహకారం ఉన్నట్లు తెలుస్తోంది. నలందా ప్రాంతాన్ని 2016లో ఐక్యరాజ్యసమితి వారసత్వ సంపదగా గుర్తించింది. వైభవోజ్వల ప్రాచీన భారత చరిత్ర పుటలు తిరగేస్తే, వినిపించే పేర్లు నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాలు. విదేశీయుల దాడుల్లో నలంద విశ్వవిద్యాలయం దెబ్బతిన్నది. అయినా దాని ఆనవాళ్లు మాత్రం ఇప్పటికీ ఉన్నాయి. అలాంటి నలంద విశ్వవిద్యాలయాన్నిఅదేచోట రాజ్‌గిర్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధునాతంగా మళ్లీ నిర్మించింది. నలంద విధ్వంసాన్ని గుర్తు చేస్తూ, జ్వాలలు జ్ఞానాన్ని నాశనం చేయలేవన్నారు ప్రధాని మోదీ. నలంద అంటే ఒక గుర్తింపు, గౌరవం. నలంద ఒక విలువ, ఒక మంత్రం, ఒక గర్వం, ఒక కథ అన్నారు. పుస్తకాలు అగ్ని జ్వాలల్లో కాలిపోవచ్చు కానీ, అగ్ని జ్వాలలు జ్ఞానాన్ని నాశనం చేయలేవు అనే సత్యాన్ని ప్రకటించేదే నలంద అన్నారు మోదీ.

# ఆహార కల్తీతో అనారోగ్యం



కల్తీ ఆహారాలతో ప్రజారోగ్యం దెబ్బ తింటోంది. కల్తీ ఆహారం వల్ల దీర్ఘకాలంలో మధుమేహం, అధిక రక్తపోటు వంటి అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయి. జీర్ణకోశ సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రమాదకర జబ్బులకు దారితీస్తుంది. రోడ్డు పక్కన ఆహారాలు సాధ్యమైనంత వరకూ తినకపోవడమే మంచిది. దేశంలో రోజు రోజుకూ ఆహార కల్తీ ఎక్కువ అయిపోతుంది. ఏది కొనాలన్నా తినాలన్నా భయపడే రోజులు వచ్చాయి. తమ వ్యాపారం పెంచుకునేందుకు ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటున్నారు. దీంతో వారి వ్యాపారమే కాదు, ఆస్పత్రులు కూడా నిండిపోతున్నాయి. టీ, కాఫీ, పాలు, పిండి, నూనెలు, మాంసం, కంది పప్పు, మిరియాలు, జీలకర్ర, బియ్యం ఇలా నిత్యం వినియోగించుకునే అన్ని పదార్థాలూ కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్టుంది పరిస్థితి. కాసుల కక్కుర్తితో కొందరు వ్యాపారులు సరుకులు కల్తీ చేస్తుండడం, వినియోగదారుల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బ తీస్తోంది. నకిలీ వస్తువులను నియంత్రించాల్సిన విభాగాలను బలోపేతం చేయడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. ఆహార పదార్థాలపై పన్నుల రూపంలో వసూలు చేస్తున్న మొత్తంలో నామమాత్రపు సొమ్మునైనా కల్తీ నియంత్రణ, నిరోధానికి ఖర్చు పెట్టడం లేదన్న ఆరోపణలున్నాయి. నకిలీ సరకులపై న్యాయస్థానాలు స్వయంగా కేసుల్ని స్వీకరించి, మొట్టికాయలు వేసినా, అధికార యంత్రాంగం మందగమనం వీడలేదు.

కల్తీ వస్తువులను విక్రయించే వారిపై దాడులు తూతూ మంత్రమే ఆపుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వినియోగదారులు కూడా కల్తీ ఆహార వస్తువులేవో, అసలువేవో తెలుసుకోవడం అవసరం. ఇందుకు 'భారతీయ ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ' కొన్ని చిట్కాలు సూచిస్తోంది. త్వరగా కల్తీని గుర్తించే పరీక్ష (డి.ఎ.ఆర్.టి) పేరున వీటిని కరదీపికలో పొందుపరిచింది. ఈ మధ్యకాలంలో చికెన్ లాలిపాప్, పకోడీలో చికెన్ వేస్ట్ (కాళ్ళు, స్కిన్, పేగులు) కలపడం సాధారణం. హై వే దాబాలో మాంసంలో కుళ్ళినవి పెడుతున్నారని, చికెన్ బిర్యానీ బదులు కుక్క బిర్యానీ పెడుతున్నారని.. చాలా వార్తలు చదువుతూనే ఉన్నాం. ఒక్క మాంసమే కాదు బయట చేసే ఫాస్ట్ ఫుడ్స్ అన్నింటిలో ఆహార కల్తీ ఉంటుంది. అన్నీ కూడా ఆహారంలో కల్తీ అవుతూనే ఉంటున్నాయి. పరిమితికి మించి రంగులు వాడకం ఎక్కువగా ఉంటున్నది. రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ కాఫీ, టీ స్టాళ్లలో సింథటిక్ పాలు వినియోగం ఎక్కువగా ఉంటున్నది. ఇక ఫాస్ట్ ఫుడ్, టిఫిన్ సెంటర్లలో కల్తీ నూనెలు ఎక్కువగా వినియోగిస్తున్నారు. పానీ పూరీ చేసే ప్రాంతాలు అపరిశుభ్రంగా, పరమ భయంకరంగా వుంటాయి. ఫ్రూట్ సలాడ్, ఐస్ క్రీమ్, ఐస్, నూడుల్స్ తయారు చేసే ప్రదేశాలలో శుచి, శుభ్రత పాటించక అవి తిన్న వారు అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ప్రతి రోజూ తనిఖీ చేయాలి. తయారీ కేంద్రాలను పరిశీలించాలి. ఎక్కువ మోతాదులో రంగుల వాడకాన్ని, కల్తీ పాల వాడకాన్ని నియంత్రించి తగిన చర్యలు తీసుకోవాలి. మన చేతిలో లేని పరిష్కారాల విషయానికి వస్తే రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలి. లేకపోతే వ్యవసాయం చేసే సంఖ్య తగ్గి, కల్తీ ఇంకా పెరుగుతుంది. అలాగే రేట్లు ఇంకా ఇంకా పెరుగుతాయి. కల్తీ మీద ప్రచారం విస్తృతంగా పెరగాలి. వాటి వల్ల కీడు ప్రజలకు తెలియజేయాలి. అతిగా ఫెర్టిలైజర్ల వాడకం, క్యాన్సర్ కారణం అనే విషయాన్ని కూడా తెలియజేయాలి. ఆరోగ్య తనిఖీ అధికారుల సంఖ్య పెరగాలి. వారి అధికారాలు పెరగాలి, కల్తీ చేసిన వారికి కఠిన శిక్షలు వుండాలి. అలాగే ప్రభుత్వం సేంద్రియ ఆహారాన్ని చౌకగా ఉండేట్లు చూడాలి. మంచి ఆహార అలవాట్లు, ఆరోగ్య అలవాట్లు వాటి వల్ల లాభాలు చెప్పి ప్రోత్సహించాలి. అప్పుడు ప్రజలు సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి పెరుగుతుంది. రేట్లు తగ్గుతాయి. ఇళ్లలో, డాబాల మీద, పెరటి తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి. ఆర్గానిక్ కూరగాయలు, పండ్లు పెంచుకోవాలి. బియ్యం, పప్పులు, ఉప్పు, చింతపండు సంవత్సరంలో రెండు సార్లు పెద్ద మొత్తంలో కొంటే కల్తీ బారి నుండి తప్పించుకోవచ్చు.

# కెనడా పార్లమెంట్‌లో నిజ్జర్‌కు నివాళి..

### గట్టి కౌంటర్ ఇచ్చిన భారత్

కెనడా పార్లమెంట్ మంగళవారం హౌస్ ఆఫ్ కామన్స్‌లో ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జార్ మరణించి ఏడాది పూర్తయిన సందర్భంగా కొద్దిసేపు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఇప్పటికే భారత్-కెనడా మధ్య సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇలాంటి తరుణంలో కెనడా మరోసారి కవ్వింపు చర్యలకు పాల్పడింది. అయితే దీనికి భారత్ కూడా గట్టిగానే బదులిచ్చింది. సోషల్ మీడియా ఎక్స్‌లో వాంకోవర్‌లోని భారత రాయబార కార్యాలయం, 1985లో ఎయిర్ ఇండియా కనిష్క విమానంపై ఖలిస్తానీ బాంబు దాడిలో మరణించిన 329 మంది వ్యక్తులకు నివాళలర్పిస్తున్నట్లు పోస్ట్ చేసింది. అలాగే, ఉగ్రవాద ముప్పును ఎదుర్కోవడంలో భారతదేశం ముందంజలో ఉంది, ఈ ప్రపంచ ముప్పును పరిష్కరించడానికి అన్ని దేశాలతో కలిసి పనిచేస్తుంది. ఎయిర్ ఇండియా కనిష్క విమానంపై దాడికి 23 జూన్ 2024 నాటికి 39 ఏళ్లు పూర్తయ్యాయి, ఇందులో 86 మంది చిన్నారులతో సహా ఇతర అమాయకులు తమ ప్రాణాలను కోల్పోయారు, పౌర విమానయాన చరిత్రలో ఇది అత్యంత ఘోరమైన ఉగ్రవాద పిరికిపంద చర్య అని పేర్కొంది. గత ఏడాది జూన్ 18న బ్రిటిష్ కొలంబియాలోని గురుద్వారా వెలుపల కెనడాలోని సర్రేలో జరిగిన కాల్పుల్లో హర్దీప్ సింగ్ చీఫ్ నిజ్జర్ మరణించాడు. ఇదిలా ఉంటే భారత్ విడుదల చేసిన 40 మంది తీవ్రవాదుల జాబితాలో హర్దీప్ సింగ్ నిజ్జర్ పేరు కూడా ఉండటం గమనార్హం. నిజ్జర్ హత్యతో భారత్‌కు సంబంధం ఉందని కెనడా ఆరోపణలు చేయడంతో రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు క్షీణించాయి.



## ఇటలీలో దారుణ ఘటన..



ఇటలీలో అత్యంత అమానవీయ ఘటన వెలుగు చూసింది. పొలంలో పని చేస్తుండగా ఓ భారతీయ కార్మికుడి చేయి ప్రమాదవ శాత్తు మిషన్‌లో పడి తెగిపోయింది. అయితే ఆయనను ఆస్పత్రికి తీసుకెళ్లకుండా పొలం యజమాని రోడ్డుపైనే విడిచి పెట్టి వెళ్లాడు. అనంతరం అతని భార్య ఆస్పత్రికి తరలించగా..పరిస్థితి విషమించి మరణించాడు. వివరాల్లోకెళ్తే..దక్షిణ రోమ్‌లోని లాటినా అనే గ్రామీణ ప్రాంతంలో సత్నామ్ సింగ్(31) అనే భారతీయ కార్మికుడు పొలాల్లో పనిచేస్తూ జీవనం కొనసాగించే వాడు. అయితే ఇటీవల ఆయన ఓ పొలంలో గడ్డి కోస్తుండగా.. ప్రమాదవ శాత్తు ఓ యంత్రం తగిలి చేయి తెగిపోయింది. తీవ్ర గాయాలపాలై కొట్టుమిట్టాడుతున్న ఆయనను ఆస్పత్రికి తీసుకెళ్లకుండా అతని యజమాని సత్నామ్ నివాసముండే ఇంటి ఎదుట రోడ్డుపై విడిచిపెట్టి వెళ్లాడు. ఈ క్రమంలోనే సత్నాం భార్య, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న వారు వెంటనే సత్నాంను చికిత్స నిమిత్తం రోమ్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. దీంతో పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. ఈ ఘటనపై దేశ వ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రమాదం తర్వాత సత్నాం చెత్తకుప్పలా విసిరివేయబడ్డాడని ఇటలీ ట్రేడ్ యూనియన్ పేర్కొంది. ఇదొక భయానక సినిమాను తలపించిందని తెలిపింది. దీనిపై ఇటలీ కార్మిక మంత్రి మెరీనా కాల్డెరోన్ కూడా స్పందించారు. అక్కడి పార్లమెంటులో అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చాడు. ఇదొక అనాగరిక చర్య అని అభివర్ణించారు. ఈ ఘటనపై అధికారులు విచారణ జరుపుతున్నారని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## వాయు కాలుష్య ప్రభావం.. ప్రతి రోజూ 2000 మంది చిన్నారులు మృతి!

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా మానవాళి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో కాలుష్యం ఒకటి. పలు కారణాలతో నానాటికీ పెరిగిపోతున్న కాలుష్యం వల్ల గాలి, నీరు, పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటున్నది.అంతేగాక మానవుని ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కాలుష్యం వల్ల అనేక రకాల వ్యాధుల బారిన పడాల్సి వస్తోంది. దీంతో ప్రపంచ దేశాలన్నింటిలో ఈ సమస్యపై ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో అమెరికాలోని హెల్త్ ఎఫెక్ట్స్ ఇన్‌స్టిట్యూట్ తాజాగా జరిపిన అధ్యయనంలో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. వాయు కాలుష్య ప్రభావంతో ముడిపడి ఉన్న ఆరోగ్య సమస్యలతో ప్రపంచ వ్యాప్తంగా ప్రతిరోజూ దాదాపు 2,000 మంది పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారని తేలింది. అంతేగాక అత్యధికంగా మరణాలకు కారణమవుతున్న విషయంలో వాయుకాలుష్యం రెండో స్థానంలో ఉంది. మొదటి స్థానంలో బీపీ ఉండగా..ఆ తర్వాత స్థానంలో పొగాకు వినియోగం వల్ల ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయి. 2021లో వాయు కాలుష్యం వల్ల 8.1మిలియన్ల మంది మరణించారని తెలిపింది. మొత్తం మరణాల్లో ఇది 12శాతం. వాయు కాలుష్య ప్రభావం చిన్న పిల్లలపైనే ఎక్కువగా ఉంది. ఐదేళ్లలోపు ఉన్న పిల్లలు 7 లక్షల మంది మరణించినట్టు నివేదిక తెలిపింది. ఈ మరణాల్లో 5లక్షల కంటే ఎక్కువ మరణాలు ఆఫ్రికా, ఆసియాలోనే నమోదయ్యాయి. దీనికి ప్రధాన కారణం బొగ్గు, కలప, పేడ వంటి ఇంధనాలు వంట చేయడానికి వాడటమేనని పేర్కొంది. 200కు పైగా దేశాల్లో అధ్యయనం చేసి ఈ నివేదికను రూపొందిచనట్టు హెల్త్ ఎఫెక్ట్స్ ఇన్‌స్టిట్యూట్ పేర్కొంది.

## తమిళనాడులో కల్తీ సారా తాగి తొమ్మిది మృతి

తమిళనాడులోని కల్లాకురిచిలో కల్తీ సారా తాగి ఒక మహిళతో సహా తొమ్మిది మంది మరణించారు. మరో 40మంది అస్వస్థతతో పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారిలో ఏడుగురు పుదుచ్చేరిలోని జిప్‌మర్‌లో వైద్య సాయం తీసుకుంటున్నారని అధికారులు తెలిపారు. మృతదేహాలకు పోస్టుమార్టం చేసిన రిపోర్ట్‌లు వచ్చిన తర్వాతనే మరణాలకు కారణం తెలుస్తుందని చెప్పారు. కల్లాకురిచి టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని కరుణాపురంలో ఈ మరణాలు సంభవించాయి. మృతుల్లో చాలామంది రోజువారీ కూలీలే. కరుణాపురంలో ఒక వ్యాపారి నుండి వీరు కల్తీ సారా కొని తాగినట్లు భావిస్తున్నారు. మంగళవారం వారు తాగారు. ఆ తర్వాత కాసేపటికే వారికి ఊపిరాడకపోవడం, కళ్లు మసకబారడం, తల తిరగడం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించాయి. వీరిలో ముగ్గురు బుధవారం తెల్లవారు జామున ఇంటి వద్దనే మరణించగా, మరో ముగ్గురు కల్లాకురిచి ప్రభుత్వ ఆస్పత్రిలో చనిపోయారు. రోగులందరి బ్లడ్ నమూనాలను తీసుకుని ఫోరెన్సిక్ లేబరేటరీకి పంపించారు. మరో 40మందికి డాక్టర్ల బృందం చికిత్సనందిస్తోంది. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగానే వుంది. మరణాల నేపథ్యంలో బుధవారం ప్రభుత్వం ఈ ఘటనపై సిబిసిఐడి దర్యాప్తునకు ఆదేశించింది. జిల్లా కలెక్టర్‌ను బదిలీ చేసింది. ఎస్పిని సస్పెండ్ చేసింది.

## శ్రీలంక పారిశ్రామిక అభివృద్ధికి.. భారత్ ఎంతో కీలకం

శ్రీలంక పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలంటే భారత్‌తో చేతులు కలపాలని ఆ దేశ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే అన్నారు. తమ ద్వీపదేశాన్ని ఆ దిశగా నడిపించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. తాజాగా ఇండస్ట్రీ 2024 ఈవెంట్‌లో పాల్గొన్న ఆయన శ్రీలంక పారిశ్రామిక ప్రయోజనాల గురించి ప్రస్తావించారు. "మన పొరుగు దేశమైన భారత్ పారిశ్రామిక అభివృద్ధి దశలో ఉంది. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అది స్పష్టంగా కనిపిస్తోంది. మనం కూడా అదే బాటలో పయనించాలంటే భారత్‌తో అనుసంధానం అవసరం" అని ఆ శ్రీలంక అధ్యక్షుడు అన్నారు. ప్రస్తుతం ఉన్న దిగుమతి ఆధారిత ఆర్థిక వ్యవస్థ నుంచి ఎగుమతి ఆధారిత ఆర్థిక వ్యవస్థగా మారడం శ్రీలంకకు ముఖ్యమని దేశ అధ్యక్షుడు వెల్లడించారు. ఇటీవలె భారత పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ తో సింఘే చర్చలు జిరపిన విషయం తెలిసిందే. జూన్ 20న భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ శ్రీలంకలో పర్యటించనున్నట్లు ఆ దేశ విదేశాంగశాఖ వెల్లడించింది. ఈ సమావేశంలో ట్రింకోమలీ జిల్లాలో పారిశ్రామిక జోన్ ఏర్పాటు, మన్నార్‌లో అదానీ గ్రూపునకు చెందిన విండ్ పవర్ ప్రాజెక్టుతో పాటు శ్రీలంకలో భారత్ చేపడుతోన్న అన్ని ప్రాజెక్టులపై చర్చించనున్నట్లు శ్రీలంక అధికారులు పేర్కొన్నారు. మరోవైపు భారత్-శ్రీలంక మధ్య రహదారి ప్రతిపాదనకు సంబంధించి సాధ్యాసాధ్యాలపై చేస్తోన్న అధ్యయనం తుది దశకు చేరుకుందని సింఘే వెల్లడించారు.

## కువైట్ వెళ్లేందుకు కేరళ మంత్రికి అనుమతి నిరాకరణ సమాఖ్య స్ఫూర్తికే విరుద్ధం !



తిరువనంతపురం : మంగాఫిల్ అగ్ని ప్రమాదం నేపథ్యంలో కువైట్ వెళ్లేందుకు ఆరోగ్యమంత్రి వీణా జార్జికి రాజకీయ అనుమతి నిరాకరించిన కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రధానికి లేఖ రాశారు. జూన్12న కువైట్‌లోని మంగాఫ్‌లో సంభవించిన ఘోర అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినవారిలో సగం మంది కేరళీయులేనని, అందుకే రాష్ట్ర ఆరోగ్యమంత్రి వీణాజార్జినికి అక్కడికి పంపాలని కేరళ మంత్రివర్గం నిర్ణయించిందని ముఖ్యమంత్రి ఆ లేఖలో గుర్తు చేశారు. అక్కడికి వెళ్లిన కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి, ఇతర అధికారులు, భారత రాయబార కార్యాలయానికి సంబంధించిన క్యాకలాపాలను సమన్వయం చేయడానికి కేరళ ఆరోగ్యమంత్రి అక్కడ ఉంటే ఎంతగానో ఉపయోగపడేవారన్నారు. బాధితుల కుటుంబ సభ్యులకు మనో స్థైర్యాన్ని ఇచ్చేందుకు ఇది ఎంతగానో తోడ్పడేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున బాధ్యతలు నిర్వర్తించడానికి మంత్రిని కువైట్ వెళ్లకుండా అడ్డుకోవడం అత్యంత శోచనీయమని అన్నారు. 2023 ఫిబ్రవరి28 నాటి కేబినెట్ సెక్రటేరియట్ ఆఫీస్ మెమోరాండం ప్రకారం రాజకీయ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నా అడ్డుకోవడం, ,కేరళ మంత్రివర్గ నిర్ణాయాన్ని సైతం కేంద్రం బేఖాతరు చేయడం సమాఖ్య స్ఫూర్తిని మంటగలిపేదిగా ఉందన్నారు. విపత్తులు సమయంలో బాధితులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐక్యంగా కృషి చేయాలి. ఇలాంటి సందర్భంలో రాజకీయ అనుమతి ఇవ్వడానికి ఎలాంటి రాజకీయ, రాజకీయేతర అడ్డంకులు ఉండరాదని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన సహకార సమాఖ్య వ్యవస్థకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర గౌరవం, విశ్వాసం అవసరమని ఆయన ఆ లేఖలో తెలిపారు.